సంగీత మేరు శిఖరాలు
రూ॥ 120/-
పేజీలు: 138
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం


PRAJAPAKSHAM ★★

భారత విద్యావ్యవస్థ యువతరాన్ని విఫలం చేస్తోంది 07
హెచ్-1బి ఉద్యోగులకు 60 రోజుల గడువు తొలగించే ప్రతిపాదన 08

సంపుటి 09, సంచిక: 283 | శనివారం | 12 -09-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

పాలిటెక్నిక్ కాలేజీలు

# ప్రైవేటీకరణ ప్రశ్నే లేదు



- టెక్నికల్ ఎడ్యుకేషన్ నుంచి యంగ్ ఇండియా యూనివర్సిటీ పరిధిలోకి తీసుకొస్తున్నాం
- ఐటిఐలను ఎటిసిలుగా మార్చి నైపుణ్యాన్ని అందిస్తున్నాం
- మంచి సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తుంటే విద్యార్థుల్లో కొంతమంది అపోహలు సృష్టిస్తున్నారు
- కడుపులో కుళ్లు, పేద పిల్లలపై ద్వేషంతో కుట్రలు చేస్తున్నారు
- బిఆర్‌ఎస్ నేతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపాటు
- అసెంబ్లీలో విద్యాశాఖ కార్యక్రమాలపై జరిగిన స్వల్పకాలిక చర్చకు సిఎం సమాధానం

ప్రజాపక్షం/హైదరాబాద్

"ప్రభుత్వం ఒక మంచి సంకల్పంతో పని చేస్తుంటే కొంత మంది విద్యార్థుల్లో అపోహలు కలిగిస్తున్నారు. పాలిటెక్నిక్ కాలేజీలు ప్రైవేటు పరం అవుతాయని దుష్ప్రచారం చేస్తున్నారు. పాలిటెక్నిక్ కాలేజీల ప్రైవేటైజేషన్ అనే ప్రసక్తే లేదు. పాలిటెక్నిక్ కాలేజీలు ప్రైవేటుపరం చేయబోము. ఇప్పటి వరకు ప్రభుత్వంలో ఎలా ఉన్నాయో అలాగే ఉంటాయి. కేవలం టెక్నికల్ ఎడ్యుకేషన్ నుంచి యంగ్ ఇండియా యూనివర్సిటీ పరిధిలోకి తీసుకొస్తున్నాం. విద్యార్థులలో అపోహలను తొలగిస్తాం. జీఓ 97ను సవరణ చేస్తాం" అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఐటిఐ లను ఎటిసిలుగా మార్చి టాటా సహకారంతో నైపుణ్యాన్ని అందిస్తున్నామని, అలాగని ఐటిఐలను ప్రైవేటు పరం చేసినట్టా? అని తరువాయి 8లో

## విద్యారంగ హక్కులు కేంద్రం లాక్కుంటోంది

నీట్ పరీక్షా విధానాన్ని రాష్ట్రాలకే వదిలేసేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి

సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్

విద్యా రంగం పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిపై సిపిఐ శాసనసభ పక్ష నేత కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిఎస్‌టితో పాటు విద్యా రంగ హక్కులను కూడా కేంద్రం లాక్కుంటోందని ఆయన విమర్శించారు. మెడికల్ పరీక్షల నిర్వహణ సరిగ్గా లేకపోవడం, ప్రశ్నపత్రాల లీకేజీలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, రాష్ట్రంలో లేదా కేంద్రంలో లీకేజీలు జరిగితే అందరిపై బాధ్యత ఉందన్నారు. నీట్ పరీక్షా విధానాన్ని రాష్ట్రాలకే వదిలేసేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని సూచించారు. శాసనసభలో శుక్రవారం విద్యారంగంపై జరిగిన లఘు చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలను ప్రభుత్వం తరువాయి 8లో

భారత యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం విలీనం

# అధికారికంగా నిర్వహించాలి

కమ్యూనిస్టుల పోరాటం, యోధుల పేర్లనే ప్రభుత్వాలు వాడుకుంటున్నాయి




- నిజాం నిరంకుశ పాలన విముక్తికి నాయకత్వం వహించిన సిపిఐ, ఎర్రజెండా పేర్లను చెప్పకపోవడం దారుణం
- చరిత్రను హైజాక్ చేస్తున్నాయి
- తెలంగాణ సాయుధపోరాట వారోత్సవాల్లో వక్తలు
- హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తి యాత్ర రెడ్‌షర్ట్ వలంటీర్లతో భారీ ప్రదర్శన

ప్రజాపక్షం/హైదరాబాద్

నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ సంస్థానం విముక్తి పొంది భారత యూనియన్‌లో విలీనమైన సెప్టెంబర్ 17న ప్రభుత్వం అధికారికంగా విలీన దినోత్సవాన్ని నిర్వహించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 17వ తేదీ వరకు ఉత్సవాలను సాగనున్నాయి. ఉత్సవాల ప్రారంభోత్సవంలో భాగంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఉన్న మఖ్దూంమొహియుద్దీన్ విగ్రహానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, తరువాయి 12లో




రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు ప్రారంభం

'జనగణన- 2027' ప్రశ్నావళి జాబితాలో

# బిసి/ఒబిసిని చేర్చాలి



- కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం
- సభలో తీర్మానం ప్రవేశపెట్టిన రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం
- కాంగ్రెస్, ఎంఐఎం, సిపిఐ మద్దతు – బిజెపి వాకౌట్

రాష్ట్రాల వారీగా ఒబిసి లెక్కలు తీయాలి : కూనంనేని

ప్రజాపక్షం/హైదరాబాద్

'జనగణన 2027' రెండో దశ ప్రశ్నావళి జాబితాలో బిసి/ ఒబిసిని చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశ పెట్టగా, కాంగ్రెస్, ఎంఐఎం, సిపిఐ మద్దతు ప్రకటించగా బిజెపి సభ నుంచి వాకౌట్ చేసింది. 'జనగణన 2027'ను రెండవ దశ ప్రశ్నావళి జాబితాలో బిసి/ ఒబిసిలను చేర్చాలనే అంశంపైన శాసనసభలో శుక్రవారం స్వల్పకాలిక చర్చ జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ 'జనగణన2027లో ఒబిసిల'ను చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనిపైన జరిగిన చర్చలో సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివ రావు, కాంగ్రెస్ సభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఆదిశ్రీనివాస్, బిజెపి సభ్యులు పాయల శంకర్, ఎంఐఎం సభ్యులు మొహ్మద్ మాజిద్ హుస్సేన్, సభ్యులు దానం నాగేందర్ పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, విద్యా, ఉద్యోగ, రాజకీయ ప్రాతినిధ్యం నిమిత్తం దేశ వ్యాప్తంగా ఒబిసిల జనాభా గణాంకాలు కచ్చితంగా ఉండాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే ద్వారా రాష్ట్రంలోని తరువాయి 8లో

## రైతులకు సబ్సిడీపై యంత్రాలివ్వాలి



- నాణ్యమైన వ్యవసాయ పరికరాలు అందించాలి
- అసెంబ్లీలో సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి ప్రభుత్వానికి విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులకు నాణ్యమైన వ్యవసాయ యంత్రపరికరాలు అందించాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో వ్యవసాయ యాంత్రపరికరాల నాణ్యతపై ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి కూలీల కొరత ప్రధాన సమస్యగా మారిన నేపథ్యంలో రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలను ప్రభుత్వం అందిస్తున్నదని, కానీ, నాణ్యమైన పరికరాలకు బదులుగా నాసిరకం పరికరాలను పంపిణీ చేస్తున్నారని తరువాయి 8లో

వ్యవసాయ మోటార్లకు

# మీటర్లు పెట్టం




- రైతులకు, వారి కుటుంబాలకు 100 శాతం హామీ ఇస్తున్నాం
- మీటర్లపై అనవసర భయాలు, అపోహలు సృష్టించొద్దు
- కేంద్రంతో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం 'ఉదయ్' పథకం కింద త్రైపాక్షిక ఒప్పందం చేసుకుంది
- శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

వ్యవసాయ మోటార్లు, పంపుసెట్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. భూమి ఆకాశం ఏకమైనా, ఎవరు ఒత్తిడి తెచ్చినా వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు అమర్చబోమని రాష్ట్ర రైతులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున 100 శాతం హామీ ఇస్తున్నానని అన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడతారంటూ రైతుల్లో అనవసర భయాలు, అపోహలు సృష్టించవద్దని కోరారు. వ్యవసాయ పంపుసెట్ల విషయంలో ప్రభుత్వం తన వైఖరిని ఇప్పటికే స్పష్టంగా వెల్లడించిందని, ఇందులో ఎలాంటి మార్పు ఉండదని డిప్యూటీ సిఎం పేర్కొన్నారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు దేశపతి శ్రీనివాస్ ప్రశ్నకు డిప్యూటీ సిఎం సమాధానమిచ్చారు.

**బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే 'ఉదయ్' ఒప్పందం**

వ్యవసాయ పంప్సెట్లకు మీటర్లు పెట్టాలన్న నిబంధన ఆర్‌డిఎస్‌ఎస్‌లో లేదని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. అంతకుముందే గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్రంతో ఉదయ్ పథకం కింద త్రైపాక్షిక ఒప్పందం చేసుకుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం,కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ, తెలంగాణ డిస్కమ్‌లు కలిసి ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయని చెప్పారు. 2017 జూన్ 30 నాటికి 100 శాతం డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డిటి) మీటరింగ్ పూర్తి చేయాలని, 2018 డిసెంబర్ 31 నాటికి వ్యవసాయ వినియోగదారులు తరువాయి 8లో



తెలంగాణ సాయుధ పోరాటాన్ని

## భవిష్యత్ తరాలకు అందించాలి

- సెప్టెంబర్ 17 అంటే హిందూ, ముస్లిం వివాదం కాదు
- అసెంబ్లీలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని ప్రస్తావన

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ చరిత్రాత్మక 'తెలంగాణ సాయుధ పోరాటాన్ని 'రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించాలని, ఆ వీరగాథను పాఠ్యాంశాల్లో చేర్చి, రాబోయే తరాలకు అందించాలని సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17 అంటే హిందూ, ముస్లిం వివాదం కాదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి శషబిషలు లేకుండా 'విలీన దినోత్సవం'గా అధికారికంగా నిర్వహించాలని కోరారు. భయపడాల్సిన అవసరం తరువాయి 8లో

## ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీమాన్, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్

యాదగిరిగుట్టలో జరిగిన నాలుగవ రాష్ట్ర మహాసభలో నూతన కార్యవర్గం ఎన్నిక



శ్రీమాన్ శ్రీకాంత్

ప్రజాపక్షం/ హైదరాబాద్

యాదగిరి గుట్టలో ఈనెల 8, 9, 10వ తేదీల్లో ఎఐవైఎఫ్ రాష్ట్ర నాలుగవ మహాసభలు ఘనంగా జరిగాయి. మహాసభల్లో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మర్రి శ్రీమాన్ (ఖమ్మం), ప్రధాన కార్యదర్శిగా నేర్లకంటి శ్రీకాంత్ (హైదరాబాద్),కార్యనిర్వహక అధ్యక్షుడుగా రాము (మహబూబ్‌నగర్), డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా పేరబోయిన మహేందర్ (యాదాద్రి) ఎన్నికయ్యారు. 71 మందితో నూతన కౌన్సిల్, 29 మందితో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ , జాతీయ కార్యవర్గ సభ్యుడు కల్లూరి ధర్మేంద్రలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నూతన అధ్యక్ష కార్యదర్శులు మర్రి శ్రీమాన్, నెర్లకంటి శ్రీకాంత్‌తో కలిసి వారు వివరాలను వెల్లడించారు. కేంద్రంలోని బిజెపి, తరువాయి 12లో



ఐదు రోజుల పనిదినాలు

# అమలు చేయాల్సిందే

- బ్యాంకు ఉద్యోగులు, అధికారుల న్యాయమైన డిమాండ్లనూ పరిష్కరించాలి
- ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జాతీయ చైర్మన్ అనిల్‌కుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్

బ్యాంకు ఉద్యోగులు, అధికారుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ మొండిగా వ్యవహరిస్తున్నాయని ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జాతీయ చైర్మన్ అనిల్‌కుమార్ వెల్లంకి విమర్శించారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ తరువాయి 12లో

ఉక్రేన్ వివాదం ముగింపునకు

# ఏ చొరవకైనా భారత్ సిద్ధం

- రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ భేటీ
- నల్ల సముద్రంలో భారతీయ నావికుల భద్రతపై చర్చ

నేటి నుంచి 'బ్రిక్స్' సదస్సు ప్రారంభం




**న్యూఢిల్లీ :** 'బ్రిక్స్' శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యేందుకు న్యూఢిల్లీ చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధానమంత్రి నరేంద్రమోదీ భేటీ అయ్యారు. పెరుగుతోన్న భౌగోళిక రాజకీయ అస్థిరత మధ్య ఇరుదేశాధినేతలు ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను పెంపొందించుకోవడానికి అంగీకరించిన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో నల్ల సముద్రంలోని భారత నావికుల భద్రత విషయాన్ని ప్రస్తావించారు. ఉక్రెయిన్ వివాదాన్ని ముగించడానికి చేపట్టే ఏ చొరవకైనా మద్దతు ఇవ్వడానికి తరువాయి 8లో

# సరిహద్దు ఉద్రిక్తతలకు చర్చలే పరిష్కారం

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య జరగబోయే భేటీ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇది కేవలం ద్వైపాక్షిక సమావేశం మాత్రమే కాదు.. భారత్‌–చైనా సంబంధాల నుంచి 2020లో, తూర్పు లఢఖ్‌లో ఏర్పడిన సైనిక ఘర్షణ వరకు ఎన్నో అంశాలపై ఒక అవగాహనకు వచ్చే అద్భుత అవకాశం. నాటి నుంచి ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, చోటు చేసుకుంటున్న పరిణామాలు, సరిహద్దులో శాంతి పునరుద్ధరణకు జరుగుతున్న ప్రయత్నాలు నేడు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి, మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న యుద్ధాలు, వాణిజ్య ఉద్రిక్తతలు, ఆర్థిక ఆంక్షలు సైతం ఈ సమావేశానికి అసాధారణ ప్రాధాన్యం ఇస్తున్నాయి. జిన్‌పింగ్ ఈనెల 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే 18వ 'బ్రిక్స్' శిఖరాగ్ర సమావేశానికి హాజరవుతున్న తరుణంలో, ఏడేళ్ల తర్వాత జరుగుతున్న ఆయన భారత దేశ పర్యటన ఉత్కంఠ రేపుతున్నది. ఈ సందర్భంగా మోదీతో జరిగే ద్వైపాక్షిక సమావేశాన్ని వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృష్టితో చూస్తున్నట్లు చైనా విదేశాంగ శాఖ కూడా స్పష్టం చేసింది. ఇరుదేశాలు విభేదాలను సమర్థంగా నిర్వహించుకోవాలని, పరస్పర సంబంధాల్లో సంభాషణను పెంచాలని, సహకారాన్ని విస్తరించాలని చైనా ప్రకటించడం ఆశాజనకమైన వాతావరణాన్ని కల్పిస్తున్నది. భారత్, చైనా మధ్య అన్ని సమస్యలు ఒక్క సమావేశంతో పరిష్కారమవుతాయని అనుకోవడం అత్యాశే. సరిహద్దు వివాదం దశాబ్దాలుగా కొనసాగుతోంది. అయితే సమస్యలను పరిష్కరించడానికి నాయకులు మాట్లాడటం, అధికార యంత్రాంగాలు నిరంతరం సంప్రదింపులు జరపడం, సైనిక స్థాయిలో కూడా ప్రత్యక్ష సమాచార మార్పిడి కొనసాగించడం అత్యవసరం. ఘర్షణలకు దిగడం, యుద్ధం ప్రారంభించడం సులభం. దాని పరిణామాలను నియంత్రించడం కష్టం. ఒక చిన్న సరిహద్దు సంఘటన కూడా పెద్ద సైనిక చర్యగా మారే ప్రమాదం ఉంది. భారత్, చైనా వంటి అణ్వస్త్ర దేశాల విషయంలో ఇది మరింత తీవ్రం. అందుకే సరిహద్దులో తుపాకులు మాట్లాడే పరిస్థితి రాకుండా, ఇరుదేశాల ప్రతినిధులు మాట్లాడే వ్యవస్థను బలపరచడం అత్యంత కీలకం. ఇటీవల ఆ దిశగా ఒక ముఖ్యమైన అడుగు పడింది. ఆగస్టు 25న బీజింగ్‌లో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి నేతృత్వంలో సరిహద్దు అంశంపై ప్రత్యేక ప్రతినిధుల 25వ దఫా చర్చలు జరిగాయి. ఆ సమావేశంలో ఇరుపక్షాలు ఎనిమిది అంశాలపై ఏకాభిప్రాయానికి వచ్చాయి. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతతను కొనసాగించడం, సరిహద్దు పరిష్కారానికి చర్చలను ముందుకు తీసుకెళ్లడం, సరిహద్దు నిర్వహణను మెరుగుపరచడం, సమస్యలు తలెత్తితే దౌత్య, సైనిక మార్గాల ద్వారా వేగంగా పరిష్కరించడం వంటి అంశాలు అందులో ఉన్నాయి. తూర్పు, మధ్య సెక్టార్లలో అదనపు సైనిక సమావేశ కేంద్రాలు, కొత్త సరిహద్దు హాట్‌లైన్ మార్గాలను ఏర్పాటు చేయడానికి ఇరుదేశాలు అంగీకరించాయి. సరిహద్దు వాణిజ్యం, కైలాస మానస సరోవర్ యాత్ర, సరిహద్దు ప్రాంతాల సహకారం, అంతర్ సరిహద్దు నదులపై సమాచార మార్పిడి వంటి అంశాలను కూడా చర్చల పరిధిలోకి తీసుకువచ్చాయి. వచ్చే ఏడాది భారత్‌లో 26వ దఫా ప్రత్యేక ప్రతినిధుల చర్చలు నిర్వహించడానికి కూడా అంగీకరించాయి. ఈ పరిణామాలన్నీ మోదీ–జిన్‌పింగ్ భేటీకి ముందు చోటుచేసుకున్న సానుకూల పరిణామాలు.

2020లో లఢఖ్‌లో ఏర్పడిన తీవ్ర ప్రతిష్ఠంభన తర్వాత ఇరుదేశాల సంబంధాలు దాదాపు నిలిచిపోయాయి. సరిహద్దులో సైనిక మోహరింపులు పెరిగాయి. అలాంటి పరిస్థితిలో మళ్లీ ఉన్నతస్థాయి రాజకీయ సంభాషణ ప్రారంభం కావడం ఒక ముఖ్యమైన మార్పు. చర్చలు జరపడం అంటే, సమస్య పరిష్కారమైందని అర్థం కాదు. అయితే, సమస్య పరిష్కారానికి చర్చ మార్గం తెరుస్తుంది. భారత్ తన భద్రతా ప్రయోజనాలను వదులుకోకుండానే చైనాతో మాట్లాడవచ్చు. చైనా కూడా తన ప్రయోజనాలను కాపాడుకుంటూనే భారత్‌తో చర్చలు కొనసాగించవచ్చు. దౌత్యం అంటే ఒక దేశం మరొక దేశానికి లొంగిపోవడం కాదు. విభేదాలను యుద్ధానికి దారితీయకుండా నిర్వహించగల రాజకీయ పద్ధతి. మోదీ–జిన్‌పింగ్ మధ్య జరిగే భేటీ కేవలం సరిహద్దు సమస్యకే పరిమితం కాదు. భారత్, చైనా రెండూ ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఉన్నాయి. రెండు దేశాల జనాభా కలిపితే ప్రపంచ జనాభాలో దాదాపు సగభాగం. తయారీ, సాంకేతికత, ఔషధాలు, మౌలిక వసతులు, ఇంధనం, వాణిజ్యం, సరఫరా గొలుసులు వంటి అనేక రంగాల్లో ఇరుదేశాల నిర్ణయాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతాయి. సరిహద్దులో శాంతి నెలకొంటే దాని ప్రయోజనం కేవలం సైనిక రంగానికే పరిమితంకాకుండా, సరిహద్దు భద్రత కోసం ఖర్చయ్యే వనరులను ఇరుదేశాలు ఆర్థికాభివృద్ధి, విద్య, ఆరోగ్యం, సాంకేతిక పరిశోధన, మౌలిక సదుపాయాలు వంటి రంగాలకు మరింతగా మళ్లించే చర్యలకు మార్గాలను సుగమం చేస్తుంది. వ్యాపార వర్గాలకు స్థిరత్వం వస్తుంది. పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. ప్రజల మధ్య సంబంధాలు పెరుగుతాయి.

ఇక్కడ విభేదాలు లేకపోతే దేశాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి అనే సూత్రాన్ని మరింత విస్తృతంగా చూడాలి. దేశాల మధ్య ప్రతి సమస్యకూ శాశ్వత పరిష్కారం సాధ్యం కాకపోవచ్చు. కానీ విభేదాలు యుద్ధంగా మారకుండా నియంత్రించవచ్చు. భారత్, చైనా తమకు ఉన్న సమస్యలను నిర్వహిస్తూ సహకరించే రంగాలను విస్తరించగలిగితే రెండు దేశాలకు ప్రయోజనం కలుగుతుంది. కాగా, ప్రస్తుతం ప్రపంచ పరిస్థితి కూడా ఈ సహకారాన్ని మరింత అవసరంగా మారుస్తోంది. ఇరాన్‌పై అమెరికా దాడులు, హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు, నిరంతర ఘర్షణల ప్రభావం మధ్య ప్రాచ్యంతోపాటు, యావత్ ప్రపంచంపై పడుతున్నది. చమురు ధరలు పెరిగాయి. అంతర్జాతీయ నౌకాయానం ప్రమాదంలో పడింది. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ ఒత్తిడి పెరిగింది. మరోవైపు క్యూబాపైన కూడా ఆంక్షలు విధిస్తూ, అమెరికా తన పెత్తందారీ వైఖరిని ప్రదర్శిస్తున్నది.

ప్రపంచం ఒకేసారి అనేక భౌగోళిక రాజకీయ సంక్షోభాలను ఎదుర్కొంటున్న సమయంలో భారత్, చైనా మధ్య సంబంధాల్లో స్థిరత్వం మరింత విలువైనదిగా మారుతోంది. ఇక్కడ అమెరికాను వ్యతిరేకించడమే భారత్, చైనా సహకారానికి కారణం కావాల్సిన అవసరం లేదు. ఇరుదేశాల ప్రయోజనాలు, ఆసియా శాంతి, ప్రపంచ దక్షిణ దేశాల ఆర్థిక ప్రయోజనాలు వంటి అంశాలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ సమావేశం ద్వారా, రెండు దేశాలు తమ సరిహద్దులను కాపాడుకోవచ్చు. తమ భద్రతా ప్రయోజనాలను కాపాడుకోవచ్చు. అదే సమయంలో చర్చల తలుపులు తెరిచి ఉంచవచ్చు. అంతేగాక, ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో భారత్, చైనా రెండూ ఆ ప్రమాదాన్ని తగ్గించాల్సిన బాధ్యత కలిగిన ప్రధాన శక్తులు. అందుకే ఈ సమావేశం ప్రాధాన్యత ద్వైపాక్షిక సంబంధాల సరిహద్దులను దాటి ఆసియా శాంతి, ప్రపంచ స్థిరత్వం వరకు విస్తరిస్తోంది. ●



## ఆంక్షలు పెరుగుతున్నా ... ఆర్థిక సంబంధాలు బలోపేతం

**నేడు ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యపరమైన ఆంక్షలు (ట్రేడ్ బారియర్స్) పెరుగుతున్నప్పటికీ, భారత్ మాత్రం ఆర్థిక సంబంధాల్ని బలోపేతం చేస్తోంది. ఆర్థిక వారధుల్ని నిర్మిస్తోంది. 2014 నుంచి మేము దాదాపు 40 దేశాలతో స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నాం. అందుకే బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న ఈ వేళ భారత్ వ్యవసాయం, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, స్మార్ట్ గ్రిడ్స్ వంటి రంగాల్లో కొత్త సహకార నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేశాం.**

– నరేంద్ర మోదీ, భారత ప్రధాన మంత్రి

## దళిత ఆత్మగౌరవంపై దాడి!

మన భారత రాజ్యాంగం పౌరులందరికీ సమానత్వం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, స్వయంప్రతిపత్తితో కూడిన ఆత్మగౌరవాన్ని కల్పించి ఏడు దశాబ్దాలు దాటినా, క్షేత్రస్థాయిలో ఇంకా బానిసత్వపు ఆనవాళ్లు, దొరతనపు అహంకారం స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నాయి. ఇటీవల ఎర్రవల్లిలోని కెసిఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో చోటుచేసుకున్న సంఘటనలు ఈ సమాజపు నైతికతను, అధికార వర్గాల భూస్వామ్య మానసికత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఫామ్‌హౌస్ పరిసరాల్లోకి లేదా ఆ ప్రాంగణంలోకి దళితులు వచ్చారనే ఒక్క కారణంతో, వారు వెళ్లిపోయిన తర్వాత అక్కడ పసుపు నీళ్లు చల్లి కడిగి శుద్ధి చేయడం అనేది కేవలం ఒక ప్రాంతానికి లేదా కొందరు వ్యక్తులకు పరిమితమైన చిన్న సంఘటన కాదు; అది ఈ నేల పైన ఉన్న సమస్త దళిత, గిరిజన సామాజిక వర్గాల ఆత్మగౌరవంపై జరిగిన ఘోరమైన, క్షమించరాని దాడి.

భారత రాజ్యాంగంలోని 17వ అధికరణం స్పష్టంగా అంటరానితనాన్ని ఏ రూపంలో ఉన్నా పూర్తిగా నిషేధించింది. కానీ, అధికారం, కొండంత ఆస్తి, రాజకీయ బలం ఉన్నచోట ఆ రాజ్యాంగ ప్రాథమిక హక్కులు తీవ్రంగా తుంగలో తొక్కబడుతున్నాయి. చట్టం ముందు అందరూ సమానులే అయినప్పుడు, పౌరుల ప్రాథమిక హక్కులకు తీవ్రమైన భంగం కలిగించినప్పుడు ఎంతటి పెద్ద నాయకుడైనా, ఏ హోదాలో ఉన్నవారైనా చట్టపరమైన బాధ్యత వహించాల్సిందే. ఇటువంటి తీవ్రమైన చర్యలపై అత్యున్నత న్యాయస్థానాలు నేరుగా జోక్యం చేసుకుని విచారణలకు ఆదేశించినప్పుడే, రాజ్యాంగంపై, చట్టంపై సామాన్యుడికి నమ్మకం నిలుస్తుంది. దళితులు, గిరిజనులు కేవలం ఓటు బ్యాంకు మాత్రమే కాదు; వారు ఈ నేల అసలైన యజమానులు, శ్రమజీవులు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాస్వామ్య వ్యవస్థ నడుపుతున్నామని చెప్తూనే, లోపల భూస్వామ్య అహంకారాన్ని పెంచి పోషించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పుగా మారింది. ఆత్మగౌరవం అనేది ప్రతి పౌరుడికి పుట్టుకతో వచ్చిన రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక హక్కు.

### రాజకీయ వ్యవస్థకు ప్రమాద ఘంటికలు..

# పతనావస్థలో ప్రజాప్రతినిధుల ప్రవర్తన



చాడ వెంకటరెడ్డి
మాజీ శాసనసభ్యులు
సిపిఐ సీనియర్ నాయకులు

గడిచిన మూడు రోజులుగా శాసనసభ వర్షాకాల సమావేశం సందర్భంగా చోటు చేసుకుంటున్న ఘటనలు ప్రజాస్వామిక వాదులు బాధపడుతున్నారు. స్పీకర్‌ను దూషించడం నా యావత్తు రాజకీయ జీవితంలోనే చూడలేదు. అదే మాదిరిగా ఎమ్మెల్యేలు, ఎంఎల్సీలు ప్రవర్తిస్తున్న తీరు చూస్తే భావితరాలకు ఏమి నేర్పిస్తున్నామని ప్రశ్న ఎదురవుతోంది. అసలు దేశ భవిష్యత్తు ఏమవుతోందనే ఆందోళన కలుగుతోంది. ఇప్పటికే జెన్ జీ ఉద్యమం కొంత కదలిక తెచ్చింది. రాజకీయ వ్యవస్థలో మార్పుకు ఎంతో అవసరం ఉన్నది. 10 సంవత్సరాలుగా దేశ వ్యాప్తంగా పార్లమెంట్, అసెంబ్లీలలో ప్రజాసమస్యలపై చర్చించడానికి బదులుగా రాజకీయ ప్రమేయంతో తిట్ల పురాణంతో దిగజారుడు భాష వాడటాన్ని సభ్య సమాజం తలదించుకుంటుంది.

ఎంపిలు, ఎమ్మెల్యేలు క్రిమినల్ కేసులు కలిగి ఉండటం, కార్పోరేట్ అధిపతులుగా లేదా గుత్తేదారులుగా ఉన్నవారే ఎక్కువగా ఉండటంతో ఎన్నికలు వ్యాపారం, పెట్టుబడి పెట్టడం డబ్బును ఇమ్మడి ముమ్మడిగా సంపాదించుకోవడాని కి అలవాటుపడినారు. ఆ ప్రమేయంతో ఎన్నికలప్పుడు అరచేతిలో స్వర్గం చూపిస్తూ, మరోవైపు దిగజారిన పద్ధతులలో ఎన్నికలను కలుషితం చేయడం పరిపాటిగా మారిపోయింది. చట్టసభలెందుకు? ఒక పార్టీ వారు, మరోపార్టీ వారిపై దుమ్మెత్తి పోయడానికి ఎక్కువ సమయాన్ని ఉపయోగించుకోవడంతో దూషణలు భూషణలతో దుశ్శాసన పర్వాన్ని సభలు తలపిస్తున్నాయి. సభలో హుందాతనంగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు పూర్తిగా దిగజారి బజారు భాషలో తిట్టుకోవడాన్ని ప్రజలు చీదరించుకుంటున్నారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదు. ఇది రాచరిక వ్యవస్థ కాదు. ప్రజాస్వామ్యంలో ప్రజల చేత, ప్రజల ద్వారా ప్రజల కొరకు ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు. స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంట్, సహకార సంఘాలలో ఎన్నుకోబడే వారు ప్రతినిత్యం ప్రజల భాగస్వామ్యంతో ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై అధికార యంత్రాంగం దృష్టికి తెస్తూ పరిష్కారం చేయడం లేదు. ఎలా కోట్లు సంపాదించుకోవాలనే ఆకాంక్షతో ప్రజాసేవ మరిచి, స్వంత సంపాదనకే పరిమితమై విచ్చలవిడిగా సంపాదనకు ఎగబడుతున్నారు. దీంతో అధికారులలో చులకనభావం ఒకింతైతే కంచే చేను మేసిన చందంగా ప్రజల పక్షంగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు అక్రమ సంపాదనకు మొగ్గ చూపితే, ప్రభుత్వ యంత్రాంగం మరింత అక్రమ సంపాదన కు పాల్పడటం సహజం. 'యధారాజా తధా ప్రజా' సామెతకు ఈనాటి ప్రజాస్వామ్యం నిలయంగా మారడం దుర్మార్గం. ప్రజాప్రతినిధుల దిగజారిన పాత్ర వలన సమాజంలో అన్ని వ్యవస్థలపైన ఈ ప్రభావం పడుతున్నది.

న్యాయవ్యవస్థ స్వతంత్ర వ్యవస్థ. అయినప్పటికీ న్యాయమూర్తుల నియామకాలలో రాజకీయ జోక్యం, ఎన్నికల వ్యవస్థ స్వతంత్రత కలిగి ఉన్నప్పటికీ అది కూడా నేడు అనేక విమర్శలకు గురవుతున్నది. ప్రధానంగా బ్యూరోక్రసీ ప్రభుత్వ యంత్రాంగంలో పోలీస్ వ్యవస్థ ఎవరు అధికారంలో ఉంటేవారికి ప్రోటోకాల్ పాటించాల్సిందే కాని అధికారంలో ఉన్న వారికి అణిగి, మణిగి ఉండే పరిస్థితులు దాపురించడం దురదృష్టకరం. అలాగే రెవెన్యూ ఇతర శాఖలు దాదాపు అన్నింటి పై అధికార పార్టీ ప్రభావం ఉండటం ప్రజాసేవలు మానసిక వ్యవస్థకు గురికావడం కాదు. ప్రజాస్వామ్యం ఎటుమలుపు తిరుగుతున్నదో అనే మాటలో పడిపోతున్నారు.



2004లో అమరజీవి గద్దరన్న పాటలో పేర్కొన్నట్లుగా వాడి నోట వీడి మాట, వీటి నోట వాడి మాట, అంటే టిడిపి ప్రధాన ప్రతిపక్షం, కాంగ్రెస్ అధికార పక్షం, అంతకంటే ముందు టిడిపి అధికార పక్షం, కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత టిఆర్ఎస్ అధికారపక్షం కాంగ్రెస్ ప్రధానపక్షం అయితే ఎమ్మెల్యేల ఫిరాయింపుల పర్వం కొనసాగింది. ఇప్పుడు కాంగ్రెస్ అధికారపక్షం, టిఆర్ఎస్ ప్రధానప్రతిపక్షం ఇలాంటి మార్పులు ప్రజాస్వామ్య వ్యవస్థలోనే సాగుతాయి. అధికార పక్షం పాత్ర ఎలా ఉండా లి. గత ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతూనే ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు పూనుకోవాలి. ప్రధానపక్షం, ప్రతిపక్ష పార్టీల విమర్శలను అందులో మంచిని గుర్తించి నిర్మాణాత్మ క పాత్రను పోషించాలి. ఇక్కడ ప్రజాసమస్యలను విస్మరించి, నువ్వెంత అంటే నువ్వెంత, నువ్వు దొంగవంటే నువ్వే దొంగవు అంటూ రోజు ఏదో రకంగా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్రతిపక్షం, ప్రతిపక్షాలను ఇరుకున పెట్టాలని అధికారపక్షం ఒకరిమీద ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభలు సజావుగా సాగడం లేదు. ప్రజాసమస్యలు పరిష్కరించబడినట్లుగా ఒక ఉదాహరణగా తీసుకుంటే ఒక్క కేరళ రాష్ట్రంలో తప్ప మిగతా ఏ రాష్ట్రం లేదు. పేదరికంలో ఉన్న వారిని గుర్తించినవారికి గుర్తింపుకార్డులు ఇవ్వకుండా తెలంగాణలో 90శాతంపైబడి తెల్లరేషన్‌కార్డులు ఉన్నాయంటే పారదర్శకత ఏది? ఓట్ల రాజకీయాలు తప్ప, ప్రజాసంక్షేమా న్ని విస్మరించడమే అవుతుంది. అసలైన పేదలకు అన్యాయమే జరుగుతుంది. ఎన్నికలప్పుడు అరచేతిలో స్వర్గం చూపిస్తారు.

వర్షాకాల సమావేశాలను గీటురాయిగా తీసుకుంటే, సభ సజావుగా జరిగిన రోజులెన్ని అనేది గమనించాలి. ఒక గంటకు ప్రభుత్వంపై ఆర్థిక భారం ఎంత పడుతుందనేది చర్చించాలి. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి దూషణతో కాలాన్ని వృధా చేయడం దుర్మార్గం. అధికారపక్షం, ప్రధాన ప్రతిపక్షం, ప్రతిపక్షాలకు సమస్యలపై లేవనెత్తే అవకాశం కల్పించాలి. ప్రతి సందర్భంలోను స్పీకర్‌ను ఉపయోగించి సభను వాయిదా వేయడం జరుగుతుంది. వాయిదా వేసి వెళ్లిపోవడం దేనికి సంకేతం అనేది విజ్ఞులు చర్చించాలి. దీని ప్రభావం శాసనసభలపై పడుతుంది. అందుకని తరతమ బేధాలు లేకుండా ఒక కేరళ అసెంబ్లీ కొంచెం మెరుగుగా ఉన్నా మిగతావన్నీ ఒకే మూసలో కొనసాగుతున్నాయి. అధికార వర్గానికి ప్రజాసమస్యల పరిష్కారం కంటే ప్రతిపక్షాల నోళ్లు నొక్కడానికే ప్రాముఖ్యతనిస్తారు. అందుకని ప్రజాసమస్యలు చర్చించబడవు. దీనిపై దేశ వ్యాపితంగా చర్చాగోష్టులు జరగాలి. పారదర్శకత, జవాబుదారీతనాన్ని అధికార ప్రతిపక్షాలు పుణికిపుచ్చుకోవాలి. అప్పుడే ప్రజాస్వామ్యానికి అర్థం, పరమార్థముంటుంది.



పెద్దచేప చిన్న చేపను మింగుతున్నట్లుగా స్థానిక సంస్థలపై ఎమ్మెల్యేల, ఎంపిల పెత్తనం సాగడం దారుణం. 73,74 రాజ్యాంగ సవరణకు అర్థం లేకుండా పోయింది. ఒక కేరళ రాష్ట్రంలోనే ఎంపి, ఎమ్మెల్యేలు, జనరల్‌బాడీలకు హాజరుకారు. స్వతంత్ర్యంగానే స్థానిక సంస్థలు పనిచేస్తాయి. మిగతా అన్ని రాష్ట్రాలలో ఎంపి, ఎమ్మెల్యేల జోక్యం పెరిగిపోయి పారదర్శకత లేకుండా పోతున్నది. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి అర్థం లేకుండా పోతున్నది. దీనిపై చర్చ జరగాలి. బడ్జెట్ అంటే అధికారంలో ఉన్నవారి ఇష్టాఅయిష్టాలపై కేటాయింపులు జరిగే పరిస్థితి కొనసాగుతున్నది.

జిఎస్‌టి అంటే వస్తు సేవల పన్ను..ఎవరు పన్నులు కడుతున్నారు. ప్రజలు పన్నులు కడుతారు. పెత్తనం ప్రభుత్వం చేస్తుంది. ఉచితాలనే నినాదం ఈ మధ్య తెరపైకి వచ్చింది. ఎవరైతే అసలైన పేదలున్నారో వారికి దారిద్ర్యరేఖ నుండి పైకి తీసుకురావడానికి, వాళ్ళ కాళ్ళపై వారు నిలబడి బ్రతికే స్థితికి తీసుకురావడానికి సంక్షేమ పథకాలు రూపొందించబడ్డాయి. కాని అవన్నీ ఇవాళ ఓట్ల రాజకీయాల ప్రచారంలో ప్రధానపాత్ర పోషించడం దుర్మార్గం. పై అంశాలపై నిరంతర చర్చ జరగాలి. రాజ్యాంగబద్ధంగా అన్ని వ్యవస్థలు పని చేయాలి. ప్రతిపక్షాల ఆందోళనలను ఎలా కట్టడి చేయాలనేది ప్రభుత్వ బాధ్యతగా ఉండాలి. కాని పోలీసులకు అప్పగించడం దుర్మార్గం. మహిళా ఎమ్మెల్యేల పట్ల మహిళా సిబ్బందిని ఉపయోగించకుండా పరుషులను ఉపయోగించడం దారుణం. ఎమ్మెల్యే లుగా మహిళలు కంట తడిపెట్టడం ఎక్కడికి దారితీసింది. కోర్టులు అప్పుడప్పుడు మందలిస్తూనే వున్నాయి. గత 40 సంవత్సరాల నుండి పార్టీ ఫిరాయింపులు ఆరంభమైనప్పటికీ శాసనసభ, పార్లమెంట్‌లలో ఫిరాయింపుల పర్వం సాగడం దారుణం. దీనిపై లోతుగా చర్చ జరగాల్సిం దే. ఒకరినొకరు గౌరవించే దృక్పథం వస్తేనే ప్రజాస్వామ్య మూలసూత్రాలకు అర్థం.. పరమార్థం ఉంటుంది. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ మూల సూత్రాలపై ప్రత్యేక కార్యాచరణకు ప్రజలు, మేధావులు ముందుకు రావాలి.

# సువర్ణాక్షర లిఖితం... తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం

**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా**


ప్రపంచ చరిత్రలో వివిధ సందర్భాలలో అనేక ఉద్యమాలు, ఆందోళనలు, నిరసనలు, నిర్బంధాలకు, అణిచివేతకు వ్యతిరేకంగా ఉద్భవించాయి. వీటిలో కొన్ని పోరాట విజయాలను సాధించాయి. అటువంటి వాటిలో సువర్ణక్షరాలతో లిఖించదగినది తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన ఈ పోరాటం ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రజా ఉద్యమాలు, తిరుగుబాట్లు పురుడు పోసుకునేందుకు కారణమైంది. 78 ఏళ్ల తర్వాత ఈ ఉద్యమాన్ని మననం చేసుకుంటున్నామంటే ఈ ఉద్యమం వెనుక ఉన్న పోరాటాలు, అసామాన్యమైన త్యాగాలు వాటిద్వారా సాధించిన విజయాలే కారణం. సాయుధ తెలంగాణ పోరాటం అంటే రాజ్యాల కోసం, సంపద కోసం సాగిన ఉద్యమం కాదు. నిర్బంధాలు, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా సామాన్యులు సాయుధులై పోరాడిన ఒక మహత్తర ఘట్టం.

ఒకప్పుడు చరిత్ర అంటే రాజులు, రారాజులు, వారి రాణుల భోగ విలాసాలు, దురాక్రమణలు, యుద్ధాలు మాత్ర మే. కానీ ఒక బలవంతుడైన రాజును సామాన్యులు మట్టి కరిపించి ఒక నూతన చరిత్రకు ఊపిరి పోసిన మహోజ్వల పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. ఈ పోరాటంలో సబ్బండ వర్గాలు పాల్గొన్నాయి. సామాన్యులు, రైతులు, కవులు, కళాకారులు, మేధావులు ఈ ఉద్యమంలో పాలు పంచుకున్నారు. అందుకే ఈ పోరాటం ఇంత ఘన చరిత్రను సంతరించుకున్నది. ఇప్పుడు కొందరు మతోన్మాదులు వక్రీకరిస్తున్నట్లుగా ఇది ప్రాంతీయ ఉద్యమం కాదు. ఒక మతపరమైన ఉద్యమం కాదు. జాతీయోద్యమ ప్రేరణతో సాగిన పోరాటమే సాయుధ తెలంగాణ పోరాటం. ఈ పోరాటానికి దేశంలో అంతకు ముందు జరిగిన ప్రజా ఉద్యమాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు సాగించిన అనేక ఉద్యమాలు ప్రేరణగా నిలిచాయి. నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలనలో తెలంగాణలో ఒక నిరంకుశ పాలన సాగుతుంది. ప్రజలు స్వేచ్ఛగా జీవించలేని ఒక భయానక పరిస్థితి ఉంది. రాజుకు తోడు గ్రామాల్లోని దొరలు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు, జమీందార్లు, జాగీర్దార్లు, ఇనామ్‌దార్లు, పటేల్, పట్వారీల దోపిడీ, దౌర్జన్యాలు శృతిమించాయి. నిజాంకు వ్యతిరేకంగా అంతకు ముందు పలుచోట్ల స్థానికంగా ఉద్యమాలు రగిలిన వాటిని నిజాం సైన్యాలు అణిచివేశాయి. అప్పటికే కొందరు నిజాంకు వ్యతిరేకంగా పోరాటాలు ప్రారంభించారు. నిజాం ఏలుబడిలోని ప్రజలు విముక్తి కోసం ఎదురు చూస్తున్న సందర్భంలో అన్ని ప్రయత్నాలు ముగిసిన తర్వాత తప్పని పరిస్థితుల్లో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్ 11, సెప్టెంబర్ 1947న ఒక చారిత్రక ప్రకటన చేశారు. సమయం ఆసన్నమైంది. మనం ముందుకు.. ముమ్మందుకు పోవాల్సిన సమయం వచ్చింది. నిజాం గద్దెను కూల్చడానికి సాయుధ పోరాటం ఒక్కటే మార్గమన్నారు. ఈ ప్రభుత్వాన్ని తలక్రిందులు చేయాలి. ఒక పక్క సహా య నిరాకరణ, మరో పక్క సాయుధ పోరాటం కొనసాగాలన్న వారి పిలుపుకు యావత్ తెలంగాణ స్పందించింది. అప్పటికే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి తెలంగాణ మాత్రం నిజాం ఏలుబడిలో ఉండడంతో ఈ పిలుపుకు ప్రజలు స్పందించారు. ఒక నూతనోత్సాహం పెల్లుబికింది. అయ్య నీ బాంచన్ అన్న వాళ్లంతా సాయుధ సైనికులు అయ్యారు. కర్ర, గొడ్డలి, బరిసె, వడిసెల, చేతిలో రాయి ఏది అందితే అది తీసుకుని సమస్త ప్రజానీకం సాయుధ పోరాట బాట పట్టింది. ఇదే సమయంలో కవులు తమ కలాలకు పదును పెట్టారు. గాయకులు గొంతెత్తి పాడారు. పాత్రికేయులు తమ పత్రికలలో సాయుధ తెలంగాణ పోరాట అవసరాన్ని, పోరాటం జరుగుతున్న తీరును సవివరంగా ప్రజలకు అందించారు. మొత్తంగా ప్రజల్లో ఒక విప్లవ జ్వాల రగిలింది. అప్పుడే సుద్దాల హన్మంతు

విప్లవ శక్తి రగులుకొన్నది
రణభేరీ మ్రోగింది తెలుగోడా
రావోయి ముందుకు మొనగాడా

అంటూ ఒక విప్లవ గేయాన్ని అలపించి ప్రజలతో గొంతు కలిపాడు. కొండేపూడి లక్ష్మి నారాయణ అదే సమయంలో

నిజాం అనగా ఎంతరా
వాడి తాహత్ ఎంతరా
కాసింరజ్వీ ఎంతరా
వాని బిసాదెంతరా
అందరం కలిసి తంతే



అంతుదొరకకుండురా

అన్న గేయం ప్రజల్లో మనో ధైర్యాన్ని నింపింది. అప్పటి ఉమ్మడి ఖమ్మంజిల్లాకు చెందిన దాశరథి

అరుణ అరుణ తరణి కొరకు
చెలరేగిన ప్రజల వాంఛ
పురికొల్పిన పొంగులతో
పోతున్నాం యుద్ధానికి
రణ రంగపు విపణి వీధి
లక్షలాది ప్రాణాలను
పైసలుగా పారబోసి
స్వాతంత్ర్యం కొనితెస్తాం

అంటూ దాశరథి రాసిన పాట జనం గొంతుకల్లో మారుమ్రోగింది. మరో పక్క ఇమ్రోజ్ పత్రిక సంపాదకుడు సోయబుల్లాఖాన్ రజాకారుల రాక్షసాల ను ఎండగడుతూ కలాన్ని కలవలం చేశాడు. సబ్బండ వర్గాలు పోరాటంతో నిజాం రాజు తలవంచక తప్పలేదు. భారత సైన్యాలు నిజాంను లొంగదీసుకున్నాయని ప్రచారం చేసినా సర్దార్ వల్లభాయ్ పటేల్ గురించి మరొకరు కథనాలు వినిపించినా ఇప్పటి నేతలు కొందరు నిజాం ముస్లిం కాబట్టి ముస్లింలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమని చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేసినా వాస్తవం మాత్రం నిజాం ను గద్దె దింపింది సాయుధ తెలంగాణ పోరాటమే. ఆధారాలు లేని, నమ్మశక్యం కానీ వక్రీకరించే మాటలతో రాజకీయ లబ్ధి కోసం కొందరు చేస్తున్న ప్రకటనలు నాటి వీరుల త్యాగాలను అపహాస్యం చేయడమే. సాయుధ తెలంగాణ పోరాటం అనేక ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చింది. ఇప్పుడు ఆ స్ఫూర్తితో ప్రజా ఉద్యమ నిర్మాణం జరగాల్సి ఉంది. 150 కోట్లకు చేరువవుతున్న భారతదేశ జనాభా ఎనిమిది దశాబ్దాల స్వాతంత్ర్యం తర్వాత ఇంకా అనేక సమస్యలను ఎదుర్కొంటుంది. ప్రపంచంలో నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నామని నేతలు ఊదరగొడుతున్న సమయంలో రెండు దశాబ్దాలుగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతుంది. ప్రజల అవసరాలను తీర్చలేని స్థితికి పాలకులు చేరుకుంటున్నారు.

ఇప్పుడు దేశంలో పాలన అంటే సంపన్న వర్గాల కోసం సాగేదే అన్న భావన రోజురోజుకు బలపడుతుంది. ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయి. మరో పక్క మేధో వలస కొనసాగుతుంది. ఉపాధి, ఉద్యోగ రంగాలు వట్టిపోతున్నా యి. యాంత్రీకరణ చిన్న పరిశ్రమలను కబళించేసింది. కార్పొరేట్ రంగం ఇప్పుడు బుసలు కొడుతుంది. ఇటువంటి సమయంలో సాయుధ తెలంగాణ 78వ వారోత్సవాలను నిర్వహించుకుంటున్నాం. ప్రపంచ చరిత్రలో ప్రజా పోరాటాలు లేకుండా ప్రజల అవసరాలను నెరవేర్చిన ఘటనలు లేవంటే అతిశయోక్తి కాదు. అధికారం కోసం, రాజకీయ అవసరాల కోసం కొన్ని ఉచిత పథకాలను ప్రవేశపెట్టవచ్చు. లేకపోతే అధికారంలో ఉన్నప్పుడు కొన్ని పనులు చేయాలి కాబట్టి చేసి ఉండవచ్చు. కానీ ప్రజల ఆలోచనలకు అనుగుణంగా పాలన సాగడం లేదన్నది వాస్తవం. ఎప్పుడో తెలంగాణ కవులు రచించి గాయకులు అలపించినట్లుగా

కొమరన్నకు వారసులు / కొరన్న, మంగన్నలు
తెలంగాణ పల్లెల్లో మేలుకునే ఉన్నారు

సై అంటే సై అంటారు అన్నట్లుగా ప్రజల అవసరాలను నెరవేరుస్తూ హక్కుల సాధన కోసం జరిగే ప్రజా ఉద్యమాల కోసం పునీతమైన ఈ తెలంగాణ గడ్డ ఎప్పుడు ఎదురు చూస్తునే ఉంటుంది. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రజా ఉద్యమం రగిలిన ప్రతిసారి ఈ గడ్డ మీద అది విజయాన్ని సాధించింది. ఇప్పుడు తెలంగాణ పోరాట స్ఫూర్తితో మరో ప్రజా ఉద్యమం, ప్రజల హక్కుల సాధన, పెరుగుతున్న ఆర్థిక అంతరాలకు నిరసనగా కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పురుడు పోసుకోవాల్సి ఉంది. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు మరో పోరాటం పురుడు పోసుకునేందుకు స్ఫూర్తిగా నిలవాలని, నిలుస్తాయని ఆశిద్దాం.

ఏనుగు వెంకటేశ్వరరావు

# సాయుధ పోరాట అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు పునరంకితమవుదాం



- పలువురు వక్తలు పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్/శేరిలింగంపల్లి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు పునరంకితమవుదామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. హైదరాబాద్ సంస్థానం 1948 సెప్టెంబర్ 17న ఇండియన్ యూనియన్‌లో విలీనమైన చారిత్రాత్మక దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన సెప్టెంబర్ 11 సందర్భంగా తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు భవనంలో శుక్రవారం స్మారక ట్రస్టు అధ్యక్షులు చాడ వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో హైకోర్టు రిటైర్ట్ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, సినీ దర్శకుడు ఆర్.నారాయణమూర్తి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సినీ నిర్మాత మాదాల రవి, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, ట్రస్టు కార్యదర్శి కందిమళ్ళ ప్రతాపరెడ్డి ప్రసంగించారు. తొలుత స్మారక భవనం ప్రాగణంలోని అమరవీరుల స్థూపం వద్ద సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ ఎర్రజెండాను ఆవిష్కరించి అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సాయుధ పోరాట రూపాకర్త కమ్యూనిస్టు, అగ్ర నేత రావి నారాయణ రెడ్డి విగ్రహానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పూలమాల వేసి అరుణాంజలి ఘటించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేస్తోందని, అవినీతి, నిరుద్యోగం, ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వక్తలు విమర్శించారు. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, వామపక్ష, లౌకిక, ప్రజాస్వామిక వాదులందరూ ఒకే వేదికపైకి వచ్చి ఐక్య పోరాటాలు నిర్మించాలని సభలో ప్రసంగించిన వక్తలు పిలుపునిచ్చారు. సామాజిక మార్పునకు పునాది సాయుధ పోరాటమేనన్నారు. 1947 సెప్టెంబర్ 11న ఆంధ్ర మహాసభ అధ్యక్షుడు రావి నారాయణ రెడ్డి, కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి బద్దం ఎల్లా రెడ్డి, ట్రేడ్ యూనియన్ నాయకులు మఖ్దూం మొహియుద్దీన్‌లు ఇచ్చిన పిలుపుతోనే సాయుధ పోరాటం ఊపిరి పోసుకుందని వక్తలు గుర్తు చేశారు. స్మారక ట్రస్టు సభ్యుడు ఉజ్జిని రత్నాకర్ రావు, బొమ్మగాని ప్రభాకర్, సోలిపేట వెంకటేశ్వర్ రెడ్డి, కోశాధికారి రావి ప్రతిభా రెడ్డి, సిఆర్ ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు చెన్నకేశవ రావు, సురేష్‌బాబు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

**సిఆర్ ఫౌండేషన్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు, నూతన కార్యవర్గం ఎన్నిక**

గురువారం కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఆర్ ఫౌండేషన్ గౌరవ చైర్మన్ కె.నారాయణ అధ్యక్షతన నిర్వహించగా ఫౌండేషన్ కార్యకలాపాలను, విస్తరణ ప్రణాళికలను వివరించారు. కడప, గూడురు ప్రాంతాలలో భవనాలు, భూములు విరాళంగా లభించాయని, అక్కడ వృద్ధాశ్రమాలు నిర్మించే ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ఇందులో కడపలోని వృద్ధాశ్రమం ఇప్పటికే ప్రారంభమై సేవలందిస్తోందని తెలిపారు. అలాగే అమరావతిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 3 ఎకరాల భూమిని కేటాయించడానికి అంగీకరించిందని, స్థలం ఖరారు కావాల్సి ఉందని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే, సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ 2024లో జరిగిన గత సర్వసభ్య సమావేశం తర్వాత గత రెండేళ్ళలో జరిగిన కార్యకలాపాలపై నివేదికను సమర్పించారు. సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు వివిధ కేంద్రాల డైరెక్టర్లను తమ నివేదికలను సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం డైరెక్టర్, కోశాధికారి చెన్నకేశవ రావు, పాలీక్లినిక్ డైరెక్టర్ కె.రజని, సురేష్ బాబు, జె.కల్పనలు తమ కేంద్రాల వివరణాత్మక నివేదికలను ఆర్థిక వివరాలను, భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలను సమర్పించారు. చర్చల అనంతరం ప్రధాన కార్యదర్శి ఫౌండేషన్ లోకి 10 మంది కొత్త సభ్యులను చేర్చుకోవాలని నూతన కార్యవర్గం, ఆఫీస్ బేరర్లను ప్రతిపాదించారు. సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ప్రతిపాదనను ఆమోదించి పేర్కొన్న వారితో కొత్త ఆఫీస్ బేరర్లను కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సిఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడిగా కె.నారాయణ, 'సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడిగా పల్లా వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎమ్మెల్సీ జల్లి విల్సన్, డాక్టర్ కె.రజని, సంధ్య కుమారిలు ఎన్నిక కాగా ప్రధాన కార్యదర్శిగా ముప్పాళ్ళ నాగేశ్వరరావు, కార్యదర్శులుగా కంభంపాటి అజయ్ కుమార్, మహమ్మద్ యూసుఫ్, ఏ.రామనాయుడు, కోశాధికారిగా చెన్నకేశవరావులను ఎన్నుకున్నారు. వృద్ధాశ్రమంలో గత 22 సంవత్సరాలుగా నివసిస్తున్న సుబ్బలక్ష్మి తన మరణానంతరం సిఆర్ ఫౌండేషన్‌కు రూ.25 లక్షలు విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు.





రావి నారాయణ రెడ్డి విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటించిన సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ సభ్యులు ఉజ్జిని రత్నాకర్ రావు, బొమ్మగాని ప్రభాకర్, సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి చందు యాదవ్, రామకృష్ణ తదితరులు

## ఆ రెండు ఫిర్యాదులపై నివేదిక సమర్పించండి

- డిజిపికి మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కుల ఆధారిత దూషణలు, మహిళా పోలీసు సిబ్బంది పట్ల అనుచిత ప్రవర్తనకు సంబంధించిన రెండు ఫిర్యాదులపై సమగ్ర నివేదికలు సమర్పించాలని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టిజిహెచ్‌ఆర్‌సి) రాష్ట్ర డిజిపిని ఆదేశించింది. కమిషన్ చైర్‌పర్సన్ డా.జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ దళిత సామాజిక వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను మీడియా సమక్షంలో అసభ్య పదజాలంతో దూషించారన్న ఆరోపణపై ఎస్‌ఆర్ నం.3678/2026లో ఫిర్యాదు నమోదైంది. అలాగే మాజీ సిఎం కెసిఆర్ ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ఎదుట దళితులు నిర్వహించిన నిరసన ప్రాంతాన్ని పసుపు నీరు, పాలతో శుద్ధి చేశారన్న ఆరోపణలు, దళితులను అవమానించారన్న ఫిర్యాదును కూడా కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. మరో కేసు ఎస్‌ఆర్ నం.3680/2026లో అసెంబ్లీ ప్రాంగణంలో నిరసన సందర్భంగా కొందరు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీషర్టులు తొలగించి మహిళా పోలీసుల సమక్షంలో అర్ధనగ్నంగా నిలబడ్డారన్న ఆరోపణలపై దాఖలైంది. ఈ ఘటనకు సంబంధించిన సిసిటివి వీడియో దృశ్యాలను పరిశీలించి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారు కోరారు. రెండు ఫిర్యాదులపై రికార్డులను పరిశీలించిన కమిషన్.. డిజిపి నుంచి నివేదికలు కోరింది. తదుపరి విచారణను అక్టోబర్ 9వ తేదీకి 26కు వాయిదా వేసింది.

## రైతులకు గిట్టుబాటు ధర గోపాలమిత్రలకు సంక్షేమ ఫలాలు

- శాసనసభలో వివరాలు వెల్లడించిన మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పాడి పరిశ్రమను మరింత బలోపేతం చేసి, పాడి రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా శుక్రవారం కాంగ్రెస్ సభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, గండ్ర సత్యనారాయణ రావు, వీర్లపల్లి శంకరయ్య అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తి ఏటికేడు పెరుగుతోందని మంత్రి సభకు తెలిపారు. 2024–25లో 59.35 లక్షల టన్నులుగా ఉన్న పాల ఉత్పత్తి, 2025–26 నాటికి 61.75 లక్షల టన్నులకు చేరిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరు నెలల్లోనే 30 లక్షల టన్నుల ఉత్పత్తి జరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు. పాడి రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం ఇచ్చేందుకు ఆగస్టు 16 నుంచి కొత్త ధరలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గేదె పాలకు కిలో వెన్నకు రూ.914, ఆవు పాలకు కిలో వెన్నతో పాటు ఘనపదార్థాల ప్రాతిపదికన రూ.340 చెల్లిస్తున్నామని చెప్పారు. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలోని నందిని డెయిరీ కంటే మన విజయా డెయిరీ ద్వారానే రైతులకు ఎక్కువ ధర అందుతోందన్నారు. అయితే, పాల ఉత్పత్తిలో ఆక్సిటోసిన్ వినియోగాన్ని అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రతిపాదనలేవీ ప్రస్తుతం లేవని, కానీ పాల నాణ్యత, పశువుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి సభకు తెలిపారు.

## నెల్లికల్లు ఎత్తిపోతల పథకం డిసెంబర్ 2027 నాటికి పూర్తి

- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నెల్లికల్లు ఎత్తిపోతల పథకం డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుడు మంకెన కోటిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. నెల్లికల్లు ఎత్తిపోతల పథకం ఫేజ్–1 పనులు 2027 జూన్ నాటికి, ఫేజ్–2 పనులు 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసి సుమారు 24 వేల ఎకరాలకు నీరు అందిస్తామని మంత్రి తెలిపారు. సభ్యుడు మంకెన కోటిరెడ్డి స్పందిస్తూ గత 50 ఏళ్లుగా అనేక ప్రభుత్వాలు మారినప్పటికీ నెల్లికల్లు ఎత్తిపోతల పథకం ముందుకు సాగడం లేదన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అయిన ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు.

పేద ప్రజలకు అందిస్తున్న సన్న బియ్యంతో పాటు నిత్యావసర సరకుల పంపిణీ ప్రభుత్వం ఆలోచనలో ఉందని, బడ్జెట్ కారణంగా కాస్త ఆలస్యం జరుగుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అడిగిన ప్రశ్నకు, టి.భానుప్రసాద్, బి.మహేష్‌కుమార్ గౌడ్, దాసోజు శ్రవణ్ అడిగిన ఉప ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. మంత్రి సమాధానంపై కోదండరాం స్పందిస్తూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం వలన ఆహార భద్రత ఏర్పడింది కానీ, ప్రజలకు పౌష్టికాహారం అందడం లేదని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు.

**విఆర్‌ఎల సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి పొంగులేటి**

విఆర్‌ఎలను క్రమబద్ధీకరించడంలో పలు సాంకేతిక సమస్యలు ఉన్నాయని, వాటిని తొలగించి విఆర్‌ఎల అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు దేశపతి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు, నెల్లికంటి సత్యం, చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న), ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, బండ ప్రకాష్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు.

ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇండ్లు అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో ఇళ్లు లేని ప్రతి పేదవాడికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 5,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. మంత్రి సమాధానంపై మహేష్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ గతంలో ప్రభుత్వం అందించే ఇళ్లను నగర శివారుల్లో నిర్మించేవారని, కానీ, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం నగరం నడిబొడ్డున ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తుండటం శుభపరిణామమన్నారు. నిజామాబాద్ పట్టణంలో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి అంగీకరించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

**విఆర్‌ఎలను క్రమబద్ధీకరించాలి: సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

ప్రధానంగా విఆర్‌ఎలు దళిత వర్గాలకు చెందిన వారు ఉంటారని, వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించి వారికి న్యాయం జరిగేలా చూడాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. చాలా ఏళ్లుగా ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించకపోవడంతో అనేక మంది విఆర్‌ఎలు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 3 వేల పైచిలుకు విఆర్‌ఎలు తమకు ఉద్యోగం కల్పించాలని ఆందోళన చేస్తున్నారని, వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి సత్యం విజ్ఞప్తి చేశారు.

## మున్సిపల్ కార్పొరేషన్లలో కో–ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మున్సిపల్ కార్పొరేషన్లలో కో ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్లకు ప్రాతినిధ్యం కల్పించే మున్సిపల్ చట్ట నాలుగవ సవరణ బిల్లును శాసనమండలి,శాసనసభ ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. మున్సిపల్ చట్ట నాలుగవ సవరణ బిల్లును ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తరపున రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు శుక్రవారం ఉభయ సభలలో ప్రవేశపెట్టి బిల్లు ఉద్దేశాలను, లక్ష్యాలను వివరించారు. ప్రధానంగా ట్రాన్స్‌జెండర్ల రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారత కోసం ఈ బిల్లు ఉద్దేశించబడిందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో క్యూర్ పరిధి వెలుపల ఉన్న 9 మున్సిపల్ కార్పొరేషన్లలో కోఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్ జెండర్లను నియమించనున్నట్టు మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. ప్రతి కార్పోరేషన్‌లో ఒకరిని ఎంపిక చేస్తామని తెలిపారు. శాసనమండలిలో బిల్లుపై జరిగిన చర్చలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌తోపాటు సభ్యులు దాసోజు శ్రవణ్ కుమార్, ఎంఐఎం సభ్యులు రియాజుల్ హసన్ ఎఫెండి పాల్గొని ప్రభుత్వానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. శాసనసభలో బిల్లుపై జరిగిన చర్చలో సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ సభ్యులు మనోహర్ రెడ్డి, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ,వెడ్మ బొజ్జు,బిజెపిసభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు చర్చలో పాల్గొన్నారు.

**ట్రాన్స్‌జెండర్లకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది: కూనంనేని సాంబశివరావు**

ప్రతి గ్రామ పంచాయతీ, మండల పరిషత్‌లలో ట్రాన్స్ జెండర్లను కోఆప్షన్ సభ్యులేగా నియమించాలని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. పరిపాలనలో ట్రాన్స్ జెండర్లకు భాగస్వామ్యం కల్పిస్తే వారి ఆత్మవిశ్వాసం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కార్పోరేషన్లలో ట్రాన్స్‌జెండర్లను కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించే బిల్లుకు ఆయన మద్దతు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంత మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారనే సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు అధికార యంత్రాంగాన్ని ఆదేశించాలని కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ ట్రాన్స్‌జెండర్ల సమాచారం సేకరించేందుకు ప్రయత్నిస్తామని, వారి సామాజిక అంశాలపై దృష్టి పెడుతామని హామీ ఇచ్చారు.

# హరిత విద్యుత్ విప్లవమే లక్ష్యం

- శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు తగినట్లుగా పర్యావరణహితమైన హరిత ఇంధన రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు కొనసాగుతోందని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుడు మల్క కొమరయ్య అడిగిన ప్రధాన ప్రశ్నకు, సభ్యుడు టి.భానుప్రకాష్ అడిగిన ప్రశ్నకు డిప్యూటీ సిఎం సమాధానమిస్తూ 'తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025' వివరాలను వెల్లడించారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ కేవలం 15,497 మెగావాట్లుగా మాత్రమే ఉండేదని, అయితే 2026 సెప్టెంబర్ 9 నాటికి అది 19,543 మెగావాట్లకు చేరిందని డిప్యూటీ సిఎం వెల్లడించారు. వివిధ కారణాల రీత్యా ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ 20,000 నుంచి 21,000 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉందని, ఈ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకునే సాంప్రదాయ, సాంప్రదాయేతర ఇంధన వనరులను సమన్వయం చేస్తూ ఈ నూతన పాలసీని తెచ్చినట్లు తెలిపారు. సభ్యులు కొమురయ్య ప్రస్తావించిన పంప్డ్ స్టోరేజ్ విధానం కొత్తదేమీ కాదని, కాంగ్రెస్ హయాంలోనే నాగార్జున సాగర్‌లో దీన్ని విజయవంతంగా అమలు చేశామని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించి డిపిఆర్ తయారీకి 1.5 నుండి 2 ఏళ్లు, ఉత్పత్తిలోకి రావడానికి 5 నుండి 8 ఏళ్లు పడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం 10 మంది ప్రతిపాదకులు ముందుకు వచ్చారని, డిపిఆర్ సమర్పించిన తర్వాత పాలసీ నిబంధనల ప్రకారం అనుమతులు ఇస్తామని తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో భూముల ధరలు ఎకరాకు రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పైగా ఉండటంతో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు పెట్టుబడిదారులకు ఆర్థికంగా గిట్టుబాటు కావడంలేదని స్పష్టం చేశారు. పరిగి పరిసర ప్రాంతాల్లో ఉన్న పరిమిత పవన విద్యుత్ (విండ్ పవర్) అవకాశాలపై అధ్యయనం చేసి త్వరలోనే టెండర్లు పిలుస్తామని డిప్యూటీ సిఎం వెల్లడించారు. కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తోందని, ఇటీవల కరీంనగర్‌లో ఒక ప్లాంట్‌కు శంకుస్థాపన చేసినట్లు గుర్తు చేశారు. మణుగూరు వద్ద సింగరేణి చేపట్టిన మిథేన్ గ్యాస్ ప్రాజెక్ట్ ఖర్చు ఎక్కువగా ఉండటంతో గిట్టుబాటు కాలేదని, అయితే కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం జరుపుతున్నామని తెలిపారు. స్థానిక సంస్థలలోని సోలా ర్ స్ట్రీట్ లైట్ల నిర్వహణను పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ పరిధిలోకి వస్తుందని, అయినప్పటికీ సభ్యుల సూచనల మేరకు సంబంధిత అధికారులతో సమీక్షించి నిలిచిపోయిన స్ట్రీట్ లైట్లను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.



**రూపాయి భారం లేకుండా ఉద్యోగులకు రూ.కోటి ఉచిత ప్రమాద బీమా**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, సిహెచ్.అంజిరెడ్డి, ఎల్.రమణ అడిగిన ప్రశ్నలకు డిప్యూటీ సిఎం సమాధానమిచ్చారు. ఖజానాపై గానీ, ఉద్యోగుల వేతనాలపై గానీ ఒక్క రూపాయి భారం పడకుండా, మానవీయ కోణంలో దేశంలోనే తొలిసారిగా కోటి రూపాయల వరకు ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు చెప్పారు.

**ఉద్యోగులకు హెల్త్ కార్డుల ప్రక్రియ వేగవంతంగా అమలు**

ఉద్యోగుల సంక్షేమానికి, వారి ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు అందజేసే ప్రక్రియను వేగవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, సిహెచ్.అంజిరెడ్డి, ఎల్.రమణ అడిగిన ప్రశ్నకు డిప్యూటీ సిఎం సమాధానమిచ్చారు. ఉద్యోగుల ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) నిర్వహణ సమర్థవంతంగా కొనసాగేందుకు ప్రత్యేకంగా ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ సిఎం తెలిపారు.

# ట్రిపుల్ ఆర్‌కు కేంద్రం సహకరించాలి


- ఐటి రంగ విస్తరణతోనే జిల్లాల అభివృద్ధి
- శాసనసభ ప్రశ్నోత్తరాలలో మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని జిల్లాల్లో ఐటి రంగాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకు రీజినల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) ప్రాజెక్టు కీలకమని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని, రాష్ట్రంలోని బిజెపి కూడా సహకరించాలని ఆయన కోరారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా శుక్రవారం ప్రశ్నోత్తరాల సమావేశంలో బిజెపి సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ, కాటిపల్లి వెంకట రమణా రెడ్డి, రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ సభ్యులు డాక్టర్ సంజయ్, దానం నాగేందర్, పాయల్ శంకర్ ఐటి రంగ అభివృద్ధిపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రీజినల్ రింగ్ రోడ్ పూర్తయితే జిల్లాలకు మెరుగైన అనుసంధానం ఏర్పడి, ఐటి కంపెనీలు హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలకూ విస్తరించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రానికి డేటా సెంటర్‌ల కోసం రూ.70 వేల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని, కేంద్ర విధానాలకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. హైదరాబాద్‌లో గూగుల్ ఇంక్యుబేషన్ హబ్ పనులు ప్రారంభమయ్యాయని, వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే అక్కడ భారీ స్థాయిలో ఐటీ పెట్టుబడులు వచ్చే అవకాశముందని తెలిపారు.

కాటిపల్లి వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ ఐటీ హబ్ నిర్మించి ఎన్నో సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఒక్క కంపెనీ కూడా రాకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వాలు భవనాల నిర్మాణానికే పరిమితం కాకుండా కంపెనీలను తీసుకురావడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఐటి రంగాన్ని హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్, మహబూబ్ నగర్ వంటి జిల్లాలకు విస్తరిస్తే యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, హైదరాద్‌పై ట్రాఫిక్ ఒత్తిడి కూడా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.

ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం ఐటి ఉద్యోగాల పరిస్థితి అత్యంత క్లిష్టంగా మారిందన్నారు. ఈ ఏడాది ఇంజనీరింగ్ విద్యార్థుల్లో పెద్ద ఎత్తున క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లు జరగలేదని, దేశవ్యాప్తంగా ఐటి ఉద్యోగ మార్కెట్ మందగమనం ప్రభావం కనిపిస్తోందన్నారు.

దానం నాగేందర్ మాట్లాడుతూ, ఐటి, ఇతర పరిశ్రమల కోసం కేటాయించిన భూములను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మళ్లిస్తున్నారని, అలాంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు కంపెనీలకు కేటాయించిన భూముల దుర్వినియోగాన్ని సహించేది లేదని, పెట్టుబడులు పెట్టే నిజమైన కంపెనీలకు తమ ప్రభుత్వం పూర్తి స్థాయిలో ప్రోత్సాహకాలు అందిస్తుందని స్పష్టం చేశారు.



**ఫ్యూచర్ లేని పార్టీ ఫ్యూచర్ గురించి మాట్లాడుతోంది**

రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదని కోరుకునే పార్టీకి భవిష్యత్తు ఉండదని, అలాంటి పార్టీ ఫ్యూచర్ సిటీ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా శుక్రవారం పరిశ్రమలు, పెట్టుబడులపై కాంగ్రెస్ సభ్యులు చిక్కుడు ప్రభాకర్, అనిరుధ్ రెడ్డి జానంపల్లి, వేముల వీరేశం, వీర్లపల్లి శంకర్, మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, బి.మనోహర్ రెడ్డి, జి.మధుసూదన్ రెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సభలో సమాధానమిచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు దక్కకూడదనే ఉద్దేశంతోనే పారిశ్రామికవేత్తలను భయభ్రాంతులకు గురిచేస్తూ రాష్ట్రంలో పెట్టుబడులు రాకుండా ఆ పార్టీ అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్', బయోఏషియా సదస్సు, జాతీయ, అంతర్జాతీయ రోడ్‌షోలు, సెక్టోరల్ కాంక్లేవ్‌లను నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. గత రెండేళ్లలో (2025, 2026) రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తలు, కంపెనీలతో మొత్తం 108 అవగాహన ఒప్పందాలు (ఎంఓయులు) కుదుర్చుకుందన్నారు. రాష్ట్రంలో రాబోయే అభివృద్ధి ప్రాజెక్టులకు అనుగుణంగా పరిశ్రమల అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను తీసుకురానున్నామని చెప్పారు. పారిశ్రామికాభివృద్ధిని హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా టైర్ 2, టైర్ 3 నగరాలు, పట్టణాలకు విస్తరించే దిశగా ప్రత్యేక కార్యాచరణతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

**పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం**

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

**1)** E1/06/PDPL/2026-27, తేదీ: 11-09-2026, **2) పనుల సంఖ్య:** 04 పనులు, **అంచనా వ్యయం:** రూ. 13.50 లక్షలు, **3) బిడ్ పత్రాలు లభించే తేదీ:** 15-09-2026 ఉదయం 11:00 గంటల నుండి, **4) బిడ్లు సమర్పించడానికి చివరి తేదీ:** 18-09-2026 సాయంత్రం 04:00 గంటల వరకు, **5) సాంకేతిక బిడ్ తెరిచే తేదీ & సమయం:** 18-09-2026 సాయంత్రం 04:01 గంటలకు, **6) సంబంధిత అధికారి పేరు & చిరునామా:** ఆకుల వెంకటేష్, కమిషనర్, పెద్దపల్లి మున్సిపాలిటీ, పెద్దపల్లి జిల్లా. **వివరాల కోసం సంప్రదించవలసిన వారు:** ఆకుల వెంకటేష్, కమిషనర్ (సెల్ నం. 9100902361) మరియు పి. రాజ్ కుమార్, MAE (సెల్ నం. 6305511253).

సం/- కమిషనర్,
పెద్దపల్లి మున్సిపాలిటీ

DIPR R.O. No. : 9859-PP/CL/ADVT/2026-27, Date: 11-09-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్ : సిఎంసి.
మెయిల్: sew.ghmc@gmail.com సెల్ నెం. 9154172331

NIT No. 53/SE/SLPZ/CMC/2026-27 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేదీ: 11.09.2026

**NIT No.** 53/SE/SLPZ/CMC/2026-27, తేదీ: 11.09.2026, **పని పేరు:** సిఎంసి, ఎస్ఎల్‌పిజెడ్, శేరిలింగంపల్లి సర్కిల్-49లో బాక్స్ డ్రెయిన్ నిర్మాణం, **అంచనా విలువ / ఇసివి:** రూ.62.00లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ **తేదీ / ఆఖరి తేదీ:** 15.09.2026 మ.1.00గం.ల నుండి 22.09.2026 మ.1.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎస్ఇ, ఎస్ఎల్‌పిజెడ్, సిఎంసి. సెల్ నెం. 9154172331, 7331186858.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్,
శేరిలింగంపల్లి జోన్ : సిఎంసి.

DIPR R.O. No. : 9872-PP/CL/ADVT/2026-27, Date: 11-09-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజనీర్-ఎం & సిటిఒ, ఎల్‌బి నగర్ జోన్

షార్ట్ టెండర్ నోటీసు

| Sl. No. | NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|---|
| 1 | NIT No. 04/SE(M) & CTO/ LBNR/ MMC/ 2026-27, Date: 10.09. 2026 | ఎంఎంసి. ఎల్.బి. నగర్ జోన్ పరిధిలో గణేష్ ఉత్సవాలు - 2026 సందర్భంగా, ప్రధాన రహదారులు, ఫ్లైవర్లు మరియు అండర్‌పాస్‌ల వద్ద 15 రోజుల పాటు రోడ్లను శుభ్రపరిచే యంత్రాలను వినియోగించడం. | రూ. 20.30 లక్షలు | డౌన్‌లోడ్ ప్రారంభ తేది | 11/09/2026 @ 03:00PM | ఎస్ఇ-ఎం & సిటిఒ, ఎల్‌బిఎన్‌జెడ్, ఎంఎంసి జోనల్ ఆఫీస్, గడ్డిఅన్నారం, హైదరాబాద్. 9701362708 & 9989930401 |
| | | | | బిడ్ సమర్పణకు ఆఖరి తేది | 15/09/2026 @ 03:00PM | |
| | | | | టెక్నికల్ బిడ్ ప్రారంభ తేది | 15/09/2026 @ 03:30PM | |
| | | | | ప్రైస్ బిడ్ ప్రారంభ తేది | 15/09/2026 @ 03:45PM | |
| | | 1 పనికి మొత్తం విలువ : | రూ.20.30 లక్షలు | | | |

మరిన్ని వివరాలకు @ http://tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎస్ఇ(ఎం) & సిటిఒ, ఎల్‌బినగర్ జోన్,
ఎంఎంసి.

DIPR R.O. No. : 9833-PP/CL/ADVT/2026-27, Date: 11-09-2026

దేవాదాయ ధర్మాదాయ శాఖ
**శ్రీ గండిమైసమ్మ దేవస్థానం**
గండిపేట గ్రా॥, మం॥, రంగారెడ్డి జిల్లా.

బహిరంగ వేలం / సీల్డ్ టెండర్ ప్రకటన తేది: 10.09.2026

ఇందుమూలముగా సమస్త వ్యాపారులకు, స్థానికులకు, భక్తులకు తెలియజేయునది ఏమనగా శ్రీ గండిమైసమ్మ దేవస్థానం, గండిపేట్ గ్రా., మం., రంగారెడ్డి జిల్లా నందు 2026 - 2027 సంవత్సరమునకు గాను ఈ క్రింది (7) హక్కులకై బహిరంగ వేలములో 28-09-2026 సోమవారము రోజున ఉ.11.00గం.లకు ఆలయ ప్రాంగణములో నిర్వహించబడును. ఆసక్తిగల వారు ఇట్టి వేలములో పాల్గొనగలరని కోరుచున్నాము.

| క్ర.సం. | వేలము వివరములు | వేలం పాట కాలపరిమితి | టెండరు ధర | డిపాజిట్ రూపాయలు |
|---|---|---|---|---|
| 1 | కొబ్బరికాయలు, పూజ సామాగ్రి అమ్ముకొనుట | 1 సంవత్సరము 05.10.2026 నుండి 04.10.2027 | రూ. 1000/- | రూ.1,00,000/- |
| 2 | టెంట్ సామాగ్రి సరఫరా | 1 సంవత్సరము 05.10.2026 నుండి 04.10.2027 | రూ. 1000/- | రూ.2,00,000/- |
| 3 | శాక్తేయ మొక్కుబడులు వసూలు చేయుట | 1 సంవత్సరము 05.10.2026 నుండి 04.10.2027 | రూ. 1000/- | రూ.1,00,000/- |
| 4 | ఒడి బియ్యం సేకరించుకొనుట | 1 సంవత్సరము 05.10.2026 నుండి 04.10.2027 | రూ. 1000/- | రూ.50,000/- |
| 5 | అమ్మవారి చీరెలు సేకరించుకొనుట | 1 సంవత్సరము 05.10.2026 నుండి 04.10.2027 | రూ. 1000/- | రూ.50,000/- |
| 6 | కర్రీ పాయింట్ / కూల్ డ్రింక్‌లు అమ్ముకొనుటకు | 1 సంవత్సరము 05.10.2026 నుండి 04.10.2027 | రూ. 1000/- | రూ.1,00,000/- |
| 7 | లడ్డూ, పులిహోర అమ్ముకొను హక్కు | 1 సంవత్సరము 05.10.2026 నుండి 04.10.2027 | రూ. 1000/- | రూ.50,000/- |

బహిరంగవేలములో పాల్గొనువారు నిర్ణీత డిపాజిట్‌ను డిమాండ్ డ్రాఫ్ట్ కమ్ నగదు రూపంలో దేవస్థాన కార్యలయంలో చెల్లించవలెను. షరతులు మరియు ఇతర పూర్తి వివరములకు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి కార్యాలయములో సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వాహణాధికారి
సెల్ : 9848159712

DIPR R.O. No. : 9686-PP/CL/ADVT/2026-27, Date: 10-09-2026

**శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానము**
వీరన్నగూడెం (బొంతపల్లి), గుమ్మడిదల మునిసిపల్ సంగారెడ్డి జిల్లా

టెండర్ నోటీస్: 05/SVBSD/2026-2, సీల్డు టెండర్ల cum బహిరంగ వేలము ప్రకటన Dt: 11/09/2026

దేవాలయములో దిగువ కనబరచిన లైసెన్సు మరియు సరఫరా హక్కుల నిమిత్తం 2026-2027 ఆర్థిక సంవత్సరమునకు గాను 6 నెలల 10 రోజులు కాల పరిమితి అనగా సీల్డు టెండర్ల cum బహిరంగ వేలము (తేది: 21-09-2026 నుండి తేది: 31-03-2027 వరకు) కొరకు ఆసక్తిగల, అనుభవముగల ఫర్మ నుండి విభాగము A ఎక్కువ మొత్తంలో విభాగము B తక్కువ మొత్తంలో కోడ్ చేయు టెండరుదారుల నుండి సీల్డు టెండర్లను కొరడమైనది. ఇట్టి లైసెన్స్ వివరముల కొరకు దేవస్థాన కార్యాలయము నందు కార్యాలయ పనివేళలో సంప్రదించగలరు.

| క్ర. సం. | టెండరు వివరములు | ఫారములు ధర రూ. | ధరావత్తు డి.డి/ నగదు రూ. | టెండరు షెడ్యూల్ అమ్మకం ప్రారంభ తేది & సమయం | టెండరు షెడ్యూల్ అమ్మకం ముగింపు తేది & సమయం | సాంకేతిక టెండర్లు విప్పు తేది & సమయం | ప్రైస్ బిడ్ విప్పుట తేది & సమయం |
|---|---|---|---|---|---|---|---|
| | విభాగం-A (ఎక్కువ మొత్తం) | | | | | | |
| 1 | అమ్మవారి ఒడిబియ్యం, కుడుకలు సేకరించుకొను హక్కు | 1,000/- | 10,000/- | 12.09.2026 ఉ.11 గం.లకు | 21.09.2026 ఉ.11 గం.లకు | 21.09.2026 మ.12గం.లకు | 21.09.2026 మ.2 గం.లకు |
| 2 | కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు | 1,000/- | 10,000/- | 12.09.2026 ఉ.11 గం.లకు | 21.09.2026 ఉ.11 గం.లకు | 21.09.2026 మ.12గం.లకు | 21.09.2026 మ.2 గం.లకు |
| | విభాగం-B (తక్కువ మొత్తం) | | | | | | |
| 1 | సెక్యూరిటి సిబ్బంది ఏర్పాటు చేయు హక్కు | 1,000/- | 10,000/- | 12.09.2026 ఉ.11 గం.లకు | 21.09.2026 ఉ.11 గం.లకు | 21.09.2026 మ.12గం.లకు | 21.09.2026 మ.2 గం.లకు |
| 2 | ప్రింటెడ్ కండువాలు సరఫరా చేయు హక్కు | 1,000/- | 10,000/- | 12.09.2026 ఉ.11 గం.లకు | 21.09.2026 ఉ.11 గం.లకు | 21.09.2026 మ.12గం.లకు | 21.09.2026 మ.2 గం.లకు |
| 3 | చీరలు, దోతులు, దీక్షా వస్త్రాలు, మొదలగునవి సరఫరా చేయు హక్కు | 1,000/- | 10,000/- | 12.09.2026 ఉ.11 గం.లకు | 21.09.2026 ఉ.11 గం.లకు | 21.09.2026 మ.12గం.లకు | 21.09.2026 మ.2 గం.లకు |
| 4 | వివిధ టికెట్ బుక్స్ మరియు ఇతర ముద్రణా సామాగ్రి సరఫరా చేయుహక్కు | 1,000/- | 10,000/- | 12.09.2026 ఉ.11 గం.లకు | 21.09.2026 ఉ.11 గం.లకు | 21.09.2026 మ.12గం.లకు | 21.09.2026 మ.2 గం.లకు |
| 5 | పాలు, పెరుగు సరఫరా చేయు హక్కు | 1,000/- | 10,000/- | 12.09.2026 ఉ.11 గం.లకు | 21.09.2026 ఉ.11 గం.లకు | 21.09.2026 మ.12గం.లకు | 21.09.2026 మ.2 గం.లకు |
| 6 | బయో డిగ్రేడబుల్ ప్రింటెడ్ కవర్లు | 1,000/- | 10,000/- | 12.09.2026 ఉ.11 గం.లకు | 21.09.2026 ఉ.11 గం.లకు | 21.09.2026 మ.12గం.లకు | 21.09.2026 మ.2 గం.లకు |

నోట్ : సరైన కారణములు తెలుపకనే టెండర్లు రద్దు చేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని కార్యనిర్వహణాధికారి గారికి పూర్తి అధికారం కలదు. ఇతర వివరముల కొరకు దేవస్థానం కార్యాలయము నందు కాని, ఫోన్ : 9963121467, 8686517771 కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకొనగలరు. //సదా శ్రీ స్వామి వారి సేవలో.//

సం/- కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 9893-PP/CL/ADVT/2026-27, Date: 11-09-2026

## సిఎం ప్రజావాణి పెండింగ్.. దరఖాస్తులు పరిష్కరించాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సిఎం ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సిఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.డిడబ్ల్యూఒ వినూత్నతో కలిసి గోడప్రతులను ఆవిష్కరించిన ఆయన, పోషణ మాసం కార్యక్రమాలను అక్టోబర్ 8వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోషకాహారం, ఆరోగ్యం, మహిళలు, చిన్నారుల్లో పోషకాహారంపై అవగాహన కల్పించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. డిఆర్ఓ రాథోడ్ రమేష్,ఆర్‌డిఒ దేవీదాస్,తహసీల్దార్లు,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు రిజిస్ట్రేషన్ తప్పనిసరి




ప్రజాపక్షం/జైనూర్ : రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ శాఖ రాసిమెట్ట క్లస్టర్ ఎఇఒ రాజ్‌కుమార్ సూచించారు. శుక్రవారం జైనూర్ మండలంలోని రాసిమెట్ట క్లస్టర్‌లో రైతులకు రిజిస్ట్రేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.రైతులు తమ భూమి వివరాలు, వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, రాయితీలు పొందేందుకు ఈ నమోదు ఉపయోగపడుతుందని వివరించారు. అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకుని, నిర్లక్ష్యం చేయకుండా వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మంటపాల ఏర్పాటుకు పోలీసు సమాచారం తప్పనిసరి

బెల్లంపల్లి వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్

ప్రజాపక్షం/బెల్లంపల్లి : వినాయక చవితి సందర్భంగా మంటపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు శాఖకు సమాచారం అందించాలని బెల్లంపల్లి వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్ తెలిపారు.విగ్రహం ఏర్పాటు ప్రదేశం, ఎత్తు, కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు, ప్రతిష్ఠాపన, నిమజ్జనం తేదీ, సమయం, వాహనాల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ నమోదులో సమస్యలు ఉంటే తాణాలో సంప్రదించవచ్చని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 112 నంబర్లకు సమాచారం అందించాలని సిఐ కోరారు.

## వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి చర్యలు

జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఖాళీల భర్తీ కోసం నిర్వహించిన వాక్ఇన్ ఇంటర్వ్యూలను వారు పర్యవేక్షించారు.కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్య, శిక్షణ అందించడమే కాకుండా అనుబంధ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సరిపడా వైద్య బోధనా సిబ్బందిని సమకూరుస్తున్నామన్నారు. ప్రమాణాలను మరింత పెంచి రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## అలీసాగర్ అభివృద్ధికి చర్యలు చేపడుతాం



ప్రజాపక్షం/నిజామాబాద్ : ఎడపల్లి మండలంలో ప్రముఖ పర్యాటక ప్రదేశం అలీసాగర్ అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు అదనపు కలెక్టర్ భుజంగరావు తెలిపారు. శుక్రవారం క్షేత్ర పర్యటనలో భాగంగా అలీసాగర్‌ను ఆకస్మికంగా సందర్శించి పార్కు, ఉద్యానవనం బోటింగ్ పాయింట్, హరిత హోటల్‌ను సందర్శించారు.రాబోవు రోజుల్లో అలీసాగర్‌ను అభివృద్ధిపర్చటానికి కాంపౌండ్‌వాల్ తీగల వంతెన, రాత్రి విడిది కోసం ప్రతిపాదనలు పంపనున్నామన్నారు. ఆయన వెంట ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, జిల్లా పర్యాటక అభివృద్ధిఅధికారి పవన్‌కుమార్ ఉన్నారు.

## గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

సిఐ రవీంద్ర నాయక్



ప్రజాపక్షం/తానూర్ : రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు తానూర్ మండలంలోని గణేష్ మండపాల నిర్వాహకులు,గ్రామ సర్పంచ్‌లు,విద్యుత్,పంచాయతీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో శుక్రవారం ఎమ్మెస్సార్ ఫంక్షన్ హాల్‌లో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఉప సర్పంచ్లు,మాజీ సర్పంచులు,ముస్లిం సోదరులు,వార్డ్ మెంబెర్లు, విద్యుత్ శాఖ అధికారులు,గణేష్ గ్రామస్తులు,పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ సభ్యులుగా కమలాకర్,ఖదీర్

ప్రజాపక్షం/ఖానాపూర్ : జాతీయ లోక్ అదాలత్ లో న్యాయవాద సభ్యులుగా న్యాయవాదులు కమలాకర్,షేక్ ఖాదీర్‌లు నియమితులయ్యారు. రేపు ఖానాపూర్ పట్టణంలోని కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా వీరు సేవలు అందించనున్నారని న్యాయవాదులు తెలిపారు.పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడంలో రాజీ మార్గమే సుగమం అని ,ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడంలో లోక్ అదాలత్ సహాయపడుతుందని పేర్కొన్నారు.లోక్ అదాలత్ సభ్యులుగా నియామకమైన న్యాయవాదులను తోటి న్యాయవాదులు అభినందించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో.. మెరుగైన వైద్య సేవలు అందాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా





ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే ప్రజలకు మెరుగైన,నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యాధికారులు,వివిధ విభాగాల అధిపతులతో కలెక్టర్ సమావేశమై ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సమీక్షించారు.రోజువారీగా నమోదవుతున్న ఓపీ వివరాలతో పాటు వివిధ విభాగాల్లో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ,ఆర్థోపెడిక్, కార్డియాలజీ, రేడియాలజీ,ఈఎన్‌టీ తదితర విభాగాల్లో వైద్య సేవల మెరుగుదలకు అవసరమైన పరికరాలు,శస్త్రచికిత్సలకు అవసరమైన యంత్రాల వివరాలను ఆయా విభాగాల అధిపతుల నుంచి సేకరించారు.అవసరమైన పరికరాలను ప్రాధాన్యత క్రమంలో సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఆసుపత్రికి వచ్చే రోగులకు సౌకర్యవంతంగా వైద్య సేవలు అందేలా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.సదుపాయాలు మెరుగుపడితే మరింత మంది రోగులకు ఆసుపత్రిలోనే మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని అన్నారు.ఆసుపత్రి ప్రాంగణంలో పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.పార్కింగ్ స్థలాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్‌సింగ్, అధికారులు రమేష్, సరోజ, వైద్యులు,అధికారులు, వైద్య సిబ్బంది,పాల్గొన్నారు.

## అడవుల సంరక్షణలో.. అధికారుల పాత్ర కీలకం

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/నస్పూర్ : అడవులను రక్షించి పర్యావరణాన్ని కాపాడడంలో అటవీశాఖ అధికారుల పాత్ర ఎంతో కీలకమైనదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మందమర్రి మండలం గాంధారి వనంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శాంతారామ్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్‌లతో కలిసి హాజరై అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం అటవీ ప్రాంతంపై పడుతున్న తరుణంలో అధికారులు విశిష్ట కృషి చేస్తున్నారని తెలిపారు. ఆదివాసీ గిరిజనుల హక్కులను కాపాడుతూనే అటవీ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. భావితరాలకు సమతుల్య వాతావరణం, ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. అధికారులు, సైతం రక్తదానం చేయగా, రక్తదాతలకు కలెక్టర్ ధ్రువపత్రాలు అందజేశారు.అధికారులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై సిపిఐ.. నిరంతరం పోరాడుతోంది

ప్రజాపక్షం/ఆదిలాబాద్: తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితోనే ప్రజా సమస్యలపై సిపిఐ నిరంతరం పోరాడుతోందని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్. విలాస్ తెలిపారు. ఈదుల్ల సావర్గాంలో కాంమ్రేడ్ దాజీ శంకర్ స్థూపం వద్ద నివాలులర్పించి, సిపిఐ జెండాను ఆవిష్కరించి సాయుధ పోరాట 78వ వార్షికోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన వీరోచిత పోరాటంలో లక్షలాది ఎకరాల భూమి పేదలకు దక్కిందన్నారు. ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. నాయకులు సిర్ర దేవేందర్, చిల్కా దేవిదాస్, మేస్రం భాస్కర్, గాజంగుల రాజు, రాజన్న పాల్గొన్నారు.




## కమ్యూనిస్టుల పోరాటం వల్లే తెలంగాణ విలీనం


సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు విలాస్




ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో విలీనమవ్వడం కమ్యూనిస్టుల వీరోచిత సాయుధ పోరాట ఫలితమేనని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ ఎస్. విలాస్ అన్నారు. నిర్మల్ జిల్లాలో ఈ నెల 11 నుండి 17 వరకు నిర్వహించే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా గోండు వీరుడు కొమురం భీమ్, స్వాతంత్ర్య సమరయోధుడు రాంజీ గోండ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్. విలాస్ మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నిజాం పాలనకు, వెట్టిచాకిరీకి, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పల్లెపల్లెనా ఆంధ్రమహా సభలను ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తెచ్చారని గుర్తుచేశారు. కామ్రేడ్ దాజీ శంకర్ రావు, రాంకిషన్ శాస్త్రిల నాయకత్వంలో అనేకమంది యువకులు సాయుధ పోరాటంలోకి వచ్చారని తెలిపారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగల్, జమీన్ పోరాటం, 1941 బాబేఝరి ఫైరింగ్ ఘట్టం ఉద్యమాన్ని కీలక మలుపు తిప్పాయని, ఆ ప్రాంతాన్ని రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డిలు సందర్శించారని పేర్కొన్నారు.అలాగే రాంజీ గోండ్ నాయకత్వంలో పోరాడిన 1,000 మంది సహచరులను ఆనాడు ఉరితీశారని స్మరించుకున్నారు. సిపిఐ నాయకులు కామ్రేడ్ భూక్యా రానేష్ మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14న వేయి ఊడల మర్రి వద్ద నిర్వహించే అమరుల నివాళి కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ కళావేన శంకర్, రాష్ట్ర సమితి సభ్యులు విలాస్ హాజరవుతారని తెలిపారు.సాయుధ పోరాట అభిమానులు, ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.పార్టీ నాయకులు రవి, గంగన్న పాల్గొన్నారు.

## జిల్లా ట్రెజరరీ కార్యాలయంలో వార్షిక తనిఖీ

ఖజానా నిర్వహణలో నిబంధనలు ,పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలి, సీనియర్ డిఎజిఎం నరేష్ కుమార్



ప్రజాపక్షం/సంగారెడ్డి : తెలంగాణ రాష్ట్ర సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఎం నరేష్ కుమార్ ( ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అధికారి ) శుక్రవారం సంగారెడ్డి జిల్లా ఖజానా కార్యాలయంలో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ నెల 7 నుండి కొనసాగుతున్న వార్షిక అడిట్‌లో భాగంగా చివరి రోజున ఆయన కార్యాలయాన్ని సందర్శించి వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌తో పాటు జిల్లాలో పని చేస్తున్న ఏటీఓలు ఎస్‌టీఓలతో ఆయన సమావేశమైన ఖజానా నిర్వహణ ఆడిట్ అంశాలు కార్యాలయ విధులపై సమీక్షించారు.పెండింగ్‌లో ఉన్న ఆడిట్ అభ్యంతరాలు ప్రస్తుత ఆడిట్ అభ్యంతరాలు, అంశాలను పరిశీలించారు. ప్రభుత్వ ఆర్థిక లావాదేవీల నిర్వహణలో నిబంధనలు విది విదానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్ ద్వారా పేపర్‌లెస్ ఆన్‌లైన్ బిల్లుల సమర్పణ జరుగుతున్న నేపథ్యంలో సంబందిత అధికారులు సిబ్బంది విది విదానాలను పూర్తిగా అవగాహన చేసుకుని ఏలాంటి లోపాలకు తావులేకుండా బిల్లుల ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. రికార్డులు ,రిజిస్టర్లు ,ఆర్థిక లావాదేవీల వివరాలను సక్రమంగా నమోదు చేసి భద్రపరచాలని ప్రభుత్వ నిధుల నిర్వహణలో పారదర్శకత జవాబుదారీతనం, ఆర్థిక క్రమ శిక్షణ పాటించాలని సూచించారు.ఆడిట్ ప్రక్రియను సంబందించి చేపడుతున్న చర్యలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.జిల్లా ఖాజానీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, ఎటిఒలు, ఎన్‌టిఒలు సంపత్, స్వ రూప, రాజారెడ్డి , శారద ఏటీఓలు ,జిల్లా ఖజా నా కార్యాలయంలోని వివిద విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణపై పోలీస్ అధికారులతో సిపి సమీక్ష




ప్రజాపక్షం/భీమ్‌గల్ : నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు సమన్వయంతో పని చేయాలని సీపీ సాయిచైతన్య ఆర్మూర్ డివిజన్ పోలీసులను ఆదేశించారు. శుక్రవారం భీమ్‌గల్ సర్కిల్ కార్యాలయంలో పెండింగ్‌లోని కేసుల పురోగతి, నేరాల నియంత్రణ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక దాడులు కొనసాగించాలని సూచించారు. పండగల నేపథ్యంలో ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా ప్రశాంతంగా జరుపుకునేలా అత్యవసర సమయంలో సేవలను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. పిఎస్‌లకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని నేరాలనియంత్రణకు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ గురునాయుడు, అంజయ్య, సిఐలు, ఎస్‌హెచ్‌ఓలు,ఎస్సైలు, ఐటి కోర్ సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## మూడు రోజులు అసెంబ్లీకి కెసిఆర్

రూ. 24 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం

టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి ఇందిరా శోభన్

ప్రజాపక్షం/నిజామాబాద్ : కెసిఆర్ ముచ్చటగా మూడు రోజుల అసెంబ్లీకి వచ్చి, 24 కోట్ల ప్రజాధనం దుర్వినియోగంచేశారని టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి ఇందిరా శోభన్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో పుట్టగతులుండవని జిల్లా అధ్యక్షులు కాట్‌పల్లి నగేష్‌రెడ్డి అన్నారు. జిల్లా అధ్యక్షులు కాట్‌పల్లి నగేష్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇందిరా శోభన్ మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ప్రజాధనం వృధా చేస్తున్న ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటివరకు దాదాపు 24 కోట్లు ఖర్చు చేశారని కేవలం వెయ్యి రోజుల్లో 3 రోజులు మాత్రమే అసెంబ్లీకి వచ్చిన ప్రతిపక్ష నాయకుడు ఉండటం మనకు సిగ్గుచేటన్నారు. కేసీఆర్ వచ్చాక రాష్ట్రంను అప్పుల తెలంగాణకు మార్చారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులను చెల్లిస్తూ, సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందని ఇవి ప్రతిపక్ష నాయకులకు కనిపించటం లేదా అని ప్రశ్నించారు ప్రతి గ్రామంలోని ప్రజలకు కేసీఆర్‌పై తెలిసేలా కాంగ్రెస్ నాయకులు వివరించాలన్నారు.

## అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

మంత్రి దామోదర్ రాజనర్సింహ



ప్రజాపక్షం/జోగిపేట : రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అందోల్ నియోజకవర్గంలోని ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై సంగారెడ్డి లోన తన నివాసంలో బిఎల్‌ఏలతో జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. అందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి ,రాయికోడ్, అందోల్, పుల్కల్, చోటకూర్,రేగోడ్, రాయికోడ్, వట్పల్లి అల్లాదుర్గ్, మండలాల బిఎల్‌ఏలు వివిద మండాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ రెండవ దశపై బిఎల్‌ఏలకుపవర్ సాయింట్‌ప్రజెంటేషన్ ద్వారా అవగాహనను మంత్రి దామోదర్ రాజనర్సింహ కల్పించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలోబిఎల్‌ఏలు ఎంతో కష్టపడి విజయవంతం చేస్తున్నారన్నారు. మంత్రి రాజనర్సింహ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్స్ బూతుల వారీగా డిజిటలైజ్ కాని నోటీసులు అందుకున్న ఓటర్ల వివరాలు వెంటనే సేకరించి ఓటర్ నమోదుకు అవసరమైన ధ్రువపత్రాలను బిఎల్ఓలకు అందించడంలో ఓటర్ లకు పూర్తి సహకారం అందించాలని మంత్రిదిశానిర్దేశం చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవతం చేసేందుకు క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్న బిఎల్‌ఏలను మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు.అందోల్ నియోజకవర్గం లోని అన్ని మండలా ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిల్లోడి సతీష్ కుమార్ దుర్గారెడ్డి, దిగంబర్ రావు, నిమ్మ రమేష్ విశ్వాస్ దకూరి వెంకటష్ కౌన్సిలర్ మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కాంగ్రెస్ పార్టీ నేతలు, పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలకు తావులేదు

కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్




ప్రజాపక్షం/సంగారెడ్డి : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగడానికి వీలులేదని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పి పరితోష్ ఫంకజ్ లు అన్నారు. ఈ నెల 14న వినాయక చవితి పర్వదానాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాల భద్రతా ఏర్పాట్లపై ఈ రోజు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అన్ని శాఖలకు చెందిన అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ,జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ సమీక్షా నిర్వహించారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయం తో పనిచేయాలని సూచించారు. గత సంవత్సరం ఎదుర్కొన్న సమస్యలపై దృష్టి సారించి వాటిని అధిగమించాలని అన్నారు. ప్రతి మండపం వద్ద పారిశుద్యం విద్యుత్ సౌకర్యాలను కల్పించాలని అన్నారు. నిమజ్జనం రోజున ఏలాంటి అవాంచణాయ సంఘటనలు జరగకుండా చెరువుల వద్ద బారికేడ్లు , స్వీమ్మర్లు, విద్యుత్ లైట్లు, తాగునీటి అవసరమైన చోట క్రేన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లాలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల వారిగా వివిద మతాలకు చెందిన పెద్దలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించినట్లు తెలియజేశారు. వినాయక ప్రతిమ ప్రతిష్ఠంచదలచిన వారు ముందుస్తు సమాచారం అందించేలా తెలంగాణ పోలీస్ పోర్టల్ అందుబాటులో ఉందని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను అధిక శబ్దంతో కూడిన లౌడ్‌స్పీకర్లు డేజేలకు అనుమతి లేదని తక్కువ శబ్దంతో కూడిన స్పీకర్లు , ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటలకు వరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. యువత సోషల్ మీడియా ద్వారా వచ్చే పుకార్లను నమ్మవద్దని నిర్దారణ లేని ఫార్వర్ట్ మేసేజ్‌లను ఇతరులకు పంపకుండా జాగ్రత్త వహించాలనిఎస్పీ పలు సూచనలు చేశారు.

## కోతుల బెడద నియంత్రణకు పటిష్ఠ చర్యలు

ప్రజలు,రైతులకు ఉపశమనం కల్పించాలి,కలెక్టర్



ప్రజాపక్షం/మెదక్: జిల్లాలో కోతుల బెడద నివారణకు మున్సిపల్ కమిషనర్లు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి నర్సాపూర్, తూప్రాన్, మెదక్ మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీట్ నిర్వహించి పరిస్థితిపై సమీక్షించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో సుమారు 6,500 కోతులు ఉన్నట్లు అంచనా వేశారు. మెదక్‌లో3,000, నర్సాపూర్‌లో 2,000, తూప్రాన్‌లో 1,000,రామాయంపేటలో 500 కోతులు ఉన్నట్లు అధికారులు నివేదికలు సమర్పించారు. కోతుల బెడదను ఒక ఉద్యమంలా చేపట్టి దశలవారీగా నియంత్రించాలని కలెక్టర్ సూచించారు. కోతులను పట్టుకుని నిర్మల్ జిల్లాకు తరలించి, ఆపరేషన్ అనంతరం అక్కడే వదిలేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు, రైతులకు ఉపశమనం కల్పించి మెదక్ జిల్లాను కోతుల నియంత్రణలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఎఫ్ఓ జోజి, డీపీఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## పకడ్బందీగా 'సర్' ప్రక్రియ నిర్వహించాలి



**ప్రజాపక్షం/ధర్మపురి:** ధర్మపురి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ నోటీసుల జారీ, విచారణ, ఓటర్ల నుంచి ఆధారాల సేకరణ, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఎస్ఐఆర్ నోటీసులపై విచారణను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పూర్తి స్థాయిలో, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల నుంచి సేకరించిన ఆధారాలు, వివరాలను ఆన్‌లైన్‌లో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నమోదు చేయాలని సూచించారు. "అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతంగా వ్యవహరించడం, నిబంధనలను కచ్చితంగా పాటించడం అత్యంత ముఖ్యం" అని కలెక్టర్ పేర్కొన్నారు.

**పుష్కర ఘాట్ల పనుల పరిశీలన :** అనంతరం 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో ధర్మపురిలో గోదావరి నది వద్ద కొనసాగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. పనులను వేగవంతం చేసి, ప్రణాళికలకు అనుగుణంగా పుష్కర ఘాట్లను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. భక్తులు, వీఐపీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాస్‌రావు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పూర్తి చేయాలి: కలెక్టర్ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ఒప్పందంలో నిర్దేశించిన గడువు మేరకు మార్చి 2027 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ,పునరుద్ధరణ పనులను శుక్రవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, విద్యాబోధనకు సంబంధించిన అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారుపెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న భవన పనులను ఒప్పందంలో నిర్దేశించిన గడువు మేరకు మార్చి 2027 నాటికి పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి భవన నిర్మాణంతో పాటు ప్రజలకు అవసరమైన అన్ని వైద్య పరికరాలను ఏర్పాటు చేసి, విద్యుత్, నీరు, ఇతర అనుబంధ సౌకర్యాల పనులను సైతం పూర్తిచేయాలని సూచించారు.ఆసుపత్రి భవనం ప్రారంభించే నాటికే అన్ని విభాగాలు, పరికరాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని, ప్రారంభం నుంచే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని,పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు, చేపట్టిన పునరుద్ధరణ పనులను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు,మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చేలా పనులను వేగవంతం చేయాలని, నాణ్యతతో పాటు నిర్ణీత గడువుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ పర్యటనలో టీజీఎంఐడీసీ విశ్వప్రసాద్,సంబంధిత అధికారులు,సిబ్బంది తదితరులు ,పాల్గొన్నారు.

## కెసిఆర్, కెటిఆర్ దళితులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మహిళ ఉద్యోగులను కించపరిస్తూ అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ మా మహిళలపై దాడి చేశారని కంప్లైంట్ చేయడం విడ్డూరంగా ఉందని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర విమర్శించారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాల పాలనలో ఎంత అవినీతి జరిగిందో రాష్ట్ర ప్రజలకు తెలుసని, శాసన సభ సమావేశం జరుగుతే వారు చేసిన అవినీతి బయటపడుతుందని సమావేశాలు మొదలు కాకముందే కేసీఆర్ ఆదేశాల మేరకు నానా హైరానా చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ అధికారులను మహిళా ఉద్యోగులను అసభ్యకరంగా తాకడం, తిరిగి వారే మహిళలపై దాడి చేశారని అనడం సిగ్గుమాలిన చర్య అన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ కావాలనే కాంగ్రెస్ పార్టీని బదనం చేయాలని కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. దళిత స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు, నవీన్ రెడ్డిలు మాట్లాడిన అసభ్య పదజాలానికి నైతిక బాధ్యత వహిస్తూ మాజీ మంత్రులు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌లపై దళితులు డిమాండే చేశారన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులు బేషరతుగా దళితులకు క్షమాపణలు చెప్పాలనిడిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని బదనాం చేసే ఆలోచనలు మానకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు, ఆకునూరి బాలరాజు, రాగుల జగన్, వెంగలలీల లక్ష్మి నరసయ్య, ఆడెపు చంద్రకళ, బొద్దుల శ్రీనివాస్, శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆల్ఫోర్స్' ఇ–టెక్నోలో ఘనంగా నాలెడ్జ్ ఫెస్ట



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** జ్ఞానం చాలా విలువైనదని సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు పొందడానికి దోహదపడుతుందని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లి లోని ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన నాలెడ్జ్ ఫెస్ట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విస్తృతమైన జ్ఞానాన్ని సంపాదించుకోవడం ద్వారా అనేక అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. అజ్ఞానం కారణంగా విలువైన అవకాశాలను కోల్పోకుండా తమ ముందుకు వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే వివిధ పోటీ పరీక్షలు, క్విజ్‌లు, విద్యా పోటీల్లో పాల్గొనడంతోపాటు వివిధ సంస్థలు నిర్వహించే పోటీ పరీక్షలకు కూడా విద్యార్థులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకోవాలని అనారు. ఈ కార్యక్రంలో ప్రిన్సిపల్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కరెంట్ కోతలపై రైతుల ఆగ్రహం




లో-వోల్టేజీతో పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆవేదన

### చల్‌గల్ సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా

**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:** అప్రకటిత విద్యుత్ కోతలు, తరచూ ఏర్పడుతున్న లోవోల్టేజీ సమస్యలతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆరోపిస్తూ జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చల్‌గల్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట జగిత్యాల నిజామాబాద్ రహదారిపై బైఠాయించి రైతులు ధర్నా, ముట్టడి చేపట్టారు. గ్రామంలోని పలువురు రైతులు పెద్ద సంఖ్యలో సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని విద్యుత్ శాఖకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో పంటలకు నీరు అందించలేకపోతున్నామ ని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రస్తుతం వరి పంటకు సాగునీరు అత్యవసరంగా ఉన్న సమయం లో విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వారు పేర్కొన్నారు. గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాటు సరఫరా ఉన్న సమయంలోనూ వోల్టేజీ సరిగా లేక మోటార్లు పని చేయడం లేదని రైతులు తెలిపారు. దీంతో బోర్ల నుంచి నీటిని పొలాలకు పంపింగ్ చేయలేకపోతున్నామని, పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతుకు ఆందోళన వ్యక్తం చేశారు. పంట సాగు కోసం ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు విద్యుత్ సమస్యల కారణంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని వారు వాపోయారు.విద్యుత్ శాఖ అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. లోవోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు అప్రకటిత విద్యుత్ కోతలను నిలిపివేయాలని వారు కోరారు. రైతుల ఇబ్బందులను అధికారులు పట్టించుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. రైతుల ధర్నాతో కొంతసేపు సబ్‌స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విద్యుత్ సరఫరా సమస్యపై సంబంధిత అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### సబ్ స్టేషన్ ముందు రైతుల ధర్నా

**గన్నేరువరం:** గన్నేరువరం మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా సాగుతున్న విద్యుత్ కోతలను నిరసిస్తూ శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. సరైన సమయానికి విద్యుత్ అందుబాటులో లేకపోవడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయని అధికారులు నిర్లక్ష్యం వీడాలని డిమాండ్ చేస్తూ సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రోజుకు కనీసం నాలుగు గంటలు కూడా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడం లేదని అర్ధరాత్రి వేళల్లో విద్యుత్ కోతలు విధించడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమయానికి నీళ్లు అందక చేతికొచ్చిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని దీంతో వేలాది రూపాయల పెట్టుబడి నష్టపోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పగటి పూట నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ ఏఈ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. రైతులకు న్యాయం జరగకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనను విస్తరింపజేసి రహదారుల దిగ్బంధం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని మైలారం, గన్నేరువరం చాకలివానిపల్లె, సాంబయపల్లె, చొక్కారావుపల్లె గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## కొండగట్టు పనులకు మోక్షం

రూ.35.19 కోట్ల పనులకు సిఎం గ్రీన్ సిగ్నల్

**ప్రజాపక్షం/గంగాధర:** మల్యాల కొండగట్టు అంజన్న భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కొండగట్టులో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు మోక్షం లభించింది. గతంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో రూ.35కోట్ల 15 లక్షలతో మంజూరైన దీక్షా విరమణ మండపం, 96 గదుల సత్రం పనులు సాంకేతిక కారణాలతో నిలిచిపోయాయి. ఈ విషయంపై చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. సీఎం సానుకూలంగా స్పందించి పెండింగ్ పనులకు వెంటనే ఆమోదం తెలిపారు. రూ.35.19 కోట్లతో 2000 మంది భక్తులు ఒకేసారి దీక్ష విరమించేలా మండపం, దూర ప్రాంత భక్తుల సౌకర్యం కోసం 96 గదుల అతిథి గృహం నిర్మించనున్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. ఈ సందర్భంగా సత్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎరువుల అమ్మకాలు ఇపాస్ ద్వారానే చేయాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి స్వరూప రాణి



**ప్రజాపక్షం/కొండపాక:** ఈ పాస్ విధానం ద్వారానే ఎరువుల విక్రయాలు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి సూచించారు. కొండపాక మండలం లోని పలు గ్రామాల్లో గల ఎరువులు, విత్తన దుకాణాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూపరాణి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా బస్తాల వివరాలను ఆన్లైన్లో చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఫర్టిలైజర్స్ నిల్వలు, విత్తనాల విక్రయం, రసీదులు, బిల్లులు తదితర వాటిని క్షుణంగా పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి మాట్లాడుతూ ఫర్టిలైజర్స్, విత్తనాలు తదితర షా పుల యజమానులు తప్పక రికార్డులు మెయింటెన్ చేయాలని, విత్తనాలు, ఎరువుల నిల్వలు, విక్రయాలను ఎప్పటికప్పుడు షాపు లో ఏర్పాటు చేసిన బోర్డు పై నమోదు చేయాలన్నారు.ఈపాస్ ద్వారానే ఎరువుల అమ్మకాలు చేయాలని సూచించారు. ఎరువులు ఈపాస్ ద్వారాఅమ్మకపోతే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్ లను రద్దు చేస్తామని తెలిపారు. ఆమె వెంట వ్యవసాయ శాఖ అధికారి శివరామకృష్ణ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## దేవుడి పేరుతో ఓట్లు దండుకునే పార్టీ బిజెపి

ఎంపి గడ్డం వంశీకృష్ణ



**ప్రజాపక్షం/ధర్మపురి:** జై శ్రీరామ్ అంటూ దేవుడు పేరు చెప్పి ఓట్లు దండుకోవడమే కాకుండా స్వయానా ఆలయాలలో భగవంతుడికి సమర్పించిన కానుకలను లూటీ చేసే పార్టీ బిజెపి అని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు.ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారిని శుక్రవారం ఎంపి వంశీకృష్ణ దర్శించుకుని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్దే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజాపాలన కొనసాగిస్తుండగా ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రాజెక్టుల నిర్మాణాల పేరుతో దోచుకుని మూటకట్టుకోవడమే కానీ పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని ప్రాచీన పుణ్యక్షేత్రాలైన ధర్మపురి, కాళేశ్వరంల అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి నిలపలేదని తెలిపారు.2027 లో జరగనున్న గోదావరి నది పుష్కరాలను తెలంగాణ ప్రభుత్వం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రూ.1000 కోట్లు వెచ్చించిందని వాటిలో ధర్మపురి, కాళేశ్వరంల క్షేత్రాభివృద్ధికి రూ.400 కోట్లు కేటాయించిందని వంశీకృష్ణ పేర్కొన్నారు.రూ.10 కోట్ల పుష్కర నిధులతో పునర్నిర్మాణం జరుగుతున్న ధర్మపురి శ్రీ ఉగ్రనృసింహ ఆలయ పనులను పరిశీలించానని,క్షేత్రంలో అభివృద్ధి పనులు పూర్తయ్యాక ధర్మపురి దివ్యక్షేత్రంగా వెలుగొందనుందని ఆయన అన్నారు. మరోవైపు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నికల్లో భగవంతుడిని వాడుకున్నారే గానీ ఆలయాలు,పుణ్యక్షేత్రాల అభివృద్ధికి చేసిందేమీ లేదని అన్నారు.అయోధ్య రామచంద్రుడికి భక్తులు సమర్పించిన కోట్లాది రూపాయల విరాళాలను సైతం మింగేశారని వంశీకృష్ణ బిజెపి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోల్పోయినప్పటినుండీ విషం చిమ్ముతున్న బీఆర్ఎస్ నేతలు వారితో లోపాయకారి ఒప్పందమున్న బిజెపి పార్టీల తీరు దేశానికి ఏమాత్రం మంచిదికాదని ఎంపి వంశీకృష్ణ పేర్కొన్నారు. ఎంపీ వెంట గ్రంథాలయ చైర్మన్ ఎస్. దినేష్, దేవస్థానం పాలకమండలి మాజీ అధ్యక్షులు జక్కు రవీందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మ ణ్,వేముల రాజేష్, పట్టణ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్,కౌన్సిలర్లు సంగి ఆనంద్, నాయకులు నర్సింహులు, సుముఖ్, ప్రసాద్, సత్యం, తదితరులు ఉన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులే

సిపిఐ నేతకార్మిక సంఘాల అధ్యక్షుడు సుతారి రాములు



**ప్రజాపక్షం/కోరుట్ల:** భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం,మట్టి మనషులు నడిపిన సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులు అని సిపిఐ నేత కార్మిక సంఘాల అధ్యక్షుడు సుతారి రాములు తెలిపారు. ఈనెల 11 నుంచి 17 వరకు జరిగే 78వ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా శుక్రవారం రోజున కోరుట్ల రెవిన్యూ డివిజన్ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం దగ్గర అరుణ పతాకాన్ని ఎగురవేసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1946 నుండి 1951 వరకు చారిత్రాత్మకమైన పోరాటం కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిందని అన్నారు. ఈ దేశానికి స్వాతంత్రం వచ్చిన జాతీయ జెండా ఎగరలేదు తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ సంస్థానాన్ని నిజాం నవాబ్ పరిపాలనలో కొనసాగింది. ప్రజలపై వేధింపులు పన్నులపై పన్నులు వేసేవారని మహిళలు చిత్రహింసల గురి చేసే వారిని అన్నారు. పన్నుల రూపంలో దోచుకునే వారిని వాటన్నిటికీ వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసి విముక్తి చేసిన ఘనత కమ్యూనిస్టులది అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం వల్ల దేశవ్యాప్తంగా ఉన్న అనేక సంస్థాన లను భారత ప్రభుత్వంలో విలీనం చేశారని అప్పటికి హైదరాబాదును విలీనం చేయలేదని తెలిపారు. ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో గ్రామాలలో సంఘాలు ఏర్పాటు చేసుకొని ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు సాగారని వివరించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లో రజాకారుల అండతో జమీందారు లు భూస్వాముల పరిపాలన కొనసాగింది. పోరాటానికి నాటి తొలి పార్లమెంట్ సభ్యులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మోహినుద్దీన్, భీమ్ రెడ్డి, నరసింహారెడ్డి, ధర్మాభిక్షం నాయకత్వం వహించారన్నారు. ఈ పోరాటంలో దొడ్డి కొమురయ్య తొలి అమరులయ్యాడు షేక్ బందగి, సోయాబుల్లాఖాన్ ను నిర్దాక్షణ్యంగా భూస్వాముల చేత చంపబడ్డారు. ఈ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4,500 మంది అమరులయ్యారని రజాకార్ల జమీందారుల పాలన నుండి 3000 గ్రామాలు విముక్తి పొందాయని పదిలక్షల ఎకరాల భూమి పేదలకు పంచబడిందన్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, ఏన్నం రాధా, వంశీకృష్ణ, గంగారం, ముత్తయ్య, సాయినాథ్, నర్సింహులు, రాజయ్య, సాయిలు, నవీన్, పాల్గొన్నారు.

## తాపస్‌పల్లి రిజర్వాయర్‌పై కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన



**ప్రజాపక్షం/కొమురవెల్లి:** కొమురవెల్లి మండలంలోని తాపస్‌పల్లి రిజర్వాయర్‌ను జిల్లా కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ, కాలువల పరిస్థితి, నీటి పంపిణీ తదితర అంశాలపై నీటిపారుదల శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాపస్‌పల్లి రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థం 0.3 టీఎంసీలు కాగా, గోదావరి నదిలో దేవాదుల వద్ద ప్రవహిస్తున్న నీటి లభ్యతను బట్టి ప్రస్తుతం 0.2 టీఎంసీల నీటిని రిజర్వాయర్‌లోకి పంపించి నిల్వ చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం కూడి ఎడమ కాలువలోకి నీటిని విడుదల చేయడం లేదని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున రిజర్వాయర్లలోని నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలని వ్యవసాయ అవసరాలకు నీటిని విడుదల చేయడం లేదని కలెక్టర్ తెలిపారు. రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలోని రైతులు పరిస్థితిని అర్థం చేసుకుని సహకరించాలని సూచించారు. అనంతరం తాపస్‌పల్లి రిజర్వాయర్‌కు సంబంధించిన కుడి, ఎడమ కాలువలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొమురవెల్లి మండలంలోని గౌరాయపల్లి గ్రామం గుండా వెళ్లే కాలువతో పాటు చేర్యాల మండలంలోని కమలాయపల్లి వద్ద ఉన్న కాలువలను పరిశీలించి వాటి పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో నీటిపారుదల శాఖ ఎస్ఈ, ఈఈ, డీఈలు తదితర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఇవిఎం గోదాంను క్షేత్ర స్థాయిలో పరిశీలన: కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట సమీకృత కలెక్టరేట్ పక్కన గల ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్(ఈవిఎం) గోదాం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె హైమావతి శుక్రవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. త్రైమాసిక పరిశీలీలనలో భాగంగా, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి ఈవిఎం గోదాంను ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నియమావళి ప్రకారం ఓపెన్ చేసి సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక నియోజకవర్గాల వారీగా మిషన్ లను భద్రపరిచిన ద్వారాలను వాటికున్న సీల్ లను పరిశీలించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలు ప్రకారం అన్ని భద్రత చర్యలు తీసుకుంటున్నామని, గోదాం లోపల, బయట, చుట్టు పరివారం మొత్తం ప్రతిదీ సిసి కెమెరాలో నిక్షిప్తం అవుతాయని రాజకీయ పార్టీ ప్రతినిధులకు కలెక్టర్ తెలిపారు. విజిటర్ రిజిస్టర్ లో సంతకం చేశారు. అనంతరం గోదాం అందరి సమక్షంలో ముఖ ద్వారానికి తాళం వేసి సీల్ వేసారు.


ఈ పూర్తి ప్రక్రియ వీడియో గ్రపీ తీశారు. కలెక్టర్ వెంట ఎలక్షన్ సూపరిండేంట్ చంద్ర శేఖర్, సిద్దిపేట అర్బన్ తహసిల్దార్ కిరణ్, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు మోహన్‌లాల్ . తదితరులు ఉన్నారు.

## ప్రధాని మోదీ రాజకీయ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి: ఎంపి రఘునందన్ రావు



**ప్రజాపక్షం/సిద్దిపేట:** ప్రధాని మోదీ రాజకీయ జీవితా న్ని, ఆయన అంకితభావాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని బిజెపి శ్రేణులకు మెదక్ ఎంపి రఘునందన్ రావు సూచించారు. శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో విఏఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా కార్యశాలలో ఎంపి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గుజరాత్ సీఎంగా, భారత ప్రధానిగా ప్రభుత్వంలో నిరాటంకంగా పాతికేళ్లుగా ప్రధాని మోదీ కొనసాగుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల నిర్విరామ సేవా ప్రయాణాన్ని, దేశాభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషిని, వికసిత్ భారత్ 2047 సంకల్పాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా ఈనెల 17 నుండి అక్టోబర్ 17 వరకు చేపట్టిన సేవా సంకల్ప అభియాన్ ప్రోగ్రాంను విజయవంతం చేయాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సేవా సంకల్ప్ ప్రోగ్రాంకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బిజెపి నా యకులు వంగ రామచంద్రారెడ్డి, విద్యాసాగర్, బాలేష్ గౌడ్, తుంగ కనకయ్య, విభీషన్‌రెడ్డి, వెంకటేశం, వెంకట్, సుభాష్ రెడ్డి, జనార్ధన్, మార్కండేయులు, వంశీకృష్ణ, నాగరాజు, తిరుమల, పద్మ పాల్గొన్నారు.

## 'ఆల్ఫోర్స్'లో ఘనంగా వినాయక చవితి వేడుకలు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత నివ్వాలని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి వేడుకల సందర్భంగా శుక్రవారం సుల్తానాబాద్‌లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తుగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాల వినియోగం పర్యావరణహితంగా పండుగను జరుపుకోవాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ప్రతి పండుగ యొక్క విశిష్టతను తెలియజేస్తూ పాఠశాలలో విద్యార్థులచే ప్రత్యక్షంగా నిర్వహిస్తూ, వారిలో అవగాహన పెం చుతున్నామన్నారు. దీంతో విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భా వం పెంపొందుతుందన్నారు. ప్రతి అంశంలో విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దడంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు ఎప్పుడు ముందుంటాయన్నారు. అనంతరం వి ద్యార్థులు పలు సాంస్కృతికకార్యక్రమాల్లో భాగంగా భక్తి గీతాలతో పాటు, పండుగ యొక్క విశిష్టత, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను తెలియజేస్తూ, విద్యార్థుల ప్ర సంగాలు పాటలకు అనుగుణంగా చేసిన నృత్యాలు, ఆ ధ్యాంతం ఉత్సాహభరితంగా సాగాయి, కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# డిమాండ్లు నెరవేరే వరకూ పోరాటం

నగరంలో బ్యాంక్ ఉద్యోగుల ర్యాలీ,యుఎఫ్‌బియు సమ్మె విజయవంతం







**ప్రజాపక్షం/ఖమ్మం:** బ్యాంకు ఉద్యోగుల డి మాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని బ్యాంక్ ఉద్యోగ సంఘాల నేతలు, ట్రేడ్ యూనియన్ నాయకులు తెలిపారు. యూనైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బి యు) ఆధ్వర్యంలో శుక్రవారం సమ్మె నిర్వహించారు. సమ్మెతో మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ స్తంభించింది. కోట్లాది రూపాయల లావాదేవీలు ని లిచిపోయాయి. ఈ సందర్భంగా ఖమ్మంలోని ఇల్లందు క్రాస్ రోడ్డు నుంచి వైరా రోడ్డులోని ఎస్‌బిఐ ప్రధాన బ్రాంచ్ వరకు ర్యాలీ నిర్వహించా రు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నేతలు మాట్లాడుతూ ఐదు గంటల పనిదినం కోసం అ నేక పోరాటాలు నిర్వహించామని కానీ కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కేంద్ర ప్ర భుత్వం బ్యాంకు ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యపూరిత వైఖరిని అవలంభిస్తుందని శ్రమదోపిడీకి పాల్పడుతుందని నాయకులు ఆరోపించారు. బ్యాం కింగ్ సెక్టార్‌ను ప్రైవేటు పరం చేసేందుకు కుట్ర లు జరుగుతున్నాయని అందులో భాగంగానే బ్యాంకుల విలీనం సాగుతుందని నేతలు తెలిపా రు. బ్యాంకు ఉద్యోగుల శ్రమ ఫలితంగా బ్యాం కులు లాభాల్లోకి వస్తే లాభాలను ఉద్యోగులకు కాకుండా ఎగవేతదారులకు దోచిపెడుతున్నార ని ఇదేక్కడి న్యాయమని వారు ప్రశ్నించారు. బ్యాంకు ఉద్యోగులు అనేక చారిత్రిక పోరాటా లు నిర్వహించి హక్కులు సాధించడంతో పాటు బ్యాంకింగ్ వ్యవస్థను పరిరక్షించుకోవడం జరిగి ందని ఇప్పుడు కూడా బ్యాంకింగ్ వ్యవస్థ పరిరక్షణతో పాటు పని గంటల కాలాన్ని తగ్గించేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. 11 ఏళ్లుగా ఐదు రోజుల పని దినాల కోసం పో రాడుతున్నామని వారు తెలిపారు. వివక్షాపూరిత విధానం అవలంభిస్తుందన్నారు. ఈనెల 9, 10 తేదీల్లో కేంద్ర కార్మిక శాఖ కమిషనర్‌తో జరిగిన చర్చల్లో ఏకాభిప్రాయం రాకపోవడంతో ఆందోళనలు చేపట్టామని ఈ ఆందోళనను కొనసాగిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుఎఫ్‌బియు నాయకులు ఎస్‌కె ఇబ్రహీం, టి. రాజేష్, కె. రాంబాబు, శ్రీకాంత్, ఆర్. శివకుమార్,జి. వెంకట్రావు, కో ఆపరేటివ్ బ్యాంక్ ఎం ప్లాయీస్ యూనియన్ నాయకులు కనకం జ నార్థన్, ఏఐటియుసి నాయకులు శింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, సిహెచ్ సీ తా మహలక్ష్మి, గాదె లక్ష్మి నారాయణ, సిఐటి యు నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో భూ రీసర్వే వేగవంతం: కలెక్టర్ అంకిత్

పాత రికార్డులు, మ్యాపులతో సరిహద్దుల నిర్ధారణ



**ప్రజాపక్షం/అశ్వాపురం:**ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూ రీ సర్వేను వేగంగా పూర్తి చేసి, సరిహద్దులను కచ్చితంగా నిర్ధారించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. అమ్మగారిపల్లిలో రోవర్, ట్యాబ్‌లతో జరుగుతున్న డిజిటల్ సర్వేను శుక్రవారం పరిశీలించారు. అమ్మగారిపల్లి, కుమ్మగూడెం పరిధిలో పాత కాడస్ట్రల్ మ్యాపులు, 1920ల ఫసలీ, బూర్గంపాడు తాలూకా రెవెన్యూ రికార్డుల ఆధారంగా 1,900 ఎకరాలకు పైగా భూముల సరిహద్దులను నిర్ధారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వరదలు, భూకోతలు, సీతారామ ప్రాజెక్టు ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో సరిహద్దులు మారడం, నీట మునక, ఇసుక మేటలతో పాత గుర్తులు కనుమరుగవడం వల్ల సమస్యలు ఏర్పడ్డాయని వివరించారు. కేఎంఎల్ ఫైళ్ల ఆధారంగా 7. 91కిలో మీటర్ల సరిహద్దులను రోజుకు 2కిలో మీటర్ల చొప్పున 2,4రోజుల్లో గుర్తించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పాత రికార్డులను సమగ్రంగా పరిశీలించి రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ సూచించారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు హెవీ వాటర్ ప్లాంట్ సీఎస్ఆర్ నిధులతో రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో తహసీల్ధార్ సూర్య ప్రకాష్, సర్వే అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'నేడు' జాతీయ లోక్ అదాలత్

**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్:** జాతీయ లోక్ అదాలత్ నేడు శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎం. నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు ఖమ్మం న్యాయ సేవా సదన్ నందు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు.

## వేపకుంట్ల పాఠశాలను సందర్శించిన ఎంపిడిఒ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని వేపకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిడివో అశోక్‌కుమార్ సందర్శించారు. శుక్రవారం పాఠశాలను సందర్శించిన ఎంపిడివో అశోక్ కుమార్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట కార్మికులతో మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు బూట్లు, సాక్సులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిత్యావసర వస్తువుల్లో నాణ్యత పాటించాలన్నారు. సర్పంచ్ రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించి గ్రామానికి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, పంచాయతీ కార్యదర్శి అనిల్, అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్ మేడేపల్లి సుజాత, ఉపాధ్యాయులు రమాదేవి, సుమలత, మల్లికార్జున్‌రావు, జావిద్, సోమ్లా, స్థానికులు రాజా, సందీప్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కోయచలక సర్పంచ్ బలుసుపాటి శేషయ్య తెలిపారు. శుక్రవారం కోయచలక గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగాసర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన వారందరికి ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రతతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందాలన్నదే ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్‌కార్డు ద్వారా రేషన్ సరుకులతో పాటు ప్రభుత్వ పథకాల లబ్ధి మరింత సులభతరం కానుందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు , ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాధంశెట్టి హన్మంతరావు, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు చెరుకూరి పూర్ణచందర్ రావు, వార్డు సభ్యులు వెంకటేశ్వర్లు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

డిఎంహెచ్ఒ డా.తుకారాం



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు సిబ్బది సమన్వయంతో పనిచేయాలని డిఎంహెచ్ఓ డా.తుకారం రాథోడ్ సూచించారు. శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆస్పత్రుల పనితీరు మాతశిశు ఆరోగ్యం ఎన్‌సిడి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రక్తపోటు మధుమేహం రోగులను గుర్తించి క్రమం తప్పకుండా చికిత్సలు అందించాలన్నారు. అనంతరం గట్టుమల్లలోని ఐడిఓ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి మందులు లభ్యత సిబ్బంది పనితీరు పరిశీలించారు. గడువు ముగిసిన మందులు వెంటనే తొలగించాలని మలేరియా కేసులపై సకాలంలో చర్యలు చేపట్టాలని సూచించారు.

## నిష్కలంక యోధుడు రావెళ్ల జానకీరామయ్య: జక్కుల



**ప్రజాపక్షం/బోనకల్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, తామ్రపత్ర గ్రహీత రావెళ్ల జానకీరామయ్య నిష్కలంక యోధులని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జక్కుల రామారావు కొనియాడారు. మండలంలోని చిరునోముల గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా తొలి రోజు జానకీరామయ్య స్మారక స్థూపానికి పూలమాలలు వేసి వారోత్సవాలను సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జక్కుల రామారావు మాట్లాడుతూ జానకీరామయ్య ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు.ఆంధ్రమహాసభను నిర్వహించడంతో పాటు రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. వత్సవాయి మండలంలోని వేములనర్వ క్యాంపును నిర్వహించడంలోనూ ఆయన ముఖ్య భూమిక పోషించారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు ఆకెన పవన్, ఏఐకెఎస్ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

## దళిత వ్యతిరేక బిఆర్ఎస్, బిజెపికి ప్రజలే బుద్ధి చెబుతారు

- ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వాన్ని రద్దు చేయాలి
- ఖమ్మంలో కాంగ్రెస్ నిరసన ర్యాలీ






**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దళిత వ్యతిరేక బిఆర్ఎస్, బిజెపికి ప్రజలే బుద్ధి చెబుతారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. బిఆర్ఎస్, బిజెపి దళిత వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ ఖమ్మంనగరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి నేతృత్వంలో సంజీవరెడ్డి భవన్ నుంచి జెడ్పి సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం డా।। బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎంఎల్‌సి తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం, దళితులు నిరసన తెలిపిన రోడ్డును పసుపు నీళ్లతో కడగటం హేయమైన చర్య అన్నారు. బిఆర్ఎస్ దళిత ద్రోహుల పార్టీ అని మరోసారి నిరూపితమైందన్నారు. ఉత్తరాఖండ్‌లో ఏఐసిసి అధ్యక్షులు, దళితబిడ్డ మల్లికార్జున్ ఖార్గె కాలు పెట్టిన ప్రదేశాన్ని బిజెపి నేతలు పసుపు నీళ్లతో కడగటం బిజెపి పార్టీకి దళితుల పట్ల ఉన్న వ్యతిరేక అర్థమవుతుందన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంఎల్‌సి తాతా మధు సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల ప్రజాపాలనను చూసి ఓర్వలేకే బిఆర్ఎస్ నేతలు రాష్ట్రంలో అలజడి సృష్టించాలని చూస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎంఎల్ఏ కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఖాదర్‌బాబా, సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య, పట్టాభి, అనుబంధ సంఘాల అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, బొడ్డు బొందయ్య, మొక్కా శేఖర్ గౌడ్, ముజాహిద్, విప్లవ్‌కుమార్, నాయకులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## పదవీ విరమణ కార్మికుల వైద్యానికి భరోసా కల్పించాలి

యాజమాన్యం ముందు ఎఐటియుసి డిమాండ్లు



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** సింగరేణి పదవీ విరమణ కార్మికుల వైద్య సమస్యల పరిష్కారానికి గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి యాజమాన్యం ముందు పలు కీలక డిమాండ్లను ఉంచింది. సింగరేణి ప్రధాన కార్యాలయంలో గురువారం రాత్రి సీపీఆర్ఎంఎస్, గ్రాట్యుటీ ట్రస్ట్ బోర్డు సమావేశం నిర్వహించారు. సమావేశంలో పదవీ విరమణ కార్మికుల వైద్య సదుపాయాలు, సిపిఆర్ఎంఎస్ నిధులు, రిఫరల్ వైద్య ఖర్చుల చెల్లింపులు, గ్రాట్యుటీ తదితర అంశాలపై చర్చించారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ సమావేశంలో పాల్గొని పదవీ విరమణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. సిపిఆర్ఎంఎస్ కార్డులో ఉన్న రూ.8 లక్షల పరిమితితో సంబంధం లేకుండా హార్ట్, రీనల్, న్యూరాలజికల్, క్యాన్సర్, ఎయిడ్స్, సెరిబ్రల్ ఫీవర్, తీవ్రమైన ప్రమాదాలు తదితర అనారోగ్య సమస్యలకు అవసరమైన వైద్యాన్ని అందించాలని కోరారు. దీనిపై యాజమాన్యం సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎఐటియుసి నాయకులు తెలిపారు. హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు రిఫరల్‌పై వెళ్లే సమయంలో కార్మికులు అదనంగా చెల్లించిన వైద్య ఖర్చుల బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని ఎఐటియుసి ప్రతినిధులు తెలిపారు. బిల్లుల ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలోకి తీసుకువచ్చి, త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం సిపిఆర్ఎంఎస్ ట్రస్ట్‌లో సుమారు రూ.116 కోట్లు మా త్రమే ఉన్నందున భవిష్యత్‌లో పదవీ విరమణ కార్మికుల వైద్య అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా అదనంగా రూ.50 కోట్లు జమ చేయాలని ఎఐటియుసి డిమాండ్ చేసింది. గ్రా ట్యుటీ ట్రస్ట్‌కు ఏటా సుమారు రూ.16 కోట్లు జమ చేస్తుండగా, కార్మికులకు సుమారు రూ.8 కోట్లు మాత్రమే చెల్లిస్తున్న నేపథ్యంలో మిగిలే మొత్తాన్ని కూడా పదవీ విరమణ కార్మికుల ప్రయోజనాలకు వినియోగించాలని కోరారు. లేనిపక్షంలో నిబంధనల ప్రకారం టెండర్లు పిలిచి అర్హత కలిగిన సంస్థను నియమించే అంశాన్ని పరిశీలించాలని యాజమాన్యానికి సూచించారు. సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డైరెక్టర్ (పా) గౌతం పోట్రూ పాల్గొన్నారు. జీఎం వెల్ఫేర్, ఈఈఈ, ఆర్‌సీ, సీఎంఓ, జీఎం ఫైనాన్స్, సీఎంఓఏ అధ్యక్షుడు లక్ష్మీ పతి గౌడ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

వాతావరణానికి అనుగుణంగా

## పంటల మార్పిడి చేపట్టాలి

'ఆత్మ' ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం:** మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల వైవిధ్యాన్ని అవలంభించాలని ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. మండల పరిధిలోని చింతగుర్తి గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్ (ఆర్‌పిఎల్) రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునేందుకు ఆయిల్ పామ్, నూనె గింజల పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. పంట మార్పిడి ద్వారానే భూసారం పెరిగి రైతులకు మేలు కలుగుతుందన్నారు. ఆరుతడి పంటలు సాగు ద్వారా రైతులు ఆదాయం పొందవచ్చునన్నారు. వైరా కెవికె శాస్త్రవేత్త పావని మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో మిరప, వరి పంటలను ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణకు ముందస్తు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎఫ్‌టిసి ఏవో ఇంటూరి భాస్కర్‌రావు మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో భూగర్భ జలాల లభ్యతను దృష్టిలో ఉంచుకుని పెసర, మినుము, బొబ్బర్లు వంటి ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. నీటి వనరులు పుష్కలంగా ఉన్న చోటే మొక్కజొన్న వేయాలన్నారు. రైతులు ముందస్తు ప్రణాళికతో శాస్త్రీయ పద్ధతులు పాటించి వ్యవసాయంలో నష్టాలను నివారించుకోవచ్చునని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ తమ్మిని నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ భరత్, ఏఈవో బి. శిరణ్మయి, మాజీ సర్పంచ్ మెంటెం రామారావు, రైతులు కేతినేని సీతారామయ్య, కేతినేని వెంకటేశ్వర్లు, బాగం ప్రసాద్, రామారావు పాల్గొన్నారు.

## ముస్లింలపై దాడులను ఖండిస్తూ నిరసన ప్రదర్శన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బిజెపి ప్రభుత్వం ఓ పథకం ప్రకారం మసీదులను, మదర్సాలను కూల్చివేస్తూ ముస్లింలపై దాడులు చేస్తుందని ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహ్మద్ సలాం తెలిపారు. మసీదుల కూల్చివేత ముస్లింలపై దాడులను ఖండిస్తూ శుక్రవారం ముస్లిం మైనార్టీలు మసీదు వాహిదీయా నుండి శ్రీదేవి ఆసుపత్రి వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ సలాం మాట్లాడుతూ యూపి సారంగాపూర్‌లో 1911లో కలెక్టరేట్‌లో మసీదును నిర్మించడం జరిగిందన్నారు. మసీదు ఇటుకలపై 1909లో తయారైనవి అని, కరెంటు బిల్లుతో సహా వక్ఫ్ ద్వారా ఇచ్చిన మసీదు స్థలంలోనే కలెక్టర్ ఆఫీసుకు స్థలం ఇచ్చినట్లు ఉందన్నారు. అక్కడ మందిరం కూడా ఉందని అయినా అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అబద్దాలతో అర్ధరాత్రులు మసీదును కూల్చివేశారన్నారు. ఖురాన్, పవిత్ర గ్రంథాలను కూడా తీసుకో నివ్వకుండా చేశారన్నారు. ఏదో ఒక నేపంతో బిజెపి ప్రభుత్వం ముస్లింలపై దాడులు చేస్తూ మైనార్టీ హక్కులను కాలరాస్తూ ఇష్టానుసారంగా కేసులు పెడుతుందన్నారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం ఇలాంటి చర్యలను మానుకోవాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె సైదా, కాంగ్రెస్ మైనార్టీ నాయకులు గౌస్, అవాజ్ నాయకులు హుస్సేన్, మసీదు సదర్ ఎస్‌కె రసూల్, నూరూర్ ఇస్లామ్, ఎస్‌కె మీరా, షకీమ్, యాకూబ్, జాని, డా।। ఖాసింపాషా, అజీజ్ పాల్గొన్నారు.

## అదరగొడుతున్న 1980 ట్రెండ్

- నెట్టింట సందడే సందడి
- అప్రమత్తత అవసరం




**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:**1980వ సంవత్సరం నెట్టింట మళ్లీ చొరబడింది. నాలుగున్నర ద శాబ్దాల జ్ఞాపకాలు ఒక్కసారిగా కళ్ల ముందు కదలాడుతున్నాయి. 1980 రెట్రో ట్రెండ్ ప్రస్తుతం సో షల్ మీడియాలో అదరగొడుతోంది. అప్పటి ఫ్యా షన్, హెయిర్ స్టైల్, దుస్తులు, ఆ కాలపు వాహనా లు, ఇళ్లు సినిమా వాతావరణాన్ని పోలిన ఫొటోలను ఏఐ సహాయంతో రూపొందించుకుంటూ నేటి జన్లు సోషల్ మీడియాలో షేర్ చేస్తుండటంతో 1980 నాటి ట్రెండ్ తెగ ఆకట్టుకుంటోంది.

**1980 లుక్ ఆసక్తి కరంగా :** ప్రస్తుత ఫొటోలను 1980 నాటి లుక్‌లోకి మార్చుకోవడం అప్పటి కాలం నాటి దుస్తులు, జట్టుతీరు నేపథ్యాలను జోడించు కోవడంతో ఈ ట్రెండ్ మరింత ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉండగా చాలామంది జర పైలం అంటూ సోషల్ మీడియా వేదికగా సెటైర్ల మీద సెటైర్లు విసురుతున్నారు. ఈ సరదా వ్యాఖ్యలతో ఫొటోలు షేర్ చేస్తున్న యువత మురిసి ముద్దవుతోంది. మరో ప్రక్క 1980 కాలాన్ని చూసిన పెద్దలు రెట్రోఫొటోలతో పాతజ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆ రోజులను తలచుకుంటున్నారు. ఇదిలా ఉండగా అసలు 1980 నాటికి పుట్టని వారు కూడా అప్పటి జీవనశైలిలో రెట్రో ఫొటోలు తయారు చేసుకుని తమ పూర్వికుల అనవాళ్లను తమలో చూసుకుంటున్నారు.

**పాత జ్ఞాపకాలు – కొత్త లుక్కు :** ఒకప్పుడు తీసుకున్న కుటుంబానికి చెందిన ఫొటోలు చిన్ననాటి చిత్రాలు పాతకాలపు సినిమా లుక్కులను ఆధారం చేసుకుని కొత్త రెట్రో ఫొటోలు రూపొందించుకుంటున్నారు. మిత్రులు కుటుంబ సభ్యులతో కలిసి 1980 నాటి వాతావరణాన్ని పునఃసృష్టిస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. ఒక్కొక్క ఫొటోకు వస్తున్న స్పందనతో మరింత మంది ఈ ట్రెండ్‌ను సొంతం చేసుకుంటున్నారు.

**ట్రెండ్ మాటున సైబర్ ముప్పు :**ఈ రెట్రో ట్రెండను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మరుచుకునే అవకాశం లేక పోలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఒక్క క్లిక్‌తో రెట్రో ఫొటో అంటూ వచ్చే అనుమానాస్పద లింకులు యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలి. వ్యక్తిగత ఫొటోలు అప్‌లోడ్ చేయడం వల్ల దుర్వినియోగమయ్యే అవకాశం ఉంది. ఫొటో ఎడిటింగ్ క్రమంలో ఓటిపిలు అడిగితే జాగ్రత్తగా ఉండాలి లేదంటూ బ్యాంకు ఖాతాలు ఖాళీ అయ్యే అవకాశం ఉంది. అప్రమత్తంగా లేకుంటే ట్రెండ్ పేరుతో గుండు గీసేస్తారంటూ పలువురు జోకులు వేస్తున్నారు. సోషల్ మీడియా మోజులో పడి జాగ్రత్తలు మరిస్తే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడే ప్రమాదం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ వాటిపై మరింత అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సమతుల్య పోషకాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని సర్పంచ్ గాజుల కృష్ణారావు తెలిపారు. శుక్రవారం రఘునాథపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం సందర్భంగా పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణారావు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు బలవర్ధక ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించవచ్చునన్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారాన్ని ప్రతి ఒక్క రూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎం రాధా రుక్మిణి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పరిశుభ్రత, పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఎస్‌కె నజ్మా, జి. పార్వతి, ఈ. లక్ష్మి, ఎన్.ఉపవాణి, టి. కవిత, డి. ఉషారాణి, ఆయాలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

# భారత విద్యావ్యవస్థ యువతరాన్ని విఫలం చేస్తోంది

- ఈ వ్యవస్థపై ఎందుకు విశ్వాసం కోల్పోయారో చెప్పండి
- విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు రాహుల్‌గాంధీ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** భారతదేశ విద్యా వ్యవస్థపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండి పడ్డారు. అది ఏ తరాన్ని ఉన్నత స్థాయికి తీసుకురావాలో అనుకుంటుందో, అదే తరాన్ని విఫలం చేస్తోందని విమర్శించారు. దేశ విద్యావ్యవస్థపై ఎందుకు ఆశ కోల్పోయారో తనకు చెప్పాలని ఆయన విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కోరారు. ప్రతిరోజూ విద్యా వ్యవస్థ వైఫల్యాలను అనుభవిస్తున్న వారి మాటలు వినడంతోనే దానిని సరిదిద్దడం మొదలవుతుందని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. 'భారత విద్యా వ్యవస్థ, అది ఏ తరాన్ని ఉన్నత స్థాయికి తీసుకురావాలో అనుకుంటుందో, అదే తరాన్ని విఫలం చేస్తోంది. పేపర్ లీకులు. అధిక ఫీజులు. శిథిలమవుతున్న మౌలిక సదుపాయాలు. లక్షలాది మంది యువ భారతీయులు నిజాయితీగా పనిచేస్తున్నా, ఈ వ్యవస్థ వారిని నిరాశపరుస్తోంది' అని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. రాహుల్‌గాంధీ తాను పంచుకున్న ఆన్‌లైన్ లింక్‌లో తమ అనుభవాలను, ఆధారాలను, ఆలోచనలను పంచుకోవాలని విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కోరారు. అందరం కలిసి విద్యావ్యవస్థపై కోల్పోయిన విశ్వాసాన్ని తిరిగి తీసుకువద్దామన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈనెల 19న జరగనున్న తన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం ఐదవ విడతకు ముందు రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. వ్యవస్థను మార్చాలంటే దేశంలోని ప్రతి విద్యార్థి గొంతు వినడం అత్యవసరం అని ఆయన నొక్కి చెప్పారు. రాహుల్ కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్, పుణెలలో నాలుగు 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమాలను నిర్వహించారు. ఆగస్టు 22న పుణెలో జరిగిన చివరి కార్యక్రమం బాలికా విద్యార్థుల కోసం నిర్వహించబడింది.


తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ శాఖ
ఫారం - VI
(ప్రాథమిక నోటిఫికేషన్)

భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం - 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) రూల్ (19) సబ్ సెక్షన్(1) అనుసరించి

నెం. G1/1013/2021 తేది: 07-09-2026

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టం, 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కొత్తపల్లి H/o బొమ్మారెడ్డిపల్లి గ్రామ పరిధిలో ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదాహరించిన **(17.37) ఎకరముల** పట్టా / ప్రభుత్వ భూములు ప్రజా ప్రయోజనార్థం అనగా ధర్మారం మండలం కొత్తపల్లి గ్రామంలో మదరికండి వోర్రె మీదుగా మదరికండి చెరువు ఏర్పాటు కొరకు అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్, పెద్దపల్లి గారు భావిస్తున్నారు. భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టం, 2013 (చట్టం 30/2013) సెక్షన్ 6(2) మరియు 10ఎ ననుసరించి మినహాయింపు, చాప్టర్ (2) లోని సామాజిక ప్రభావ అధ్యయన నివేదిక మరియు చాప్టర్ II & III లోని ఆహార భద్రత మరియు పరిరక్షణ వంటి అంశములు తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య. 15, Irrigation & CAD (LA) Department, తేది:25.04.2022 క్రమము వర్తించవు.

షెడ్యూల్

గ్రామం: కొత్తపల్లి H/o బొమ్మారెడ్డిపల్లి మండలం: ధర్మారం జిల్లా: పెద్దపల్లి

| సర్వే నెం. | [illegible] | [illegible] | [illegible] | పహాని క్రమము పట్టాదారుని పేరు | అనుభవదారు యొక్క పేరు | [illegible] | ఇతర వివరములు (బావులు, నిర్మాణములు, చెట్లు వగైరా) |
|---|---|---|---|---|---|---|---|
| 952 | 2.27 | పరంపోగు | ఖుష్కి | - | ఎలుక రాజయ్య తండ్రి ముత్యాలు | 1.15 | 81-మామిడి 26-ఎర్ర చందనం 4-వేప చెట్లు 1-తుమ్మ చెట్టు 2-టేకు చెట్లు 424-సుబాబు చెట్లు |
| | | | | | ప్ర.భూమి | 1.12 | |
| 953 | 6.25 | పట్టా | ఖుష్కి | ఎలుక రాజయ్య తండ్రి ముత్యాలు సాన జయుకర్ తండ్రి రాజమల్లు సాన జనార్ధన్ తండ్రి రాజమల్లు రామిల్ల భూమయ్య తండ్రి రాజయ్య ఎలుక కవిత భర్త రాజయ్య | ఎలుక కవిత తండ్రి రాజయ్య | 1.11 | 16-శ్రీగంధం చెట్లు 717- టేకు చెట్లు 20- వేప చెట్లు 12- సుబాబు చెట్లు 3- ఖర్జూర చెట్లు 1- దుర్షన్ చెట్టు 1-Sheep షెడ్ 1- ఇల్లు 2-బావులు 1- డ్రిప్ పైప్ లైన్ 1- పైప్ లైన్ 2- మోటార్లు |
| | | | | | రామిల్ల భూమయ్య తండ్రి రాజయ్య | 5.14 | 1-బావి 1-మోటార్ 1-పైప్ లైన్ 1-టేకు చెట్టు 1 వేప చెట్టు |
| 954 | 6.00 | పట్టా | ఖుష్కి | ఎలుక రాజయ్య తండ్రి ముత్యాలు సాన జనార్ధన్ తండ్రి రాజమల్లు సాన జయకర్ తండ్రి రాజమల్లు రామిల్ల భూమయ్య తండ్రి రాజయ్య ఎలుక కవిత భర్త రాజయ్య బొల్లి స్వామి తండ్రి చంద్రయ్య | ఎలుక కవిత తండ్రి రాజయ్య | 4.35 | 45- సీతాఫలం 1-ఎర్ర చందనం 1-తుమ్మ 1-సపోటా 134-మామిడి చెట్లు 3-బత్తాయి చెట్లు 7-దానిమ్మ చెట్లు 4- జామ చెట్లు 2-అల్ల నేరేడు 1-బావి 1-బోరు బావి 1-చేపల చెరువు 173-ఫెన్సింగ్ పోల్స్ 2x2 మీ. పిల్లర్ బెడ్ |
| | | | | సాన జనార్ధన్ తండ్రి రాజమల్లు | సాన జనార్ధన్ తండ్రి రాజమల్లు | 0.22 1/2 | 40-మామిడి చెట్లు 1-పైప్ లైన్ వేప చెట్లు 1-టేకు చెట్లు |
| | | | | సాన జయుకర్ తండ్రి రాజమల్లు | సాన జయుకర్ తండ్రి రాజమల్లు | 0.22 1/2 | 39-మామిడి చెట్లు 1-పైప్ లైన్ డ్రిప్ 1 వేప చెట్టు 1-దుర్షన్ చెట్టు |
| 959 | 2.25 | పట్టా | ఖుష్కి | ముస్కు శ్రీనివాస్ రెడ్డి తండ్రి జనార్ధన్ రెడ్డి | ముస్కు శ్రీనివాస్ రెడ్డి తండ్రి జనార్ధన్ రెడ్డి | 2.25 | 1-బావి 1-మోటార్ 2-చింత చెట్లు 1-వేప చెట్టు |
| మొత్తం : | 17.37 | | | | | 17.37 | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టం 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్నీ తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్, పెద్దపల్లి గారు, రెవెన్యూ డివిజినల్ అధికారి, పెద్దపల్లి మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి కలెక్టర్, పెద్దపల్లి గారి అనుమతి లేకుండా షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టములోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏమైనా అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న ఎడల సంబంధిత వ్యక్తులు రెవెన్యూ డివిజినల్ అధికారి, పెద్దపల్లి గారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు (60) రోజులలోపు చేసుకోవచ్చును.

సం/- భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, పెద్దపల్లి.
సం/- అదనపు కలెక్టర్ పెద్దపల్లి
సం/- కలెక్టర్, పెద్దపల్లి

DIPR RO No. 850/LA/PP/Advt/Pub/2026-27


'నేడు' 18వ 'బ్రిక్స్' శిఖరాగ్ర సదస్సుకు...

# ఢిల్లీ సర్వం సిద్ధం

- శని, ఆదివారాల్లో సమావేశాలపై యావత్ ప్రపంచం నిశిత దృష్టి
- చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ రాకపై సర్వత్రా చర్చ




**న్యూఢిల్లీ :** ప్రపంచ వాణిజ్య విధానాలు, భౌగోళిక రాజకీయ అస్థిరతలు, ఆర్థిక ప్రతికూలతలను సృష్టిస్తున్న నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో భారతదేశం ఆతిథ్యం ఇవ్వనున్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా) 18వ శిఖరాగ్ర సదస్సుపై యావత్తు ప్రపంచం నిశితదృష్టి సారిస్తోంది.శని, ఆదివారాలలో (సెప్టెంబరు 12, 13 తేదీలు) ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సమావేశాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. బ్రిక్స్ దేశాధినేతలకు పటిష్ఠ సెక్యూరిటీ ఏర్పాట్లు, బస, వసతిసౌకర్యాలు, ఆతిథ్యానికి భారతదేశం తరపున సర్వం సిద్ధమైంది.బ్రిక్స్ ఆవిర్భవించి 25 సంవత్సరాలు కావడం, ప్రపంచ దేశాలలో నెలకొన్న భిన్న పరిస్థితుల మధ్య బ్రిక్స్ సభ్య దేశాలకు చెందిన అగ్రనేతలు ఢిల్లీలో కాలిడబోతున్నారు. ఉక్రెయిన్, పశ్చిమాసియాలోని సంఘర్షణల ప్రభావం నుండి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలను కాపాడటంతో సహా ప్రపంచ సవాళ్లను అధిగమించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా బ్రిక్స్ దేశాల ఇతర నాయకులు భారతదేశం ఆతిథ్యంలో శని, ఆదివారాలలో జరుగనున్న బ్రిక్స్ కూటమి 18వ శిఖరాగ్ర సదస్సుకు హాజరుకానుండటం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఏడేళ్ల విరామం తర్వాత చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ భారత్‌లో అడుగుపెట్టబోతుండటం విశేషం. ఆయన శని, ఆదివారాలలో జరుగబోయే బ్రిక్స్ సదస్సులో పాల్గొనడం ప్రపంచ రాజకీయ మేధావులు, విశ్లేషకుల్లో చర్చకు దారితీస్తోంది. జీ జిన్‌పింగ్ 2019లో చివరిసారిగా భారత్‌కు వచ్చారు. సరిహద్దు వివాదాలు, ఇతర ద్వైపాక్షిక అంశాల నేపథ్యంలో ఇరుదేశాల సంబంధాలు మున్ముందు ఎలా ఉంటాయనేది మోదీ, జీ జిన్‌పింగ్ భేటీపై ఆధారపడి ఉంటుంది. ప్రారంభంలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా కూడిన బ్రిక్స్ కూటమి, 2024లో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ అరబ్‌ఎమిరేట్స్, సౌదీ అరేబియా దేశాలను చేర్చుకోవడంతో విస్తరించింది. 2025లో ఇండోనేసియా కూడా ఇందులో చేరింది. గత ఏడాది బెలారస్, బొలీవియా, కజఖస్థాన్, క్యూబా, మలేసియా , నైజీరియా, థాయ్‌లాండ్, ఉగాండా, ఉజ్బెకిస్థాన్, వియత్నాం బ్రిక్స్ భాగస్వామ్య దేశాలుగా మారాయి. ప్రపంచంలోని 11 ప్రధాన వర్ధమాన ఆర్థిక వ్యవస్థలను ఒక చోటచేర్చి సుమారు 49.5 శాతం వాటాకు ప్రపంచ జనాభా, ప్రపంచ జిడిపిలో సుమారు 40శాతం, ప్రపంచ వాణిజ్యంలో సుమారు 26శాతం వాటా కలిగి ఉన్న నేపథ్యంలో బ్రిక్స్ ఒక ప్రభావవంతమైన కూటమిగా ఆవిర్భవించింది. ఈ కూటమికి భారతదేశం అధ్యక్షత వహించడం స్థితి స్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత అనే నాలుగు స్తంభాలపై కేంద్రీకృతమై ఉంది. స్థితిస్థాపకత స్తంభం కింద ఆరోగ్యం,వ్యవసాయం, ఆహారం, ఇంధనం, విపత్తు ప్రమాద తగ్గింపు, సరఫరా గొలుసులు వంటి రంగాలలో సామూహిక సహకారాన్ని బలోపేతం చేయడంపై భారతదేశం దృష్టిసారిస్తోందని అధికారులు తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడి, అనుసంధానం, ఉన్నత సాంకేతికత రంగాలలో సహకారాన్ని పెంపొందించడం కూడా ఈ శిఖరాగ్ర సదస్సులో ప్రధాన అజెండాగా ఉండబోతున్నదని వారు వెల్లడించారు. వ్యూహాత్మకత సమతుల్య చర్యగా, అమెరికా, ఇతర పాశ్చాత్య శక్తుల సున్నితత్వాలను, ముఖ్యంగా వాణిజ్యం, ఇంధన రంగాలను దృష్టిలో ఉంచుకుంటూనే ఆర్థిక వృద్ధికి ఈ కూటమిని ఒక సహాయక చోదక శక్తిగా నిలబెట్టడానికి న్యూఢిల్లీ ఈ రెండు రోజుల వార్షిక శిఖరాగ్ర సమావేశాన్ని ఉపయోగించుకోవాలని చూస్తోంది. భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష హోదాలో, ఉక్రెయిన్, పశ్చిమాసియాలోని సంఘర్షణల ఆర్థిక పరిణామాల నుంచి అభివృద్ధి చెందుతున్న దేశాలను వేరు చేయడానికి భారతదేశం ప్రధానంగా ఆహారం, ఇంధనం, సరఫరా గొలుసు భద్రత కోసం ఆచరణీయ పరిష్కారాలను అన్వేషించడం ద్వారా గ్లోబల్ సౌత్‌ను తన అజెండాకు కేంద్రంగా ఉంచింది. జీ జిన్‌పింగ్, పుతిన్‌తో పాటు న్యూఢిల్లీ బ్రిక్స్ సదస్సుకు హాజరవుతున్న ఇతర నాయకులలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరల్ రమాఫోసా, ఇండోనేసియన్ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తా ఎల్–సిసి, మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం, అబుదాబీ యువరాజు మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, ఇథియోపియా ప్రధానమంత్రి అబియ్ అహ్మద్ అలీ, వియత్నాం ప్రధానమంత్రి లే మిన్ హంగ్ ఉన్నారు. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, డబ్ల్యుటిఓ డైరెక్టర్ జనరల్ న్గోజీ ఒకోంజో–ఇవెయిఅలా, డబ్ల్యుహెచ్ఓ చీఫ్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రెయేసస్, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డిబి) ప్రెసిడెంట్ దిల్మారౌసెఫ్, ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ చీఫ్ జూ జియాయీ కూడా బ్రిక్స్ సదస్సుకు హాజరుకానున్నారు. బ్రెజిల్ ప్రతినిధి బృందానికి విదేశాంగ మంత్రి మౌరో వీరా నేతృత్వం వహించనున్నారు. థాయ్ ఉప ప్రధాని సిహాసక్ ఫువాంగ్ కెట్కియో, ఉజ్బెకిస్థాన్ ఉప ప్రధాని జంషిద్ కుచ్కరోవ్, ఉగాండా వైస్ ప్రెసిడెంట్ జెస్సికా రోజ్ ఎపెల్ అలుపో ఈ శిఖరాగ్ర సదస్సులో తమ తమ దేశాలకు ప్రాతినిధ్యం వహించనున్నారు.ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్ మార్కోస్ జూనియర్, బురిండి ప్రెసిడెంట్ ఎవరిస్ట్ న్డాయిషిమియే, కజకిస్థాన్ ప్రెసిడెంట్ కాస్సిమ్ –జోమార్ట్ టోకాయెవ్ కూడా వరుసగా ఆసియాన్, ఆఫ్రికన్ యూనియన్, యురేషియాన్ ఎకనామిక్ యూనియన్ (ఇఏఇయు) అనే ప్రాంతీయ కూటములకు ప్రాతినిధ్యం వహించడానికి ఈ శిఖరాగ్ర సమావేశంలో చేరనున్నారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా సంక్షోభం, ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి దిగ్బంధనం, ట్రంప్ పరిపాలన యొక్క వాణిజ్య, సుంకాల విధానాల వంటి ప్రతికూల ప్రభావాలను ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ శిఖరాగ్ర సమావేశం జరుగుతున్నందున దీనికి మరింత ప్రాముఖ్యత సంతరించుకుంటోంది.


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
జోగుళాంబ గద్వాల జిల్లా.

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహారము హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారము

ఫారం-6
ప్రాథమిక ప్రకటన

జిల్లా కలెక్టర్, జోగుళాంబ గద్వాల ప్రొసీడింగ్ నెం. G/599/2026, తేదీ: 19.8.2026
ప్రత్యేక ఉపకలెక్టర్ (భూ.సే) జే.ఎల్.ఐ.పి, లేఖ నెం. A1/32/2026 తేదీ: 18.8.2026
జిల్లా రాజా పత్రం నెం. 45/2026

ఈ దిగువ నిర్దిష్ట పరిచిన జోగుళాంబగద్వాల జిల్లా మల్దకల్ మండలము విఠలాపురం గ్రామము పరిధి నందు ఈ క్రింది షెడ్యూలలో ఉదహరించిన **ఎ.1.26సెంట్లు** భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా 2R Sub Minor/SDY4 of DY1 Canal నిర్మాణం.
నిమిత్తము సేకరించవలసిన అవసరము ఉన్నదని జిల్లా కలెక్టర్, జోగుళాంబ గద్వాల జిల్లా గారు భావిస్తున్నారు. తెలంగాణ భూసేకరణ సవరణ చట్టం 2016 (యాక్ట్ నెం. 21/2017) సెక్షన్ 10ఎ క్రింద మినహాయింపు ఇచ్చియున్నారు. కావున నీటి పారుదల శాఖ ప్రాజెక్టుకు సామాజిక ప్రభావము అధ్యయన వేదిక అవసరం లేనందున అనుబంధములో పేర్కొనిన భూములకై నోటీసు జారీ చేయనైనది.

షెడ్యూలు

| క్ర. సం. | సర్వే నెం. / సబ్.డి. నెం. | పట్టా / ఇనాం etc., | భూవర్గీకరణ మెట్ట / తరి / [illegible] | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణం ఎ.సెంట్లు / ఎ.గుంటలు | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులుగల యితర వ్యకులు | సరిహద్దులు | | | | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | తూ | ప | ఉ | ద | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 363 | పట్టా | మెట్ట | 0.10 | 1)బోయ సవారన్న S/o బతుకన్న 2)బోయ దొడ్డెన్న S/o బతుకన్న 3)బోయ తిమ్మన్న S/o బతుకన్న 4)బోయ శంకరమ్మ W/o మల్దకల్ 5)మహేశ్వర్ రెడ్డి S/o చక్రపాణి రెడ్డి 6)బోయ లక్ష్మ న్న S/o దుబ్బన్న 7)కుమ్మరి జగదీశ్వర్ S/o నాగప్ప 8) కుమ్మరి కృష్ణయ్య S/o నాగప్ప 9)B.కృష్ణ కుమార్ నాయుడు S/O B.బడే సబ్ 10) బి. వేణుగోపాల్ S/o బి.బడే సబ్ | - | - | - | - | | | - | |
| | విస్తీర్ణము | | | 1.26 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్, జోగుళాంబ గద్వాల జిల్లా గారు, ప్రత్యేక ఉపకలెక్టర్, జె.ఎల్.ఐ.పి, గద్వాల మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వేమరియు యితర పనులు చేపట్టుటకు అధికార మివ్వనైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలో సెక్షన్ 11(4) ననుసరించి కలెక్టర్ గారి అనుమతి లేకుండా షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏ విధమైనా లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టర్, జె.ఎల్.సి.పి, గద్వాల, గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూ.సే), జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, జోగులాంబ గద్వాల
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జోగులాంబ గద్వాల జిల్లా
సం/- కలెక్టర్, జోగులాంబ గద్వాల జిల్లా

DIPR RO NO. 864/LA/PP/Advt/Pub/2026-27


పారదర్శక, వాణిజ్య పెట్టుబడి విధానాలను..

# 'బ్రిక్స్' సదస్సులో నిర్ధారించుకోవాలి

బిజినెస్ ఫోరం ప్రసంగంలో మంత్రి ఎస్.జైశంకర్ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** స్థిరత్వాన్ని నిర్ధారించడానికి విస్తృత ప్రపంచాన్ని పారదర్శక, బహిరంగ వాణిజ్య పెట్టుబడి విధానాలను అవలంభించడం ద్వారా బ్రిక్స్ దేశాలు పెరుగుతున్న ప్రపంచ మార్కెట్ అస్థిరతను పరిష్కరించాలని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కోరారు. శుక్రవారం బ్రిక్స్ బిజినెస్ ఫోరంలో చేసిన ప్రసంగంలో, భౌగోళిక, రాజకీయ సంక్షోభాల గురించి కూడా ఆయన మాట్లాడారు. సరఫరా గొలుసు అంతరాయాలను పరిష్కరించేందుకు సమష్టి కృషి చేయాల్సిన అవసరామన్ని మంత్రి జైశంకర్ నొక్కిచెప్పారు. 'ప్రపంచ రాజకీయ వ్యవస్థ అల్లకల్లోలంగా ఉన్న తరుణంలో మనం కలుసుకుంటున్నాం. అస్థిరత, అనిశ్చితి, సంక్లిష్టత మన చుట్టూ ఉన్న ప్రపంచానికి నిర్వచనాత్మక లక్షణాలుగా మారాయి' అని ఆయన అన్నారు. భౌగోళిక రాజకీయ సంఘర్షణలు, మహమ్మారులు, వాతావరణ సంబంధిత అంతరాయాల వల్ల కలిగే ఆర్థిక పరిణామాలను మనం గత కొంతకాలంగా చూస్తున్నామని గుర్తుచేశారు. ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడానికి మార్కెట్‌కు మరింత ప్రాప్యత, సరఫరా గొలుసులో పటిష్ఠత అవసరమన్నారు. మనదేశాల్లోని వ్యాపారాల కోసం మరింత మంది భాగస్వాములను కనుగొనడం, మరిన్ని మార్కెట్లకు చేరుకోవడం, సరఫరా నెట్‌వర్క్‌లను అనుసంధానించడం, పరస్పర అనుకూలతలకు ఆచరణీయ వాణిజ్య భాగస్వాములుగా మార్చడం ఎలా సులభతరం చేయాలనేదే దీనిలోని ప్రధానాంశం అని విదేశాంగ మంత్రి చెప్పారు. 'ముఖ్యంగా, బ్రిక్స్ దేశాలకు అధిక ఆర్థిక కార్యకలాపాలు, అధిక ఆర్థిక భద్రత అంటే ఎక్కువ ఆత్మ నిర్భరత అని అర్థం. అనుసంధానంగా, పోటీ తత్వంతో కొనసాగుతున్న ఒడిదుడుకులను తట్టుకునే మన సామర్థ్యాన్ని బలోపేతం చేసుకోవడమే లక్ష్యం' అని ఆయన తెలిపారు. ఈ పరిస్థితికి నిజమైన మార్కెట్ పద్ధతులు, నమ్మకమైన లాజిస్టిక్స్, ఊహించదగిన వ్యాపార వాతావరణం, విభిన్న వాణిజ్య సంబంధాలు, పారదర్శక వాణిజ్యం, పెట్టుబడులు అవసరమన్నారు. అంతరాయాలను తట్టుకోగల ఇంధన వ్యవస్థలు, అలాగే, విభిన్న జాతీయ పరిస్థితులకు అనువైన పరివర్తన మార్గాలు కూడా అవసరమని విదేశాంగ మంత్రి వివరించారు. న్యూఢిల్లీలో శనివారం, ఆదివారం జరుగనున్న బ్రిక్స్ సదస్సుకు భారతదేశం ఆతిథ్యం ఇస్తోంది. బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్, బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ద్వారా ఆవిష్కరణ, వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి భారతదేశం బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహిస్తోందని, దీని ప్రయోజనాలు అన్ని వ్యాపారవర్గాలకు అందుబాటులో ఉండాలని జైశంకర్ నొక్కిచెప్పారు. బ్రిక్స్ నాయకులు సమావేశానికి సిద్ధమవుతోన్న తరుణంలో, బ్రిక్స్ సహకారంలో తదుపరి దశకు స్పష్టమైన వ్యాపార దృక్పథాన్ని తీసుకురావడమే ఈ ఫోరం యొక్క అత్యంత ఉపయోగకరమైన సహకారం అవుతుందని, అవకాశాలు, వ్యాపారాలు ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వాలు ఏమి చేయగలవు? అనే అంశాలపై దృష్టి సారించాలని మంత్రి ఈ సందర్భంగా బ్రిక్స్ సభ్య దేశాధినేతలను కోరారు.

# సిఎం విజయ్ అవకాశవాది

- అది 'అవకాశవాద డబ్బు సంచుల కూటమి' • టివికె కూటమిని ఎద్దేవా చేసిన డిఎంకె

**చెన్నై :** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయన్ అవకాశవాది అని ప్రధాన ప్రతిపక్షమైన డిఎంకె విమర్శించింది. అధికార టివికె ఏర్పాటు చేసిన కూటమికి ఎటువంటి నైతికత లేదని, అది కేవలం 'అవకాశవాద డబ్బు సంచుల కూటమి' అని ఎద్దేవా చేసింది. ఒకప్పుడు ఇతరులు అని కొట్టిపారేసిన పార్టీలతోనే విజయ్ ఇప్పుడు చేతులు కలపడంతో, ఆయన కూడా ఆ ఇతరులలో ఒకరిగా మారిపోయారని వ్యాఖ్యానించింది. అధికార పార్టీ నేతృత్వంలోని కూటమికి 'లౌకిక సామాజిక న్యాయ విజయ కూటమి' అని పేరు పెట్టడాన్ని ప్రస్తావిస్తూ, డిఎంకె పత్రిక 'మురసోలి' 'వారి ముఖాలను చూడండి' అని వ్యాఖ్యానించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఏ పార్టీలనైతే విజయ్ 'డబ్బు సంచుల కూటమి పార్టీలు' అని ముద్ర వేశారో, వాటన్నింటినీ ఇప్పుడు ఆయన ఒకచోట చేర్చారని ఆ పత్రిక పేర్కొంది. ఒకప్పుడు ఆ పార్టీల పేర్లు ప్రస్తావించడానికి కూడా అర్హత లేదని భావించిన వ్యక్తి విజయ్ అని, ఆయన వాటిని కేవలం ఇతరులు అని కొట్టిపారేశారని, ఇప్పుడు, అవే ఇతరులను ఏకం చేసి ఆయన 'థంబ్స్ అప్' (విజయ సంకేతం) చూపిస్తున్నారని విమర్శించింది.

నేటి నుంచి 'బ్రిక్స్' సదస్సు

# భద్రతా వలయంలో ఢిల్లీ

15,000 మంది ఢిల్లీ పోలీసు సిబ్బంది, 200 కంపెనీల పారామిలిటరీ దళాలు మోహరింపు

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ వేదికగా శనివారం ప్రారంభమయ్యే రెండు రోజుల 18వ బ్రిక్స్ సదస్సుకు ఎలాంటి ఆటంకం రాకుండా పోలీసులు, కేంద్ర భద్రతా, నిఘా సంస్థలు అప్రమత్తమయ్యాయి. సుమారు 15,000 మంది ఢిల్లీ పోలీసు సిబ్బంది, 200 కంపెనీల పారామిలిటరీ దళాలు, ఢిల్లీ వ్యాప్తంగా 500కు పైగా సిసిటివి కెమెరాలతో రాజధాని నగరం కట్టుదిట్టమైన భద్రతా వలయంలో ఉంది. నగరం మూసివేత ఉండదని, అయితే వివిఐపి కాన్వాయ్‌లు ప్రయాణించే మార్గాల్లో తాత్కాలిక నిలుపుదలలు, దారి మళ్లింపులు, ఆంక్షలు ఉంటాయని ప్రయాణికులు ఆశించవచ్చని ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. భద్రతా ఏర్పాట్లు అనుమతించిన చోటల్లా ట్రాఫిక్ యథావిధిగా కొనసాగుతుందని అధికారులు తెలిపారు. విదేశీ ప్రముఖుల రాకపోకల సమయంలో వాహనాల నిలుపుదలకు నిర్దిష్ట సమయం ఉండదని, భద్రతా పరిస్థితి, క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి దశలవారీగా వాహనాలను విడుదల చేస్తారని వారు తెలిపారు. పర్యటించే ప్రముఖులకు గరిష్ట భద్రత కల్పిస్తూ, ప్రజలకు కనీస అసౌకర్యం కలిగించేందుకు ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సదస్సు కోసం శుక్రవారం తెల్లవారుజామున ఢిల్లీకి చేరుకోగా, ఏడేళ్ల విరామం తర్వాత భారతదేశానికి తొలిసారిగా వస్తున్న చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హాజరును ఆ దేశం ధృవీకరించింది. హాజరయ్యే ఇతర ప్రపంచ నాయకులలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తా ఎల్‌సిసి, అబుదాబి యువరాజు మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, ప్రపంచ ఆరోగ్య సంస్థ అధిపతి టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రేయెసస్ తదితరులు ఉన్నారు. గుర్తించిన మార్గాలలో ఢిల్లీ పోలీసులు విస్తృతమైన సర్వేలు నిర్వహించి, పలు



ఏజెన్సీలు, పొరుగు రాష్ట్రాలతో సమన్వయ సమావేశాలు నిర్వహించారని అధికారులు తెలిపారు. విమానాశ్రయం, హోటళ్లు, భారత్ మండపం, ప్రముఖులు సందర్శించే ఇతర ప్రదేశాలలో భద్రతా ఏర్పాట్లు ఉంటాయి. న్యూఢిల్లీ జోన్‌లో, అధిక రిజల్యూషన్ గల కెమెరాలతో సహా 500కు పైగా సిసిటివి కెమెరాలు, ముఖ గుర్తింపు వ్యవస్థలు, వాహనాల నంబర్ ప్లేట్లను చదివే కెమెరాలు ఒక పర్యవేక్షణ గది ద్వారా 24 గంటలూ నిఘా ఉంచుతాయని అధికారులు తెలిపారు. సదస్సు జరిగే వేదిక వద్ద, అలాగే విదేశీ ప్రముఖులు బస చేసే హోటళ్ల వద్ద పటిష్టమైన ప్రవేశ నియంత్రణ, ధృవీకరణ, నిఘా సేకరణ, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర ప్రతిస్పందన యంత్రాంగాలను కూడా ఏర్పాటు చేశారు. సదస్సు జరిగే సమయంలో 35కు పైగా రోడ్లపై ప్రభావం పడొచ్చని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వీటిలో మధుర రోడ్ సర్దార్ పటేల్ మార్గ్, శాంతి పాత్, జన్‌పథ్, అశోక రోడ్ బారాఖంబా రోడ్ టాల్‌స్టాయ్ మార్గ్, ఆఫ్రికా అవెన్యూ రోడ్ నీతి మార్గ్, పంచశీల్ మార్గ్, ఏపీజే అబ్దుల్ కలాం రోడ్ వంటి కీలకమైన రోడ్లు ఉన్నాయి. నోయిడా, సెంట్రల్ ఢిల్లీ, తూర్పు ఢిల్లీ, మధ్య ప్రాంతాల మధ్య, అలాగే ద్వారక, పశ్చిమ ఢిల్లీ నుంచి ధౌలా కువాన్, విమానాశ్రయం, దక్షిణ ఢిల్లీ వైపు ప్రయాణించే వారిపై దీని ప్రభావం గణనీయంగా ఉంటుందని అంచనా. సాకేత్‌లోని తమ హోటల్, సెంట్రల్ ఢిల్లీ మధ్య ఈజిప్టు ప్రతినిధి బృందం రాకపోకల వల్ల, ముఖ్యంగా రద్దీ సమయాల్లో దక్షిణ ఢిల్లీ రోడ్లపై అదనపు ఒత్తిడి పడవచ్చు. సదస్సు స్థాయి దృష్ట్యా ప్రతిరోజూ అనేకసార్లు అత్యంత కట్టుదిట్టమైన భద్రతతో కూడిన రాకపోకలు అవసరమవుతాయని అధికారులు తెలిపారు.

# తెరుచుకోని బ్యాంక్‌లు

**న్యూఢిల్లీ :** క్రిస్టియన్ మైఖేల్‌ను వారానికి ఐదు రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలని, వేతనాలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యుఎఫ్‌బియు) దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. దీంతో శుక్రవారం ప్రభుత్వ రంగ బ్యాంకులు మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలిగింది. ఉద్యోగులు, అధికారులు సమ్మెలో పాల్గొనడంతో దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకుల శాఖలపై తీవ్ర ప్రభావం పడింది. చాలా ప్రభుత్వ రంగ బ్యాంకులు (బిఎస్‌బిలు), కొన్ని పాత తరం ప్రైవేట్ రంగ బ్యాంకుల శాఖలలో నగదు డిపాజిట్లు, ఉపసంహరణలు, చెక్కుల క్లియరెన్స్, పరిపాలనాపరమైన పనుల వంటి సేవలకు అంతరాయం కలిగింది. అయితే, యుపిఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌తో సహా డిజిటల్ బ్యాంకింగ్ సేవలు మాత్రం యథావిధిగా కొనసాగాయి. 'ఎటువంటి సానుకూల ఫలితం రాకపోవడం, ప్రభుత్వం మా డిమాండ్‌కు అంగీకరించకపోవడంతో, ఈ సమ్మె అనివార్యమైంది. తమ పట్ల మాత్రమే వివక్ష చూపుతున్నారని బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు' అని అని యుఎఫ్‌బియులో భాగమైన 'ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్' (ఎఐబిఇఎ) ప్రధాన కార్యదర్శి సి.హెచ్. వెంకటాచలం పిటిఐతో అన్నారు. సమ్మె కారణంగా చాలా ప్రభుత్వ రంగ బ్యాంకులు కార్యకలాపాలపై పడే ప్రభావం గురించి తమ వినియోగదారులకు సమాచారం అందించాయి. 'సమ్మె రోజుల్లో కూడా శాఖలు, కార్యాలయాలు సాధారణంగా పనిచేసేలా బ్యాంక్ అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ, సమ్మె కారణంగా బ్యాంకుల పనితీరుపై ప్రభావం పడే అవకాశం ఉంది' అని వినియోగదారులకు జారీ చేసిన ఒక ప్రకటనలో ఎస్‌బిఐ పేర్కొంది. అన్ని శనివారాలను సెలవు దినాలుగా ప్రకటించాలని యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. మార్చి 2024లో 'ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్' (ఐబిఎ)తో కుదిరిన 12వ ద్వైపాక్షిక ఒప్పందంలో ఈ అంశంపై అంగీకారం కుదిరినప్పటికీ, దీనికి సంబంధించిన ప్రభుత్వ నోటిఫికేషన్ ఇంకా వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం, నెలలో మొదటి, మూడవ, ఐదవ శనివారాల్లో బ్యాంకులు తెరిచి ఉంటున్నాయి. పెన్షన్ పెంపు, సవరణ, పెన్షనర్లందరికీ ఒకే రకమైన కరువు భత్యం (డిఎ) విధానం, అలాగే 'నేషనల్ పెన్షన్ సిస్టమ్' (ఎన్‌పిఎస్) పరిధిలోని ఉద్యోగులకు 'ఓల్డ్ పెన్షన్ స్కీమ్' (ఒపిఎస్)కు మారే అవకాశం కల్పించడం వంటి ఇతర డిమాండ్లు కూడా ఇంకా పరిష్కారం కాలేదు.

పార్లమెంట్ ప్రొరోగ్ జాప్యంలో

# మోదీ సర్కార్ సరికొత్త రికార్డు

మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించేందుకు కుట్ర పన్నుతున్న అమిత్ షా : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** పార్లమెంట్‌ను ప్రొరోగ్ చేయడంలో జాప్యంపై మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ విమర్శలు సంధించింది. ఈ విషయంపై కొత్త రికార్డులను నెలకొల్పిందని ఎద్దేవా చేసింది. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో ఆమోదింపజేసుకోవడానికి, హోం మంత్రి అమిత్ షా ఇప్పుడు అత్యంత కలుషితమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించింది. నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలపై సాధ్యమైనంత విస్తృత ఏకాభిప్రాయం సాధించేందుకు, అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి మోదీ ప్రభుత్వం ఎందుకు నిరాకరిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. నేడు మోదీ ప్రభుత్వం 2015లో తాను నెలకొల్పిన రికార్డును అధిగమించి ఒక కొత్త రికార్డును నెలకొల్పిందని, పార్లమెంటును నిరవధికంగా వాయిదా వేయడానికి, దానిని తిరిగి పొడిగించడానికి మధ్య వ్యవధి 29 రోజులకు చేరుకుందని, 2015 వర్షాకాల సమావేశాలకు ఈ వ్యవధి 28 రోజులుగా ఉండేది అని రమేశ్ శుక్రవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 2026 వర్షాకాల సమావేశాలను పొడిగించేందుకు స్పష్టమైన సూచనలు లేకపోవడంతో, ఆ సమావేశాల వ్యవధి రోజురోజుకూ పెరుగుతోందని, సాధారణంగా ఈ వ్యవధి కేవలం మూడునాలుగు రోజులు మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు. 'లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేసుకోవడానికి, అత్యంత వివాదాస్పదమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించేందుకు షా కుట్ర పన్నుతున్నారు. ఏప్రిల్ 17, 2026న ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన మూడు పార్టీలలో ఆయన ఇప్పటికే చీలిక సృష్టించారు. బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన ఇతరులను తమ వైఖరిని మార్చుకునేలా చేయడానికి బెదిరింపులు, భయపెట్టడం, ప్రలోభాలు ఉపయోగిస్తున్నారు' అని కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు. కేంద్ర హోం మంత్రి వద్ద తగినంత సంఖ్యాబలం లేదు, కానీ ఆయన అహంకారం, కపటత్వం, ఆర్భాటం రాబోయే ప్రమాదాన్ని గ్రహించనివ్వవని రమేశ్ అన్నారు. 'వర్షాకాల సమావేశాలను వాయిదా వేయకపోవడం ద్వారా, ఈ స్వయం ప్రకటిత చాణక్యుడు తాను మైండ్ గేమ్స్ ఆడుతున్నానని, సైకలాజికల్ ఆపరేషన్స్‌కు పాల్పడుతున్నానని అనుకోవచ్చు. కానీ ఇది చాలా తెలివి తక్కువతనం. ఎందుకంటే ప్రభుత్వం ఏ ప్రయోజనం కోసమైనా, ఎప్పుడైనా సమావేశాలను ఏర్పాటు చేయగలదు' అని రమేశ్ విమర్శించారు. ప్రతిపక్షాలు ఆందోళనకు గురవుతాయని భావించి షా కేవలం ఉత్కంఠను కొనసాగిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అన్నారు. హోం మంత్రి భ్రమల్లోనే కొనసాగవచ్చు అని కూడా ఆయన వ్యాఖ్యానించారు.

## ఫైసలాబాద్ విమానాశ్రయంలో 90మందికిపైగా సిక్కుల నిలిపివేత



**లాహోర్:** భారత్‌లోని ఉత్తరాఖండ్‌లో శ్రీ హేమ్‌కుండ్ దర్శనం కోసం బయలుదేరిన 90 మందికిపైగా సిక్కులను ఫైసలాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు నిలిపివేశారు. వారు స్థానిక ఫెడరల్ ప్రభుత్వం నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఒసి) తీసుకోలేదని, అదే విధంగా తిరిగి వచ్చే టికెట్ కూడా వారి వద్ద లేదని అధికారులు తెలిపారు. అందుకే, నిబంధనలను అనుసరించి వారిని విమానాశ్రయంలోనే నిలిపివేయాల్సి వచ్చిందని వివరించారు. కాగా, భారత్‌కు పాకిస్తాన్ నుంచి నేరుగా ఎలాంటి విమాన సర్వీసులు లేకపోవడంతో, వీరంతా గల్ఫ్ మీదుగా భారత్‌కు వచ్చేందుకు ప్రయాణమయ్యారు. కానీ, ఎన్‌ఒసి, తిరుగు టికెట్ లేకపోవడంతో వారి ప్రయాణానికి ఆటంకం ఏర్పడింది.

## హెచ్-1బి ఉద్యోగులకు
# 60 రోజుల గడువు తొలగించే ప్రతిపాదన

**వాషింగ్టన్:** అమెరికా ప్రభుత్వం హెచ్1బి సహా కొన్ని నాన్‌ఇమిగ్రెంట్ వీసాలపై ఉన్న విదేశీ ఉద్యోగులకు కీలకమైన 60 రోజుల 'గ్రేస్ పీరియడ్'ను తొలగించే కొత్త నిబంధనను ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే, ఉద్యోగం కోల్పోయిన హెచ్1బి ఉద్యోగులు కొత్త ఉద్యోగం వెతుక్కోవడానికి ప్రస్తుతం ఉన్న గరిష్ఠంగా 60 రోజుల సమయం కోల్పోతారు. దీనివల్ల అమెరికాలో పనిచేస్తున్న వేలాది మంది భారతీయ టెక్నాలజీ నిపుణులపై ప్రభావం పడే అవకాశం ఉంది. హెచ్1బి వీసా ద్వారా అమెరికా సంస్థలు సాంకేతిక లేదా ప్రత్యేక నైపుణ్యం అవసరమైన ఉద్యోగాల్లో విదేశీ నిపుణులను నియమించుకుంటాయి. ముఖ్యంగా భారతదేశం, చైనా నుంచి టెక్నాలజీ రంగానికి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఈ వీసాపై అమెరికాకు వెళ్తారు. ప్రస్తుత నిబంధన ప్రకారం ఉద్యోగం స్వచ్ఛందంగా లేదా అనివార్యంగా ముగిసినా, అర్హత ఉన్న ఉద్యోగులకు 60 రోజుల వరకు అమెరికాలో ఉండి కొత్త ఉద్యోగం వెతుక్కునే అవకాశం ఉంటుంది. 2016లో ఈ నిబంధనను ప్రవేశపెట్టినప్పుడు ఉద్యోగ మార్పును సులభతరం చేయడం, నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగులకు కొంత స్థిరత్వం కల్పించడం ప్రధాన ఉద్దేశ్యాలు. కాగా, ఇప్పుడు ప్రతిపాదించిన నిబంధనను అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ ప్రజాభిప్రాయానికి విడుదల చేయనుంది. ప్రజలు 60 రోజుల్లో తమ అభిప్రాయాలను సమర్పించవచ్చు. తుది నిబంధనగా ఇది అమల్లోకి వస్తే ఉద్యోగం కోల్పోయిన విదేశీ ఉద్యోగులు వెంటనే అమెరికా విడిచి వెళ్లాల్సి రావచ్చు. మరో అమెరికా సంస్థ ఉద్యోగ అవకాశం ఇచ్చిన తర్వాత వారు అమెరికా రాయబార కార్యాలయం లేదా కాన్సులేట్ ద్వారా తిరిగి వీసా ప్రక్రియను పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో కొంతమందికి అమెరికా ప్రభుత్వం తొలగింపు ప్రక్రియకు తొలి దశ అయిన 'నోటీస్ టు అపియర్' (ఎన్‌టిఎ) జారీ చేసే అవకాశం కూడా ఉందని ఇమిగ్రేషన్ నిపుణులు చెబుతున్నారు. 2025లో ఉద్యోగం కోల్పోయిన లేదా స్వచ్ఛందంగా ఉద్యోగం మార్చిన ప్రధాన లబ్ధిదారుల సంఖ్య సుమారు 65,752గా డిహెచ్‌ఎస్ అంచనా వేసింది. 2021–2025 మధ్య ఇలాంటి 3.28 లక్షలకు పైగా ఉద్యోగుల్లో సుమారు 5.77 శాతానికి మాత్రమే కొత్త యజమాని ద్వారా కొత్త వర్కర్ పిటిషన్ దాఖలైంది. అమెరికా ప్రతి ఏడాది 65,000 సాధారణ హెచ్1బి వీసాలతో పాటు అమెరికా ఉన్నత విద్యాసంస్థల నుంచి అడ్వాన్స్‌డ్ డిగ్రీలు పొందిన వారికి మరో 20,000 వీసాలను కేటాయిస్తుంది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే అమెరికాలో ఉద్యోగ భద్రత, ఉద్యోగ మార్పు విషయంలో భారతీయ నిపుణులకు అనిశ్చితి మరింత పెరగవచ్చు.




## బంగ్లాదేశ్‌లో 63 మంది విదేశీయులు అరెస్టు



**ఢాకా:** ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై 63 మంది విదేశీయులను బంగ్లాదేశ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో లావోస్, పాకిస్తాన్, చైనా దేశాలకు చెందిన వారు ఉన్నారు. చత్తోగ్రామ్ నగరంలో వీరిని అదుపులోకి తీసుకున్నట్టు అధికారులు ప్రకటించారు. తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు చత్తోగ్రామ్ నగరంలో తనిఖీలు నిర్వహించిన ర్యాపిడ్ యాక్షన్ బటాలియన్ (ఆర్‌ఎబి) అధికారులు 35 మంది లావోస్ దేశానికి చెందిన వారినితోపాటు 21 మంది పాకిస్తానీయులను, ఐదుగురు చైనీయులను అరెస్టు చేశారని వివరించారు. అదే విధంగా నేపాల్, వియత్నాం నుంచి ఒక్కొక్కరు చొప్పున అరెస్టయ్యారని తెలిపారు. వీరిలో 41 మంది పురుషులుకాగా, 21 మంది మహిళలు. ఒక చిన్నారి కూడా ఉన్నట్టు అధికారులు తమ ప్రకటనలో పేర్కొన్నారు.

## కేంద్రం లాక్కుంటోంది
**(మొదటి పేజీ తరువాయి)**

దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో ఇంగ్లీష్ మీడియం చదువును తప్పనిసరి చేయాలని, పేదలకు చదువు గుమ్మం ముందుకు వెళ్లేలా చూడాలని కోరారు. ఇంటర్మీడియట్‌ను ఎత్తివేయకుండా గ్రామీణ స్కూళ్లలోనే సిబిఎస్‌ఈ సిలబస్ తెస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపుల విషయానికొస్తే కొఠారి కమిషన్ 16 శాతం, మురళీ కమిటీ 18 శాతం ప్రతిపాదించగా, గతంలో 9 శాతంగా ఉన్న కేటాయింపులు 5.5 శాతానికి తగ్గాయని, ఈ ఏడాది బడ్జెట్‌లో అది 8.2 శాతానికి పెరిగినప్పటికీ, మరింత పెంచాలని సాంబశివరావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాగా క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారని, అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులను ప్రోత్సహించాలని కోరారు. యూనివర్సిటీల పరిస్థితి హృదయవిదారకంగా ఉందని, అవుట్‌సోర్సింగ్ విధానంపై ఆధారపడటం సరైంది కాదన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకు గాను కేవలం 25 జిల్లాల్లోనే డిఈఓలు ఉన్నారని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు పాఠశాలల్లో టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం పెద్ద పెద్ద స్కీమ్‌లు, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపుల్లో ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమేనని, అయితే సిఎస్‌ఆర్ నిధులను పరిశ్రమల సామాజిక బాధ్యతగా విద్యా రంగానికి ఉపయోగిస్తుంటే, విషయం తెలియని వారు ప్రైవేట్ వారికి కట్టబెడుతున్నారని ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కొత్త కోర్సులు ప్రవేశపెట్టినప్పుడు స్పష్టత ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వినూత్న పథకాలను స్వాగతించారు. ప్రీప్రైమరీ నుంచే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు స్థాపించడం గొప్ప విషయమని, సిబిఎస్‌ఈ సిలబస్‌తో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను తీసుకురావడం మంచి పరిణామమని అన్నారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటు సిఎం ఆలోచనా విధానానికి నిదర్శనమన్నారు. క్రీడల అభివృద్ధికి తమ ప్రాంతంలో కేటాయించిన 500 ఎకరాల్లో 60 ఎకరాలను అంతర్జాతీయ స్థాయి స్టేడియాల ఏర్పాటుకు కేటాయించాలని, గుజరాత్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం కంటే మించిన స్టేడియం తెలంగాణలో ఉండాలని సాంబశివరావు ఆకాంక్షించారు.

**విద్యా రంగ అభివృద్ధిలో 'సిఎం రేవంత్ రెడ్డి ది బెస్ట్'**
దేశంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే విద్యా రంగ అభివృద్ధిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ది బెస్ట్' అని కూనంనేని సాంబశివరావు అభినందించారు. విద్యారంగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, సిఎం రేవంత్ రెడ్డి చూపిస్తున్న ప్రత్యేక చొరవపైనే ప్రధానంగా చర్చ కొనసాగుతోందని సిఎంను అభినందించారు. చాలా మంది ముఖ్యమంత్రుల కంటే ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషల్లో ఆయన ఎంతో సమర్థవంతంగా మాట్లాడగలరని ప్రశంసించారు. రేవంత్ రెడ్డి చిన్నప్పటి నుంచే నేర్చుకోవాలనే తపన, ఇంగ్లీష్‌పై ఉన్న పట్టు వల్లే పార్లమెంట్‌లోనూ ఏ విషయమైనా ధైర్యంగా మాట్లాడగలిగారని గుర్తుచేశారు. అదే పట్టుదలతో రాష్ట్రంలో విద్యా రంగాన్ని అభివృద్ధి చేయాలనే తపనతోనే విద్యా శాఖను తన వద్దే ఉంచుకున్నారని సాంబశివరావు అభిప్రాయపడ్డారు. 24 గంటలు రివ్యూ మీటింగ్‌లకే పరిమితం కాకుండా సమాజానికి ఏదో ఒకటి చేయాలనే తపన సిఎంలో కనిపిస్తోందని తెలిపారు.

## ప్రైవేటీకరణ ప్రశ్నే లేదు
**(మొదటి పేజీ తరువాయి)**

సిఎం ప్రశ్నించారు. ప్రభుత్వం కొన్నిసార్లు కొన్ని నిర్ణయాలు చేసినప్పుడు కొన్ని వివాదాలు జరుగుతాయని, అలాంటిదే పాలిటెక్నిక్ కాలేజీలకు సంబంధించిన జీఓ ఎంఎస్ నెం.97 అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కాలేజీలో చదువుకున్న హరీష్‌రావు ఇపుడు ఆ వ్యవస్థనే ముందుకు వెళ్ళకుండా కుట్ర చేస్తున్నారని సిఎం ఆరోపించారు. కడుపులో కుల్లు, పేద పిల్లలపై ద్వేషంతో ఆ కుటుంబం కుట్ర చేస్తోందని సిఎం విమర్శించారు. పేద పిల్లలకు మేం అన్యాయం జరగనివ్వబోమని, వారి భవిష్యత్ బాగుండాలనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు రాజకీయ ప్రయోజనం కోసం చేసే ఇలాంటి చర్యలను అడ్డుకోవాలన్నారు. శాసనసభలో శుక్రవారం ''విద్యా శాఖ కార్యక్రమాలు''అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చకు సిఎం రేవంత్ రెడ్డి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ 32 నెలల్లో రూ.3488 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను చెల్లించామని వెల్లడించారు. గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.5430 కోట్లు బకాయిలను పెట్టి పోయిందని, ఆ బకాయిల్లో రూ,1410 కోట్లను చెల్లించామని వివరించారు. సాంకేతిక విద్యను పరిశ్రమల అవసరాలకు అనుసంధానించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి, పరిశ్రమల భాగస్వామ్యంతో ఆధునిక ల్యాబొరేటరీలు, పరికరాలు, శిక్షణా సదుపాయాలను అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిషిప్‌లు, ప్రాక్టికల్ ట్రైనింగ్ అవకాశాలను పెంచాలని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎఐ, రోబోటిక్స్, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి కొత్త రంగాలకు అనుగుణంగా కోర్సులను ఆధునీకరిస్తామన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలానే కాంగ్రెస్ ప్రభుత్వ తపన అన్నారు. సాంకేతిక విద్యనైపుణ్యాభివృద్ధి విభాగం అనుసంధానంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉన్న మౌలిక వసతులు, ల్యాబ్‌లు, అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధిని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఎఐసిటిఈ అప్రూవల్ లేదని అంటున్నారని, స్కిల్స్ యూనివర్సిటీకే ఆ అప్రూవల్ తీసుకొస్తామన్నారు. భూములు అమ్ముకుంటారని, ఉద్యోగాలు పోతాయని ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రభుత్వమే అదనంగా 282 ఎకరాల రెవెన్యూ భూమిని ఏటీసీలకు బదలాయించింది. ఒక్కో ఏటీసీ పై రూ.46 కోట్లు ఖర్చు చేశామన్నారు.

**విద్యా రంగానికి 15 శాతం నిధులు పెంచడం లక్ష్యం**
రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 15 శాతం నిధులు పెంచడంతో పాటు విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకు వచ్చే లక్ష్యతో చర్యలు చేపట్టామని తెలిపారు. '' అన్నా – అక్కా'' పేరుతో సీనియర్లతో జూనియర్లకు పాఠలు చెప్పించడం ద్వారా వారిలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తాను విద్యా శాఖ మంత్రిగా బాధ్యత తీసుకున్న తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 86 వేల మందికి పెరిగిందని, విద్యా శాఖ మంత్రిగా తన పని తీరుకు ఇదే నిదర్శనమన్నారు. 202324 బడ్జెట్‌లో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యా శాఖకు రూ.19,093 కోట్లను కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 202425 బడ్జెట్ లో రూ.21,292 కోట్లను కేటాయించిందని, 2025–26 బడ్జెట్‌లో ఆ మొత్తాన్ని రూ.23,108 కోట్లకు, 202627 బడ్జెట్ లో రూ.26,647 కోట్లకు పెంచామని, కేవలం మూడేళ్లలో విద్యా శాఖ బడ్జెట్‌ను రూ.7,554 కోట్లకు పెంచామని సిఎం వివరించారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో కేవలం 7857 మంది టీచర్లను నియమిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది 55 రోజుల్లోనే 10,006 మంది టీచర్ల ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తు చేశారు. జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యా విధానాన్ని తీసుకొస్తున్నామని తెలిపారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉన్నదని, తలరాతలు మార్చేది విద్యా మాత్రమేనని, అందుకే విద్యాశాఖను తన వద్ద పెట్టుకున్నానని వివరించారు. ప్రైవేటు విద్యా వ్యవస్థలో రెండున్నరేళ్లకే పాఠశాలకు పంపిస్తున్నారని, ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఐదేళ్లకు పాఠశాలకు పంపిస్తున్నారని, అందుకే తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు చూస్తున్నారని వివరించారు. నర్సరీ, ఎల్‌కెజి విధానంతో పాటు ఇంగ్లీష్ భాష కోసం తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు చూస్తున్నారని అన్నారు. ఈ ఏడాది 64 వేల మందికి ప్రీప్రైమరీ విద్యను అందిస్తున్నామని, నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని సిఎం వివరించారు. దేశంలోని ఏ విద్యా సంస్థనైనా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వేసిన పునాదులపైనే నిర్మితమైందని, ప్రస్తుత చాలా యూనివర్సిటీలు ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఏర్పడ్డాయని సిఎం గుర్తు చేశారు. ప్రపంచంతో పోటీ పడాలంటే విద్యావిధానంలో తీసుకురావాల్సిన మార్పులపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.

## సబ్సిడీపై యంత్రాలివ్వాలి
**(మొదటి పేజీ తరువాయి)**

రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మార్కెట్‌లో లభించే యంత్ర పరికరాల ధరకు, ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించే పరికరాల ధరకు భారీ వ్యత్యాసం ఉంటోందని, అధిక ధరలకు నాసిరకం యంత్రపరికరాలను సరఫరా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయని తెలిపారు. ఉదాహరణకు మార్కెట్‌లో ఒక రోటివేటర్ రూ.1.10 లక్షలకు లభిస్తుంటే, ప్రభుత్వం దానిని రూ.1.50 లక్షలు చెల్లించి ఏజెన్సీల నుంచి కొనుగోలు చేస్తుందని, ఈ మొత్తంలో రైతు రూ.85 వేలు చెల్లిస్తుంటే, మిగతాది ప్రభుత్వం చెల్లిస్తున్నదని వివరించారు. అంటే మార్కెట్‌లో లభించే ధర కంటే అత్యధిక ధరలు నిర్ణయించి ప్రభుత్వంతో పాటు రైతులను ఏజెన్సీలు నష్టపరుస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో ఏజెన్సీల జోక్యాన్ని పూర్తిగా తొలగించి, సబ్సిడీ ప్రయోజనాలు నేరుగా రైతులకే అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రైతులు తమకు అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాలను నేరుగా కొనుగోలు చేసిన సందర్భంలోనూ ఏజెన్సీల ప్రమేయం లేకుండా సబ్సిడీని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. నల్లగొండ జిల్లాలో పత్తి రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కాటన్ షెల్టర్ యంత్రాలను అందించాలని ప్రభుత్వానికి నెల్లికంటి సత్యం విజ్ఞప్తి చేశారు.

**రైతుకు నచ్చిన కంపెనీ నుంచే వ్యవసాయ పరికరాలు: మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు**
రైతులు తమకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునేలా యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరారావు తెలిపారు. శాసనమండలిలో శుక్రవారం సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. యాంత్రీకరణ పథకంలో చిన్న, సన్నకారు, ఎస్‌సి, ఎస్‌టి, మహిళా రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని, దళారులకు అవకాశం లేకుండా పారదర్శక విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో యాంత్రీకరణకు రూ.147.91 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రైతులకు సరఫరా చేసే యంత్ర పరికరాలను గుర్తింపు పొందిన సంస్థల వద్ద పరీక్షించిన తర్వాతే అందిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఎంప్యానెల్‌మెంట్‌లో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లతో పాటు ఆదర్శ రైతులు, ఎఫ్‌బిఓ ప్రతినిధులకు కూడా భాగస్వామ్యం కల్పించామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం 444 కంపెనీలు ఎంప్యానెల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. రైతుల డిమాండ్‌కు అనుగుణంగా డ్రోన్‌లు సహా ఆధునిక వ్యవసాయ యంత్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తుమ్మల చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3.50 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతుండగా, వచ్చే మూడేళ్లలో మరో 6 లక్షల ఎకరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు అవసరమైన ఆధునిక యంత్రాలను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.

## మీటర్లు పెట్టం
**(మొదటి పేజీ తరువాయి)**

మినహా నెలకు 500 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగించే వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు అమర్చాలని, 2019 డిసెంబర్ 31 నాటికి నెలకు 200 యూనిట్లకు పైగా వినియోగించే వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని ఆ ఒప్పందంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఆ ఒప్పందంపై అప్పటి విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, టిఎస్‌ఎస్‌పిడిసిఎల్ అప్పటి సిఎండి టిఎస్‌ఎన్‌పిడిసిఎల్ అప్పటి సిఎండి సంతకాలు చేశారని వివరించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉదయ్ త్రైపాక్షిక ఒప్పందంలో సంతకం చేసిన అంశాలకు మించి ప్రస్తుత ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్లడం లేదని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, రైతులు బాగుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు ఉచిత విద్యుత్ అందించే విధానాన్ని కొనసాగిస్తామని, అగ్రికల్చర్ పంపుసెట్లకు మీటర్లు పెట్టే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు.
ఆర్‌డిఎస్‌ఎస్ పథకంలో వ్యవసాయ పంపుసెట్లకు తప్పనిసరిగా మీటర్లు ఏర్పాటు చేయాలనే నిబంధన ఎక్కడా లేదని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను ఆధునీకరించడంతోపాటు సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఈ పనుల కోసం కేంద్ర ప్రభుత్వం ఆర్‌డిఎస్‌ఎస్ ద్వారా 60 శాతం గ్రాంట్ అందిస్తోందని, మిగిలిన 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఆర్‌డిఎస్‌ఎస్ కింద చేపడుతున్న పనులు వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టడం కోసం కాదని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, నెట్వర్క్ విస్తరణ, ట్రాన్స్‌ఫార్మర్ల అప్‌గ్రేడేషన్, ఎస్‌సిఎడిఎ, ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు, సెక్షనలైజర్లు, ఆటో రీక్లోజర్లు వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను ఏర్పాటు చేయడమే లక్ష్యమన్నారు. వ్యవసాయ పంపుసెట్లను సోలరైజేషన్ చేయడం ద్వారా విద్యుత్ వ్యయాన్ని తగ్గించడంతో పాటు రైతులకు మరింత మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. భవిష్యత్తులో బ్యాటరీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చి పగలు, రాత్రి రెండూ సోలార్ విద్యుత్‌ను వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో సరఫరా చేస్తున్న విద్యుత్‌లో థర్మల్ పవర్ ప్రాజెక్టుల వాటా గణనీయంగా ఉందని పేర్కొన్నా రు.

**29 లక్షల పంపుసెట్లకు రూ.14 వేల కోట్లు**
రాష్ట్రంలో ఉన్న 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి ఏటా రూ.14 వేల కోట్లను రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి ఇంధన శాఖకు చెల్లిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రైతులు చెల్లించాల్సిన విద్యుత్ బిల్లును ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందన్నారు. ఈ వ్యయాన్ని ఆదా చేసి, ఆ మొత్తాన్ని తిరిగి రైతుల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం వినియోగించగలిగితే రైతుల ఆదాయం పెంచేందుకు మరిన్ని అవకాశాలు ఉంటాయని చెప్పారు. అందుకే సోలరైజేషన్‌కు ముందుకొచ్చే రైతుల వ్యవసాయ పంపుసెట్లను రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతోనే సోలరైజ్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవలం సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయడం మాత్రమే కాకుండా నాలుగు పిల్లర్లు వేసి కొట్టం లేదా విశ్రాంతి ప్రదేశంగా ఉపయోగించుకునేలా అరుగును కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అక్కడ పశువులు, మేకలను కట్టుకోవడంతో పాటు మధ్యాహ్నం సమయంలో రైతులు విశ్రాంతి తీసుకునేలా దీనిని రూపొందిస్తున్నామని వివరించారు.

**రైతులకు ఇబ్బంది లేకుండా పైలట్ ప్రాజెక్ట్**
ప్రస్తుతం ఈ విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. దీనికి అయ్యే ప్రతి పైసాను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందన్నారు. పైలట్ ప్రాజెక్టు విజయవంతమై రైతులు సంతృప్తి చెందడంతో పాటు ప్రభుత్వ ఖజానాపై విద్యుత్ వ్యయం తగ్గితే మంచిదేనని చెప్పారు. ఒక వేళ రైతులు సోలరైజేషన్ వద్దని చెబితే వారికి ప్రస్తుతం ఉన్న ఉచిత విద్యుత్ సదుపాయం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సోలార్ పంపుసెట్లతో పాటు భవిష్యత్తులో బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థను కూడా అందుబాటులోకి తీసుకొస్తామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా బ్యాటరీ స్టోరేజ్ సాంకేతికతపై వేగంగా ప్రయోగాలు జరుగుతున్నాయని చెప్పారు. తాను కూడా ఆ వ్యవస్థలను పరిశీలించి వచ్చానన్నారు. భవిష్యత్తులో బ్యాటరీ వ్యవస్థ అందుబాటులోకి వస్తే ఉదయం నుంచి లభించే సోలార్ విద్యుత్‌ను నిల్వ చేసుకుని పగలు, రాత్రి రెండింటికీ వినియోగించుకోవచ్చని వివరించారు.

## బిసి/ఒబిసిని చేర్చాలి (మొదటి పేజీ తరువాయి)

బిసిల వాస్తవ పరిస్థితిని గుర్తించేందుకు ప్రయత్నించామని, ఈ సర్వే ఆధారంగా బిసిలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన చర్యలు చేపట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్వహించిన జనగణనలో ఒబిసిల స్పష్టమైన ప్రత్యేక గుర్తింపు ఇవ్వకుండా ఓపెన్ కాలమ్ విధానాన్ని చేర్చడం ద్వారా కచ్చితమైన ఒబిసి గణాంకాలు సేకరించడం కష్టమన్నారు.

**తీర్మానం పంపిస్తే సరిపోదు..బిజెపి పాయల శంకర్:** బిజెపి సభ్యులు పాయల శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తే సరిపోద ని, ముందుగా ఇచ్చిన హామీలను, రాష్ట్ర పరిధిలోని అంశాలను అమలు చేయాలన్నారు.
ఎంఐఎం మొహ్మద్ మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ జాతీయ కులగణనలో ఒబిసిల కాలమ్‌ను కూడా చేర్చాలన్నారు. ఒబిసిలలోని ఎ, బి, సి, డి, ఇ కులాలను చేర్చాలని కోరారు.

**ఒబిసి కాలం పెట్టాలి..రాష్ట్రాల వారీగా ఒబిసిల లెక్కలు తీయాలి...**
**కూనంనేని సాంబశివరావు :** జాతీయ కులగణనలో ఒబిసి కాలమ్ పెట్టాలని, ఆయా రాష్ట్రాల వారీగా ఒబిసిల లెక్కలను సేకరించడం ద్వారా దేశ వ్యాప్తంగా సమగ్రమైన ఒబిసి లెక్కలపైన స్పష్టత వస్తుందని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు సూచించారు. ఒబిసి రిజర్వేషన్ల పెంపు విషయంలో సాంకేతిక కారణాలను అడ్డంకిగా చూపిస్తే, ప్రజలు ఆగబోరని, ఇప్పటికే అస్తిత్వ పోరాటాలు జరుగుతున్నాయని, రిజర్వేషన్ల విషయంలో ప్రజలు ప్రధాని లేదా ఇంకెవరినైనా తొక్కేస్తారని చెప్పారు. 50 శాతం రిజర్వేషన్లు సీలింగ్ ఉన్నదని చెబుతూనే మరోవైపు పది శాతం ఇబిసి రిజర్వేషన్లు కలిపి మొత్తం 60 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నారని, ఇప్పటికైనా జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాల్సిందేనని స్పష్టం చేశారు. ఒక రాష్ట్రంలో ఒక కులం బిసి జాబితాలో ఉంటే, మరో రాష్ట్రంలో అదే కులం ఒసి జాబితాలో ఉన్నదని, అందుకే రాష్ట్రాల వారీగా ఒబిసిల జాబితాను సేకరించాల్సిన అవసరం ఉన్నదన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ బిసిల సర్వే చేపట్టడం ద్వారా తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు మోడల్‌గా మారిందన్నారు. కుల గణనలో ఒబిసిల చేర్చే తీర్మానానికి బిజెపి మద్దతు ఇవ్వకుండా సభ నుంచి వాకౌట్ చేయడం ఆ పార్టీ భావజాలం మరోసారి స్పష్టమైందని మండిపడ్డారు. కులగణనలో మొదటి దశలో ఇండ్లను గుర్తించారని, రెండవ దశలో 40 ప్రశ్నలలో 10వ కాలంలో కేవలం కులం పేరుతో ఓపెన్ ఫార్మెట్‌ను పెట్టారని, తద్వారా ఒబిసిలు ఎవరు అనే అంశంపై స్పష్టత రాదని కూనంనేని అన్నారు.

**12 ఏళ్లుగా బిజెపి ప్రభుత్వం ఏం చేసింది:** గత ప్రభుత్వాల తప్పిదాలను చూపిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 12 ఏళ్లుగా అధికారంలో ఉండి ఏం చేసిందని కూనంనేని సాంబశివరావు నిలదీశారు. మోదీ ఒక బిసి నాయకుడు అని ఆయనను ప్రధాని చేయలేదని, ఆయన ఆర్‌ఎస్‌ఎస్‌లో అగ్రనాయకుడని, అందుకే ఆయనను ప్రధానిగా చేశారని ఆయన స్పష్టం చేశారు.

## ఏ చొరవకైనా భారత్ సిద్ధం
**(మొదటి పేజీ తరువాయి)**

భారతదేశం సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు. అత్యంత కీలకమైన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు పుతిన్ మూడు రోజుల పర్యటన నిమిత్తం న్యూఢిల్లీలో అడుగుపెట్టిన కొన్ని గంటల తర్వాత వీరిద్దరి సమావేశం జరిగింది. చర్చల అనంతరం ఇద్దరు నాయకులు బిజినెస్ ఫోరం జరిగే భరత్ మండపం వేదిక వద్దకు చేరుకోవడానికి ఒకే కారులో ప్రయాణించారు. వివిధ రంగాలలో మరింత లోతైన సంబంధాలను కొనసాగించాలనే తమ దృఢ సంకల్పాన్ని సూచిస్తూ, భారత్–రష్యా ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ప్రయత్నంలో నిమగ్నమై ఉండటానికి ఇరువురు నాయకులు అంగీకరించారని, ఈ భాగస్వామ్యం భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తూ, స్థితిస్థాపకతను కలిగి ఉందని ఇండియా విడుద ల చేసిన ఒక ప్రకటన వెల్లడించింది. భారత్–రష్యా వాణిజ్య పెట్టుబడి సంబంధాలను సమీక్షిస్తున్నప్పుడు, ప్రస్తుత 65బిలియన్ డాలర్ల నుండి 2030 నాటికి వార్షి ద్వైపాక్షిక వాణిజ్య పరిమాణాన్ని 100 బిలియన్ డాలర్లకు పెంచాలనే లక్ష్యాన్ని చేరుకోవాలని ఇరుపక్షాలు తీర్మానించాయి. ఇరు దేశాల మధ్య జరిగే వార్షిక చర్చల కోసం రష్యా పర్యటనకు వెళ్లాలన్న పుతిన్ ఆహ్వానాన్ని ప్రధాని మోదీ అంగీకరించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఏ) ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య 45నిమిషాలకు పైగా జరిగిన చర్చల్లో రక్షణ, కీలక ఖనిజాలు, పౌర అణుశక్తి, ఇంధన సరఫరాలు, ప్రజల మధ్య ఇచ్చిపుచ్చుకోవడాలకు సంబంధించిన రంగాలలో సహకారానికి మోదీ, పుతిన్‌లు అంగీకరించారు. పశ్చిమాసియా, సముద్ర ప్రాంతంలో సముద్ర వాణిజ్యం, భారతీయ నావికుల భద్రతపై ప్రభావం చూపిన సంఘర్షణలతో సహా, పరస్పర ఆసక్తి ఉన్న కీలక ప్రాంతీయ సమస్యలపై ఇద్దరు నాయకులు తమ దృక్పథాన్ని పంచుకున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సంఘర్షణల పరిష్కారానికి చర్చలు, దౌత్యమే సరైన మార్గమని, శాంతి ప్రయత్నాలకు భారతదేశం సహకరించేందుకు సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి మోదీ మరోసారి పునరుద్ఘాటించారని అది పేర్కొంది.గత వారం బిష్కెక్‌లో జరిగిన ఎస్‌సిఓ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ఇద్దరు నాయకులు గతంలో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా నరేంద్రమోదీఉక్రెయిన్ సంఘర్షణకు తక్షణ ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. 'అంతులేని యుద్ధాన్ని యుద్ధం ముగింపు దిశగానడిపించాలి' అని రష్యా నాయకుడు పుతిన్‌ను ఆయన కోరారు. రాజకీయ ఆర్థిక, రక్షణ, ఇంధనం, అంతరిక్షం, నైపుణ్య చలనశీలత ప్రజలు–ప్రజల రంగాలలో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన పురోగతిని ఇరువురు నాయకులు సమీక్షించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. సెప్టెంబరు 9నుంచి భారతదేశంలో (న్యూఢిల్లీలో) తొలిసారిగా జరుగుతున్న రష్యా అంతర్జాతీయ పారిశ్రామిక ప్రదర్శన 'ఇన్నోప్రోమ్ ఇండియా'ను స్వాగతిస్తున్నామని, వాణిజ్య, పారిశ్రామిక సంబంధాలను మరింత విస్తరించడంలో దీని ప్రాముఖ్యతను నొక్కి చెబుతున్నామని ఎంఇఏ ప్రకటన వెల్లడించింది. మోదీ, పుతిన్ ఇరువురూ ఇన్నోపోమ్ ఇండియా ఎగ్జిబిషన్‌లోని భారత్ మండపాన్ని కూడా సందర్శించి, అక్కడ పాల్గొన్న వారితో ముచ్చటించారు. ఇరుపక్షాలు తాము ఇప్పటికే బలంగా ఉన్న రక్షణ సహకారాన్ని మరింత విస్తరించుకునే దిశగా కూడా దృష్టి సారించాయి.

## అందించాలి
**(మొదటి పేజీ తరువాయి)**

లేదని ఆయన ప్రభుత్వానికి సూచించారు. శాసన సభ సమావేశాల్లో శుక్రవారం కూనంనేని సాంబశివరావు ప్రత్యేక ప్రస్తావనలో (స్పెషల్ మెన్షన్) మాట్లాడారు. 'సెప్టెంబర్ 11'(శుక్రవారం) రోజు తెలంగాణ సాయధ పోరాటానికి పిలుపునిచ్చిన రోజు అని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని గుర్తించే విషయంలో ప్రభుత్వం ఎలాంటి భయాందోళనలు గానీ, బేషజాలు గానీ ప్రదర్శించాల్సిన అవసరం లేదన్నారు. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో మగ్దూం మొహియుద్దీన్ లాంటి ఎందరో ముస్లిం వీరులు ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. నిజాం పక్షాన నిలిచిన వారిలో రామచంద్రారెడ్డి వంటి హిందూ భూస్వాములు కూడా ఉన్నారన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం లభించినప్పటికీ హైదరాబాద్ సంస్థాన (తెలంగాణ ) నిజాం నవాబు ప్రభుత్వానికి లొంగిపోకపోకవడంతో 'సెప్టెంబర్ 11'న రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దుం మొయినుద్దీన్ తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన చారిత్రాత్మకమైన రోజు అని గుర్తు చేశారు. ఈ పోరాట క్రమంలో 4500 మంది తెలంగాణ యోధులు మరణించారని, ఈ పోరాటం వల్ల నిజాం నవాబు శక్తిహీనుడై, బలహీనుడై 1948 సెప్టెంబర్ 17న అప్పటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ రావడంతో ఆయన సమక్షంలో నిజాం నవాబు లొంగిపోయారని గుర్తు చేశారు. నిజాం నవాబుకు గవర్నర్ పదవి, ప్రాధాన్యత ఇవ్వడం, కమ్యూనిస్టులు పేదలకు పంపిణీ చేసిన పది లక్షల ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే ప్రక్రియ చేపట్టడం కారణంగా కమ్యూనిస్టులు తమ పోరాటాన్ని కొనసాగించారని ఆయన తెలిపారు. 1951 సంవత్సరం వరకు పోరాటం కొనసాగిందని, 1952లో ఎన్నికలు రావడంతో తెలంగాణ సాయుధ పోరాటాన్ని విరమించి, ఆ ఎన్నికల్లో కమ్యూనిస్టులు జైలులో ఉండి కూడా పోటీ చేశారని, ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ కంటే కూడా కమ్యూనిస్టు పార్టీకే అత్యధిక స్థానాలు వచ్చాయని కూనంనేని గుర్తు చేశారు. ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, మగ్ధుమొయినుద్దీన్, బి.ఎన్.రెడ్డి, సుద్దాల హనుమంతు, దేవులపల్లి వెంకటేశ్వర్ ,గద్దర్,ప్రస్తుత గోరటి వెంకన్నలాంటి కవులు, కళాకారులు ఈ ఉద్యమం నుంచే తయారయ్యారని కూనంనేని వివరించారు. తెలంగాణ ఉద్యమంలో వీరి పేర్లను ప్రాస్తవిస్తారని, కానీ ఆ పోరాటాన్నే గుర్తించడం లేదని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటం లేకపోతే ప్రస్తుత తెలంగాణ రాష్ట్రమే ఉండేది కాదన్నారు. సాయుధ పోరాటంలో చనిపోయినవారిని గుర్తించేందుకు ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు.

**ఇది హిందూ, ముస్లిం తగాదా కాదు..**
ఈ పోరాటంలో షోయబుల్లాఖాన్‌చనిపోయారని,దొడ్డికొమురయ్యతో పాటు బందగిని కూడా చంపేశారని, ఇది హిందూ, ముస్లిం తగాదాలు కాదని కూనంనేని సాంబశివ రావు స్పష్టం చేశారు. ఒక వైపు దొరలు మరోవైపు అణిచివేతకు గురైనవారు, పేదలు ఉన్నారని, ఇది ఫ్యూడల్ వ్యస్థకు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా చూడాల్సిన అవసరం ఉన్నదని కూనంనేని సూచించారు. గత ప్రభుత్వంలో సిఎం కెసిఆర్ 'సెప్టెంబర్ 17ను ' ఇంటిగ్రేటెడ్ డేగా చెప్పారని, ఇంటిగ్రేటెడ్ డే అంటే అర్థం కాలేదని, వారు ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అని పెట్టారని కూనంనేని తెలిపారు. పేరు ఏదైనప్పటికీ తెలంగాణ సాయుధ పోరాటాన్ని గుర్తించడం లేదని, ఇప్పటికే కర్నాటక, మహారాష్ట్రలో సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తున్నారని కూనంనేని సాంబశివరావు గుర్తు చేశారు.

# తిలక్ వర్మను ఏ స్థానంలో ఆడిస్తారు?

ఏబి. డివిలియర్స్

అఫ్గానిసాన్‌తో మూడు టీ20ల సిరీస్‌లో బ్యాటింగ్ లైనప్‌ను ఎంచుకోవడం టీమిండియాకు తలనొప్పేనని సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా తిలక్ వర్మను ఏ స్థానంలో ఆడిస్తారని, అతని ఎంపిక సవాల్‌గా మారుతుందని తెలిపాడు. వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్లతో కూడిన భారత బ్యాటింగ్ లైనప్‌లో తిలక్ వర్మ బ్యాటింగ్ స్థానంపై సందేహాలు నెలకొన్నాయని డివిలియర్స్ చెప్పుకొచ్చాడు.శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టు.. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో ఘోర పరాజయాలను చవిచూసింది. ఆరు మ్యాచ్‌ల్లో చిత్తయ్యింది. ఆ తర్వాత జింబాబ్వే పర్యటనలో 30తో సిరీస్‌ను గెలుచుకుంది. 13 నుంచి సొంతగడ్డపై అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్ ఆడనుంది.



ఈ సిరీస్ అనంతరం జపాన్‌తో చారిత్రాత్మక టీ20తో పాటు అక్కడే జరిగే ఆసియా గేమ్స్ 2026లో పాల్గొననుంది. టీమిండియా కాంబినేషన్ గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన డివిలియర్స్.. తిలక్ వర్మ బ్యాటింగ్ స్థానంపై సందేహం వ్యక్తం చేశాడు. 'బ్యాటర్లను ఎంపిక చేయడంలో కచ్చితంగా కొన్ని సమస్యలు ఉంటాయి. జట్టులో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీ, తిలక్ వర్మ ఉన్నారు. ఇక్కడే టీమ్ కాంబినేషన్ ఎంచుకోవడం కొంచెం కష్టం అవుతుంది. తిలక్ వర్మ ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు? ఐసిసి టీ20 ప్రపంచకప్ 2026 తర్వాత తిలక్ వర్మ 10 ఇన్నింగ్స్‌ల్లో 159.36 స్ట్రైక్రేట్‌తో 255 పరుగులు చేశాడు. అయితే అతను కేవలం మూడు సార్లు మాత్రమే 50 పరుగుల మార్కును దాటాడు. ఇది అతని బ్యాటింగ్‌లోని నిలకడలేనితనాన్ని సూచిస్తుంది. ఇది చాలా బలమైన జట్టు అనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ సరైన సమతుల్యతను సాధించడం కష్టం.

**అదే మా పతనానికి కారణం: తిలక్ వర్మ**

ఇది టీ20 మ్యాచ్ కాబట్టి, వారు జట్టులోని చిన్న మార్పులు చేసి ఆడవచ్చు. ఆటగాళ్ల పాత్రలు వేర్వేరుగా ఉన్నప్పటికీ.. అఫ్గానిస్థాన్ వంటి ప్రమాదకరమైన జట్టును ఎదుర్కోబోతున్నందుకు ప్రతీ ఆటగాడి బాధ్యతను గుర్తు చేయడం చాలా కీలకం.'అని డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు.

# కుల్దీప్ యాదవ్ రికార్డ్ బద్దలు!

టీమిండియా క్రికెటర్, తెలుగు తేజం శ్రీ చరణి చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ టీ20ల్లో అత్యంత వేగంగా 50 వికెట్ల మైలురాయి అందుకున్న తొలి భారత ప్లేయర్‌గా చరిత్రకెక్కింది. ఈ క్రమంలో కుల్దీప్ యాదవ్ పేరిట ఉన్న రికార్డ్‌ను అధిగమించింది. మహిళల ఆసియా కప్ 2026 టోర్నీలో భాగంగా గురువారం బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి సెమీఫైనల్లో శ్రీ చరణి ఒక వికెట్ తీయడం ద్వారా ఈ ఫీట్ సాధించింది. ఈ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు వేసిన ఈ కడప రెడ్డమ్మ 14 పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ తీసింది. ఇది శ్రీచరణికి 50వ వికెట్ కాగా.. 29 మ్యాచ్‌లోనే ఆమె ఈ ఫీట్ సాధించింది. తద్వారా కుల్దీప్ యాదవ్ పేరిట ఉన్న రికార్డ్‌ను అధిగమించింది. భారత పురుష, మహిళా క్రికెటర్లలో అత్యంత వేగంగా 50 వికెట్లు పడగొట్టిన ప్లేయర్గా శ్రీ చరణి రికార్కెక్కింది.

**రెండో ఇంటర్నేషనల్ ప్లేయర్‌గా..**

2023లో కుల్దీప్ యాదవ్ 30 మ్యాచ్లో 50 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. శ్రీ చరణి 29 మ్యాచ్‌లోనే ఈ ఫీట్ సాధించి అగ్రస్థానంలో నిలిచింది. వరుణ్ చక్రవర్తి(32 మ్యాచ్లు), అర్ష్‌దీప్ సింగ్(33 మ్యాచ్‌లో), రాధా యాదవ్(35 మ్యాచ్‌లో) అత్యంత వేగంగా 50 వికెట్ల ఘనతను అందుకున్న జాబితాలో కొనసాగుతున్నారు.మహిళా క్రికెట్‌లో అత్యంత వేగంగా ఈ ఫీట్ సాధించిన రెండో ప్లేయర్‌గా నిలిచింది. చైనాకు చెందిన మెంగ్టింగ్ లియు 28 మ్యాచ్‌ల్లో ఈ ఫీట్ సాధించగా.. శ్రీచరణి, లీ కాస్పరెక్, అనీసా మహమ్మద్ 29 మ్యాచ్‌లో ఈ ఘనతను అందుకొని రెండో స్థానంలో కొనసాగుతున్నారు. సోఫీ ఎక్లెస్టోన్ 34 మ్యాచ్‌లో ఈ ఘనతను అందుకుంది.

**రెండో పిన్న వయస్కురాలిగా..**

50 వికెట్ల మైలురాయి అందుకున్న రెండో భారత పిన్న వయస్కురాలిగా కూడా శ్రీచరణి రికార్డ్ సాధించింది. 22 ఏళ్ల 37 రోజుల వయసులో శ్రీచరణి ఈ ఘనతను అందుకుంది. రాధా యాదవ్ 20 ఏళ్ల 340 రోజుల వయసులో ఈ ఘనతను అందుకొని అగ్రస్థానంలో కొనసాగుతోంది. దీప్తి శర్మ(22 ఏళ్ల 187 రోజులు), రవి బిష్ణోయ్(24 ఏళ్ల 37 రోజులు), పూజ వస్త్రాకర్ (26 ఏళ్ల 200 రోజులు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా పూనమ్ యాదవ్‌తో శ్రీచరణి సమంగా నిలిచింది. ఈ ఏడాది శ్రీచరణి 35 వికెట్లు తీయగా.. పూనమ్ యాదవ్ 2018లో 35 వికెట్లు పడగొట్టింది. ఈమెను శ్రీచరణి అధిగమించే అవకాశం ఉంది.


**ఫైనల్‌కు భారత్..**

మహిళల ఆసియా కప్ 2026 టోర్నీలో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీఫైనల్1లో సమష్టిగా రాణించిన భారత్ 40 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 149 పరుగులు చేసింది. షెఫాలీ వర్మ(40 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 64) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. హర్మన్‌ప్రీత్ కౌర్(24), రిచా ఘోష్(21), ప్రతికా రావల్(20) పర్వాలేదనిపించారు.స్మృతి మంధాన(2), దీప్తి శర్మ(13), భార్తి ఫుల్మాలి(0) తీవ్రంగా నిరాశపర్చారు. బంగ్లాదేశ్ బౌలర్లలో సుల్తాన ఖాటున్ రెండు వికెట్లు తీయగా.. మరుఫా అక్తర్, నహిదా అక్తర్, రబెయా ఖాన్ తలో వికెట్ తీసారు. అనంతరం బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 109 పరుగులే చేసి ఓటమిపాలైంది. దిలారా అక్తర్(21), షోర్నా అక్తర్(22 నాటౌట్) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ(3/26), నందని శర్మ(2/10) బంగ్లాదేశ్ పతనాన్ని శాసించారు. తెలుగు తేజం శ్రీచరణి, ప్రేమ్ రావత్‌కు చెరో వికెట్ దక్కింది. హాఫ్ సెంచరీతో భారత విజయంలో కీలక పాత్ర పోషించిన షెఫాలీ వర్మకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ దక్కింది.




## సైన్స్

### సూర్యుడి వాతావరణంలో సూక్ష్మకాల కాంతి ప్రకాశాలు



శాస్త్రవేత్తలు ఇటీవల సూర్యుడి వాతావరణంలో చిన్నపాటి, కొద్ది సేపు మాత్రమే కనిపించే కాంతి ప్రకాశాలను గుర్తించారు. పెద్ద 'సౌర జ్వాల' (సోలార్ ఫ్లేర్)ఏర్పడటానికి కొన్నిగంటల ముం దే కనిపిస్తున్నాయి. అంతేకాకుండా, ఆ ప్రకాశాలు తరువాత సౌరజ్వాల ఏర్పడే ప్రాంతం చుట్టూనే కేంద్రీకృతమవుతున్నాయి. దీంతో సౌర జ్వాలలను ముందుగానే గుర్తించే కొత్త సూచనను శాస్త్రవేత్తలు కనుగొన్నట్లవుతోంది. సౌర జ్వాల అనేది సూర్యుడి ఉపరితలంపై నిల్వ ఉన్న అయస్కాంత శక్తి అకస్మాత్తుగా విడుదలైనప్పుడు సంభవించే భారీ పేలుడు. సాధారణంగా సూర్యకళంకాల (సన్‌స్పాట్స్)పైన మెలికలు తిరిగిన అయస్కాంత క్షేత్రాల్లో ఈ శక్తి నిల్వ ఉంటుంది. జ్వాల వెలువడినప్పుడు కొన్ని నిమిషాల నుంచి గంటల వరకు తీవ్రమైన కాంతి, రేడియో తరంగాలు, ఎక్స్ కిరణాలు, గామా కిరణాలతో కూడిన వికిరణం విడుదలవుతుంది. సౌర జ్వాలలను 'ఎ', 'బి', 'సి', 'ఎం', 'ఎక్స్' అనే ఐదు తరగతులుగా వర్గీకరిస్తారు. 'ఎక్స్' తరగతి అత్యంత శక్తివంతమైనది. ఇవి ప్రపంచవ్యాప్తంగా రేడియో బ్లాక్‌అవుట్లకు, భూమి పైవాతావరణంలో దీర్ఘకాలిక రేడియేషన్ తుఫాన్లకు కారణమవుతాయి. 'ఎం' తరగతి జ్వాలలు సాధారణంగా ధ్రువ ప్రాంతాల్లో స్వల్పకాలిక రేడియో కలిగిస్తాయి. 'సి', 'బి', 'ఎ' తరగతుల జ్వాలలు క్రమంగా బలహీనంగా ఉంటాయి. సౌర జ్వాలల నుంచి వచ్చే తీవ్రమైన వికిరణం ఉపగ్రహ కమ్యూనికేషనుం గ్రిడ్లను దెబ్బతీయవచ్చు. అదే సమయంలో సాధారణంగా ధ్రువ ప్రాంతాల్లో కనిపించే అరోరాలు తక్కువ అక్షాంశాల్లో కూడా కనిపించే అవకాశం పెరుగుతుంది.

## కాంతి ప్రయాణాన్ని నిర్ధారించే అయస్కాంత క్షేత్రం



ఇటీవల '1E 1547.0–5408' అనే మాగ్నెటార్ నుంచి వచ్చిన పరిశీలనలు, అత్యంత శక్తివంతమైన అయస్కాంత క్షేత్రం దాదాపు ఖాళీ అంతరిక్షంలో కాంతి ప్రయాణించే విధానాన్ని మార్చగలదనే విషయానికి ఇప్పటివరకు లభించిన బలమైన ఆధారాల్లో ఒకటిగా నిలిచాయి. మాగ్నెటార్లు అనేవి అత్యంత బలమైన అయస్కాంత క్షేత్రం కలిగిన న్యూట్రాన్ నక్షత్రాలు. భారీ నక్షత్రం సూపర్‌నోవాగా పేలినప్పుడు దాని కేంద్రం కుప్పకూలి న్యూట్రాన్ నక్షత్రంగా మారుతుంది. అందులో కొన్ని న్యూట్రాన్ నక్షత్రాలు అసాధారణంగా బలమైన అయస్కాంత క్షేత్రాన్ని ఏర్పరుచుకున్నప్పుడు వాటిని మాగ్నెటార్లు అంటారు. 1987లో మాగ్నెటార్ అనే భావనను శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. 1992లో సాఫ్ట్ గామా రిపీటర్ల (ఎస్‌జిఆర్) స్వభావాన్ని వివరించేందుకు ఈ సిద్ధాంతం విజయవంతంగా ఉపయోగపడింది. మాగ్నెటార్ అయస్కాంత క్షేత్రం సాధారణ న్యూట్రాన్ నక్షత్రాల కంటే సుమారు వెయ్యి రెట్లు బలంగా ఉంటుంది. భూమి అయస్కాంత క్షేత్రంతో పోలిస్తే అది ఒక 'క్వాడ్రిలియన్' రెట్లు ఎక్కువ బలాన్ని కలిగి ఉండవచ్చు. ఈ అపారమైన అయస్కాంత శక్తి క్రమంగా క్షీణించడంతో మాగ్నెటార్లు అధిక శక్తి గల విద్యుదయస్కాంత వికిరణాన్ని విడుదల చేస్తాయి. వీటిలో కాలానుగుణంగా ఉద్గార తీవ్రత గణనీయంగా మారుతుంది. ఇవి కాలక్రమంలో వాటి భ్రమణ వేగం తగ్గుతుంది. కొన్నిసార్లు కొన్ని సెకన్ల పాటు మాత్రమే కొనసాగే అత్యంత ప్రకాశవంతమైన శక్తి విస్ఫోటాలను విడుదల చేస్తాయి. మరి కొన్ని సందర్భాల్లో నెలలపాటు కొనసాగే తీవ్రమైన ఉద్గారాలను కూడా చూపిస్తాయి. '1E 1547.0–5408' నుంచి లభించిన తాజా పరిశీలనలు మరో ముఖ్యమైన విషయాన్ని సూచిస్తున్నాయి. మాగ్నెటార్‌కు చెందిన అపారమైన అయస్కాంత క్షేత్రం, శూన్యంగా కనిపించే అంతరిక్షంలో కూడా కాంతి ప్రవర్తనను ప్రభావితం చేయగలదు. ఇది బలమైన గురుత్వాకర్షణ, అయస్కాంత క్షేత్రాల మధ్య కాంతి–పదార్థ పరస్పర చర్యలను అర్థం చేసుకోవడంలో శాస్త్రవేత్తలకు కొత్త ఆధారాలను అందిస్తుంది.

## తరచుగా 'కోరల్ బ్లీచింగ్'

గ్లోబల్ కోరల్ రీఫ్ మానిటరింగ్ నెట్‌వర్క్ (జిసిఆర్ఎంఎన్) ఇటీవల విడుదల చేసిన ప్రపంచ పగడపు దిబ్బలపై ఏడో నివేదిక ప్రకారం, సముద్రాల్లో 'కోరల్ బ్లీచింగ్' ఘటనలు తరచుగా సంభవిస్తున్నాయి. బ్లీచింగ్ తర్వాత పగడాలు కోలుకునే వ్యవధి కూడా గణనీయంగా తగ్గిపోయింది. ఇది సముద్ర పర్యావరణ వ్యవస్థపై పెరుగుతున్న ఒత్తిడికి సంకేతం. కోరల్ పాలిప్‌లలో నివసించే 'జూక్సాంతెల్లే' అనే సూక్ష్మ శైవలాలతో పగడాలకు సహజీవన సంబంధం ఉంటుంది. ఈ శైవలాలు సూర్యకాంతిని ఉపయోగించి కిరణజన్య సంయోగక్రియ ద్వారా పగడాలకు ఆహారం, పోషకాలను అందిస్తాయి. ప్రతిగా పగడాలు వాటికి నివాసాన్ని కల్పిస్తాయి. పగడాలకు కనిపించే ప్రకాశవంతమైన రంగుకు కూడా ఈ శైవలాలే కారణం. సముద్ర ఉష్ణోగ్రత పెరగడం, కాలుష్యం, సముద్రపు ఆమ్లత్వం పెరగడం వంటి ఒత్తిళ్లు ఎదురైనప్పుడు శైవలాలు హానికరమైన రియాక్టివ్ ఆక్సిజన్ పదార్థాలను ఉత్పత్తి చేస్తాయి. దీంతో పగడాలు వాటిని బయటకు పంపిస్తాయి. ఫలితంగా తెల్లటి అస్థి పంజరం బయటకు కనిపించి పగడాలు తెల్లగా మారతాయి. సముద్ర ఉష్ణోగ్రత పెరుగుదల



దీనికి ప్రధాన కారణం. తీర ప్రాంత కాలుష్యం, అధిక సూర్యకాంతి, తీవ్రమైన అల్ప ఆటుపోట్లు కూడా బ్లీచింగ్‌కు దారితీస్తాయి.



## మహేష్ శ్రీరాం హీరోగా 'ఫణి'

వరుస ఆంగ్ల చిత్రాల్లో నటిస్తూ హాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్నారు తెలుగు హీరో మహేశ్ శ్రీరామ్. ఆయన ప్రస్తుతం విఎన్ ఆదిత్య దర్శకత్వం వహిస్తున్న 'ఫణి' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే 'ఫణి' సినిమా మీద మూవీ లవర్స్‌లో మంచి అంచనాలు ఏర్పడుతున్నాయి. మరోవైపు మహేశ్ శ్రీరామ్ హాలీవుడ్‌లో నటించిన 'కౌబాయ్ అండ్ ఇండియన్' సినిమా రిలీజ్‌కు రాబోతోంది. ఈ చిత్రంలో ప్రముఖ హాలీవుడ్ నటుడు బ్రాడ్ నాప్ పోషించిన స్టీవ్ క్యారెక్టర్‌కు స్నేహితుడు విజయ్ పాత్రలో మహేశ్ శ్రీరామ్ నటించారు. స్నేహితుడి అభిప్రాయాలకు విలువనిస్తూ అతని చెప్పే మాటలను అర్థం చేసుకుని సపోర్ట్ గా నిలిచే మిత్రుడు విజయ్ క్యారెక్టర్‌లో మహేశ్ శ్రీరామ్ తన పర్ ఫార్మెన్స్‌తో ఆకట్టుకోనున్నారు. డైరెక్టర్ లియో పి షెల్లీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హాలీవుడ్ లో ఇలా ఎగ్జైటింగ్ మూవీస్‌లో నటిస్తున్న మహేశ్ శ్రీరామ్ 'ఫణి' సినిమాలో లీడ్ రోల్ చేస్తుండటం ఈ మూవీకి మరింత క్రేజ్ తీసుకొస్తోంది. టాలెంటెడ్ డైరెక్టర్ డాక్టర్ వీఎన్ ఆదిత్య 'ఫణి' మూవీని గ్లోబల్ ప్రాజెక్ట్‌గా రూపొందిస్తున్నారు. ఈ థ్రిల్లర్ సినిమాను ఓ. ఎం. జి ప్రొడక్షన్స్ బ్యానర్ పై, ఏయు అండ్ ఐ స్టూడియో సమర్పణలో డాక్టర్ మీనాక్షి అనిపిండి నిర్మిస్తున్నారు. ఫణి సినిమాలో బ్యూటిఫుల్ హీరోయిన్ కేథరీన్ ట్రెసా లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. త్వరలోనే హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, ఇతర ప్రపంచ భాషల్లో 'ఫణి' సినిమాను విడుదల చేయబోతున్నారు.

## 'జై గౌరీపుత్ర గణేశా' ఆడియో ట్రైలర్ విడుదల



వాత్సల్య ఆడియో అండ్ వీడియో ఇల్లస్ట్రేషన్స్ పతాకంపై రూపొందిన తొలి చిత్రం 'జై గౌరీపుత్ర గణేశా' ఆడియో, ట్రైలర్ విడుదల వేడుక హైదరాబాద్‌లోని తెలుగు ఫిలిం చాంబర్ ప్రీవ్యూ హాల్లో ఘనంగా జరిగింది. చిత్రానికి రచయిత, దర్శకుడు, నిర్మాత స్వామి శ్రీవాత్సల్య ధర్మ వీర . ఈ సందర్భంగా స్వామి శ్రీవాత్సల్య ధర్మ వీర మాట్లాడుతూ.. గత 26 సంవత్సరాలుగా తిరువన్నామలైలో వైదిక ధర్మశాస్త్రాలను అధ్యయనం చేసిన తాను, నేటి యువతలో నైతిక విలువలు, మానవతా దృక్పథాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టినట్లు తెలిపారు. 'జై గౌరీపుత్ర గణేశా' ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులు, సమాజం ఆలోచించాల్సిన అంశాలను తెరపైకి తీసుకొచ్చామని చెప్పారు. తమ సంస్థ ద్వారా భవిష్యత్తులోనూ సందేశాత్మక, సామాజిక, ఆధ్యాత్మిక చిత్రాలను నిర్మిస్తామని వెల్లడించారు. తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ తుమ్మల ప్రసన్న కుమార్ మాట్లాడుతూ సమాజానికి మంచి సందేశాన్ని అందించే చిత్రాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుందని అన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఒత్తిడిపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని, అలాంటి అంశాన్ని సినిమాగా తెరకెక్కించడం అభినందనీయమని పేర్కొన్నారు. చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.జాయింట్ సెక్రెటరీ తుమ్మలపల్లి రామసత్యనారాయణ, నటుడు ఘర్షణ శ్రీనివాస్, సరస్వతి ఉపాసకులు శ్రీ దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## రీల్

ఇరుముడి 'సక్సెస్ మీట్'లో హీరో రవితేజ



## నాకు గౌరవం పెంచిన సినిమా


మాస్ మహారాజా రవితేజ 'ఇరుముడి' బాక్సాఫీస్ దగ్గర సక్సెస్ ఫుల్ రన్ కొనసాగిస్తోంది. అన్ని వర్గాల ఆడియన్స్ ఈ సినిమాకు బ్రహ్మ రథం పడుతున్నారు. భారీ వసూళ్లతో దూసుకెళ్తున్న ఈ సినిమా నేటికీ స్ట్రాంగ్ కలెక్షన్స్ నమోదు చేస్తుండటం విశేషం. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర జోరును కొనసాగిస్తున్న నేపథ్యంలో తాజాగా ఈ సినిమా బ్లాక్ బస్టర్ సెలెబ్రేషన్స్ నిర్వహించారు మేకర్స్.ఈ సందర్భంగా హీరో రవితేజ మాట్లాడుతూ మా డైరెక్టర్లు, ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్ అందరికీ చాలా చాలా థాంక్స్. ఇక నేను మాట్లాడటానికి ఏమీ లేదు.. అందరూ ఈ సక్సెస్ గురించి ఎంతో చెప్పారు. ఈ సినిమా నాకు విపరీతమైన తృప్తినిచ్చింది. ఎంతో నాపై గౌరవం పెరిగింది . ఈ సినిమా కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ వేల వేల కృతజ్ఞతలు. మమ్మల్ని శివ ఎన్నో నైట్స్ కష్టపెట్టి సూపర్ సక్సెస్ ఇచ్చారు. సినిమా సెట్స్‌లో అందరం ఎంతో సరదాగా ఎంజాయ్ చేశాము. కోట శ్రీనివాసరావు బాబాయ్ అంత టాలెంట్ ఉన్న నటుడు అజయ్ ఘోష్. ఏ క్యారెక్టర్ అయినా చేయగలడు. సాయి అన్న, ప్రియా భవాని మీరు సూపర్ అంతే. చాలా మంది నాకు ఫోన్స్ చేస్తూ ఒక్కో సీన్ గురించి వాళ్ళ రియాక్షన్స్ చెబుతుంటే నా ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ సినిమాతో నాకు ఇంత రెస్పెక్ట్ వచ్చింది అంటే ఆ క్రెడిట్ మొత్తం నివ నిర్వాణకే. యాక్టర్ గా నేను ఇప్పుడు చాలా గర్వంగా ఫీల్ అవుతున్నా. ఇరుముడి అంటే శివ, శివ అంటే శివ నిర్వాణ. ఈ సినిమా కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్'' అన్నారు. ఇరుముడి సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ మాట్లాడుతూ.. ఈ సినిమాకు సంగీతం అందించడం అదృష్టంగా భావిస్తున్నా. శివ నిర్వాణ కథను ఎంతో అద్భుతంగా మలిచారు. అందరికీ థ్యాంక్స్ అన్నారు. అనంత శ్రీరామ్ మాట్లాడుతూ.. ఈ సినిమా కోసం ప్రచారానికి ఏం మాట్లాడిన అవసరం లేదు.యాక్టర్ బేబీ నక్షత్ర. హీరోయిన్ ప్రియా భవాని శంకర్నిర్మాత నవీన్, రవి డైరెక్టర్ శివ నిర్వాణ పాల్గొన్నారు.

## '418' కు 'ఏ' సర్టిఫికెట్



మైత్రి మూవీ మేకర్స్, '418'తో థియేటర్లకు ఒక విభిన్నమైన హారర్ చిత్రాన్ని తీసుకురావడానికి సిద్ధమవుతోంది. ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్న ఈ చిత్రంతో కీర్తన్ నాద గౌడ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రానికి ఆయనే కథను కూడా అందించారు. నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తుండగా, సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ థ్రిల్లర్ సెన్సార్తో సహా అన్ని లాంఛనాలను పూర్తి చేసుకుని 'ఎ' సర్టిఫికేట్ను పొందింది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 18న థియేటర్లలో విడుదల కానుంది. పోస్టర్‌లో మసక వెలుతురులో నేలపై కూర్చున్న ఒక వ్యక్తి, 'ఏ' అక్షరం ఆకారంలో ఉన్న రక్తపు మరకల వైపు తన ఒక చేతిని చాచి ఉన్నట్లు కనిపిస్తుంది. ఆ నీడల వెలుగు, మసక రంగులు, పాతబడిన ఆకృతులు, స్పష్టంగా కనిపించే గీతలు ఒక టెర్రిఫిక్ గా ఉన్నాయి. 418' సీరియస్ ఇంటెన్స్ థ్రిలర్‌గా రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన కంటెంట్ సినిమాలోని మెయిన్ సీక్రెన్ ని ఇంకా రివిల్ చేయకుండా, ర కార్యక్రమాలను ముమ్మరం చేయడానికి సిద్ధమవుతోంది.ఈ చిత్రానికి దినేష్ దివాకర్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తుండగా, వెంకీ జీజీ సంగీతం , నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. ఉల్లాస్ హైదూర్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేశారు.

## మైథికల్ థ్రిల్లర్‌గా 'వృషకర్మ'



యువ సామ్రాట్ నాగ చైతన్య, కార్తీక్ దండు మోస్ట్ ఎవైటెడ్ మైథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ'. ఎస్విసిసి, సుకుమార్ రైటింగ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం మునుపెన్నడూ చూడని సినిమాటిక్ అనుభవాన్ని అందించబోతోంది. బాపినీడు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. తాజాగా 'వృషకర్మ' సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా డిసెంబర్ 4, 2026న థియేటర్లలో విడుదల కానున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇది పర్ఫెక్ట్ రిలీజ్ టైమ్. సినిమాను ప్రమోట్ చేసేందుకు మేకర్స్‌కు తగినంత సమయం ఉంటుంది. ఈ సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ అదిరిపోయింది. కార్తిక్ దండు డిఫరెంట్ విజన్‌తో పాటు ఎస్వీసీసీ, సుకుమార్ రైటింగ్స్ క్రియేటివ్ ఫోర్సెస్ 'వృషకర్మ' కోసం కలిసి పనిచేస్తున్నాయి. ఇప్పటికే సినిమా స్ట్రైకింగ్ గ్లింప్స్, బిహైండ్ ది సీన్స్ వీడియోలు విడుదలై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని పెంచాయి. ఈ వీడియోలు సినిమా యూనిక్ వరల్డ్, స్కేల్, విజువల్ గ్రాండియర్కు సంబంధించిన ఓ అద్భుతమైన లుక్ ను అందించాయి. 'వృషకర్మ'లో డిఫరెంట్ రోల్లో కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆయన మ్యాసీవ్ ట్రాన్స్ఫర్మేషన్ అయ్యారు. ఇప్పటికే తనకు సంబంధించిన షూటింగ్ను పూర్తి చేశారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. దేశవ్యాప్తంగా సినిమాను ప్రమోట్ చేయడంతో పాటు ఓవర్సీస్ మార్కెట్లలోనూ అగ్రెసివ్ ప్రమోషన్స్ నిర్వహించేందుకు టీమ్ ప్లాన్ చేస్తోంది. రాగుల్ డి హెరియన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అజనీష్ బి లోక్నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తూ సినిమా కోసం ప్రత్యేకమైన ప్రపంచాన్ని రూపొందిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటింగ్.

## 'ఇడుపు కాయితం' నుంచి 'శ్రీలత..' సాంగ్ రిలీజ్

ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా 'ఇడుపు కాయితం'. ఈ సినిమాలో తెలంగాణ ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగ దుర్గ హీరోయిన్‌గా నటిస్తోంది. తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్‌టైనింగ్ డ్రామాగా 'ఇడుపు కాయితం' సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా నుంచి 'శ్రీలత..' సాంగ్ రిలీజ్ చేశారు.'శ్రీలత..' సాంగ్ లో హీరో ప్రియదర్శి, హీరోయిన్ నాగదుర్గ కెమిస్ట్రీ ఆకట్టుకుంటోంది. ఈ పాటను సురేష్ బొబ్బిలి మంచి మెలొడీ ట్యూన్‌తో కంపోజ్ చేశారు. పాట మూడ్‌కు తగినట్లు ప్లెజెంట్ లిరిక్స్ అందించారు లిరిక్ రైటర్ అలరాజు. శంకర్ బాబు, మోహన భోగరాజు పాటను రిపీటెడ్ గా వినాలనిపించేలా పాడారు. ఈ పాటను పిక్చరైజ్ చేసిన అందమైన లొకేషన్స్, పిల్లలతో చేయించిన డ్యాన్స్ సీక్వెన్సులు హైలైట్‌గా నిలుస్తున్నాయి.



'శ్రీలత..' సాంగ్ అతి తక్కువ టైమ్ లోనే డిజిటల్ వ్యూస్‌లో దూసుకెళ్తుందనే అంచనాలు మ్యూజిక్ లవర్స్ లో ఏర్పడుతున్నాయి. 'ఇడుపు కాయితం' సినిమా ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను డిసెంబర్ ఫస్ట్ వీక్‌లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రియదర్శి, నాగదుర్గ, శివజ్యోతి (తీన్మార్ సావిత్రి), సుజాత (జోర్దార్), చంద్రవ్వ, మౌనిక రెడ్డి, రచ్చరవి, బిత్తిరి సత్తి, అభయ్ బేతిగంటి, మైమ్ మధు, తదితరులు నటిస్తున్నారు.



## రెవెన్యూ సేవల్లో వేగం పెంచాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో రెవెన్యూ సేవల్లో మరింత వేగం పెంచి ప్రజలకు వేగంగా న్యాయం అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. గ్రామీణ రెవెన్యూ సర్వేల నుంచి మొదలుకొని ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం వరకు ప్రతి అంశంలోనూ పారదర్శకత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యల శీఘ్రతను తగ్గించి, ప్రజలకు మేలైన సేవలు అందించడమే లక్ష్యంగా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో వెబెక్స్ ద్వారా భూ భారతి, ప్రజావాణి దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ, సర్వే శాఖలు సంయుక్తంగా చేపడుతున్న గ్రామ సర్వే ప్రక్రియ ఇకపై మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని నివారించేందుకు ఆధునాతన ఏఐ, డిజిటల్ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. గతంలో గంటల సమయం పట్టే నివేదికలు, డ్రాఫ్టింగ్ పనులను సాంకేతికత ద్వారా కేవలం కొన్ని నిమిషాల్లోనే నాణ్యతతో పూర్తి చేయవచ్చని వెల్లడించారు. మండలాల వారీగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన భూసమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక జాబితా రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

## మిల్లర్ల సమస్యలు పరిష్కరించకపోతే సిఎంఆర్ నిలిపివేస్తాం : మధుసూధన్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఈనెల 11వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా కస్టమ్ మిల్లింగ్ కార్యక్రమాన్ని నిలిపివేస్తామని రైస్ మిల్లర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంపటి మధుసూదన్, బిసి ఉద్యమ నాయకుడు వట్టె జానయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మిల్లర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిల్లర్ల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే చర్యలు జరిపి పరిష్కారం చూపాలని కోరారు. క్వింటాకు 67 కిలోల బియ్యం రాబడి ప్రస్తుతం సాధ్యం కావడం లేదని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో 60 కిలోల బియ్యం కూడా రావడం లేదని, రబీ సీజన్‌లో 50 కిలోలలోపే రాబడి వస్తోందన్నారు. పరీక్ష మిల్లింగ్ నిర్వహించి ఎంత బియ్యం వస్తుందో అంతే ప్రభుత్వానికి అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. మిల్లుల సామర్థ్యానికి మించి రెండు, మూడు రెట్ల ధాన్యాన్ని కేటాయించడం వల్ల నిల్వలు, లోటు సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. మిల్లల సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వెంటనే మిల్లర్లతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ఈనెల 11వ తేదీ నుంచి సిఎంఆర్ నిలిపివేత నిర్ణయాన్ని అమలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయప్రకాష్, ఓరుగంటి బ్రహ్మ, కొత్త బ్రహ్మయ్య, బొలిశెట్టి నరసింహారావు, కొత్త ఆంజనేయులు, అశ్విని కుమార్, కాసం జగన్ పాల్గొన్నారు.

## మిల్లర్లను ఒత్తిడికి గురి చేయొద్దు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి, కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు కర్నాటి నారాయణ,జనరల్ సెక్రటరీ రేపాల భద్రాద్రి రాములు మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన ధాన్యం మిల్లింగ్, సీఎంఆర్ డెలివరీలో మిల్లర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.టెస్ట్ మిల్లింగ్ తర్వాతే సీఎంఆర్ శాతం నిర్ణయించాలని,యాసంగిలో బాయిల్డ్ రైస్ మాత్రమే తీసుకోవాలని, పాత ఖాళీ బస్తాలను వెనక్కి తీసుకోవాలని లేదా ధర రూ.10,స్క్రాప్ బస్తాల ధర రూ.5గా నిర్ణయించాలని, రిపేర్ చార్జీలు చెల్లించాలని, పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, సీఎంఆర్ ఒప్పందం ఇరువైపులా సానుకూలంగా ఉండాలని, 200 హెచ్‌పి వరకు ఎల్‌టి కరెంటు వర్తింపజేయాలని,ఫిజికల్ వెరిఫికేషన్ పేరుతో మానసిక ఒత్తిడికి గురి చేయవద్దని,డ్యామేజ్, రంగు మారిన బియ్యం 1520 షార్టేజీని పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూలకంటి ఇంద్రారెడ్డి,గౌరవాధ్యక్షులు చిట్టిపోలు యాదగిరి,రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్,వివిధ సెంటర్ల అధ్యక్షులు శ్రీనివాస్,వీరుమల్ల శ్రీనివాస్,కన్మంతరెడ్డి కేశవరెడ్డి, సముద్రాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బాలిక ఆత్మహత్య.. నిందితుల అరెస్టుకు డిమాండ్



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని లెంకలపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలిక వరికుప్పల మౌనిక (17) ఈ నెల 2న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు.బాలిక ఆత్మహత్యకు కారణమైన నిందితులను వెంటనే అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మర్రిగూడ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు.అదే గ్రామానికి చెందిన ఏర్పుల రాకేష్,దామెర శివ వేధింపులకు గురి చేయడం వల్లే మౌనిక ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపించారు.బాలిక రాసిన లేఖను సైతం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదుతో పాటు అందజేసినట్లు తెలిపారు. బాలిక ఆత్మహత్య చేసుకున్న రోజే ఆమె తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు నిందితులను అరెస్టు చేయకుండా పోలీసులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. నిందితులపై వెంటనే చర్యలు తీసుకుని బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు అప్రమత్తమై ఆందోళనకారులతో మాట్లాడారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ధర్నాను విరమించారు.

# మట్టి మనుషుల మహత్తర పోరాటం

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శం
అమరజీవి అనుమాల లింగయ్య పార్టీకి చేసిన సేవలు అమోఘం
సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిస్వార్థంగా చేసిన పోరాటంలని, సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చి బావితరాలకు అందించాలని అవసరం ఉన్నదని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 80వ వార్షికోత్సవాల సందర్భంగా సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను మండలంలోని పొనుగోడు గ్రామంలో నిర్వహించారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, పొనుగోడు గ్రామ మాజీ సర్పంచ్, తన ఆస్తిని కుమారుడికి సమానంగా పార్టీకి ఆస్తిని పంచి ఇచ్చిన మహోన్నత మనిషి అనుమాల లింగయ్య స్మారక వద్ద ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నైజాం నవాబ్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం 1946 నుండి 1951 వరకు చరిత్రాత్మకమైన పోరాటం కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిందని అన్నారు. 225 సంవత్సరాల పాటు హైదరాబాద్ సంస్థానాన్ని నిజాం నవాబ్ పరిపాలన చేసినారని, మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలనలో హైదరాబాద్ సంస్థానంలోని ప్రజలపై వేధింపులు, పన్నులపై పన్నులు వేసినారని, మహిళలను చిత్ర హింసలకు గురిచేశారని అన్నారు. ఆంధ్రమహాసభ ఆధ్వర్యంలో ప్రజలు గ్రామాల్లో సంఘం ఏర్పాటు చేసుకుని ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు సాగినారని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీదేనని అన్నారు. 4వేల మంది కమ్యూనిస్టులు ఆ పోరాటంలో ప్రాణాలు కోల్పోయారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం వల్ల దేశ వ్యాప్తంగా ఉన్న అనేక సంస్థానాలను భారత ప్రభుత్వంలో విలీనం చేసినారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపాల వద్ద పార్టీ దిమ్మెల వద్ద ఎర్రజెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు, పోకల వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి త్రిపురం సుధాకర్‌రెడ్డి, బిల్లా కనకయ్య, ఎడ్ల అంజిరెడ్డి, వేశాల ఆంజనేయులు, కుందురు వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు, రంగాపురం సర్పంచ్ కట్టా కళ్యాణి, ప్రతాని సైదులు, వెంకన్న, వెంకటేశ్వరరావు, కుంభం వెంకటి, రెడపంగు సైదులు, పగడాల శ్రీనివాస్, పంగ గోవింద్, ఈశ్వరచారి పాల్గొన్నారు.

## సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులే

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** భూమి కోసం, భుక్తి కోసం,వెట్టి చాకిరీ విముక్తి కోసం నైజాంను తరిమికొట్టి ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అందించిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తోందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ఆరోపించారు.ఈ నెల 11 నుండి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సిపిఐ నల్లగొండ పట్టణ సమితి ఆధ్వర్యంలో గురువారం సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా సాయుధ పోరాట యోధులకు,ప్రజా పోరాటంలో అమరులైన వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ నాటి నైజాం వ్యతిరేక పోరాటంలో బీజేపీ పాత్రే లేదని, తెలంగాణ విలీన దినోత్సవంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కపట నాటకం ఆడుతున్నాయని విమర్శించారు. ట్యాంక్ బండ్‌పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలు పెడతామని,పాఠ్యపుస్తకాల్లో సాయుధ పోరాట చరిత్రను చేరుస్తామని చెప్పిన పాలకులు హామీలను నెరవేర్చలేదని ప్రశ్నించారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ నైజాంపై పోరాటాన్ని హిందూముస్లింల గొడవగా చిత్రీకరిస్తోందని, నాటి పోరాటంలో బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ పాత్ర ఏ మాత్రం లేదని,సాయుధ పోరాటానికి వారసులు ఒక్క కమ్యూనిస్టులేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ఎస్.రెడ్డి, వి.లెనిన్,కోమటిరెడ్డి ప్రద్యుమ్నరెడ్డి, ముండ్లముత్యాలు, యూసుఫ్, నారాయణ,జి.నరేందర్,పి.వెంకన్న,అంజయ్య, సీతారాములు, జే.విజయ, అరుణ,కే.వెంకటేశం, వీరయ్య,పి.నరసింహ,శ్రీనివాస్, చైతన్య,ముత్తయ్య, లింగయ్య పాల్గొన్నారు.

## 18,19న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం రిలే నిరాహార దీక్షలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(ఐజెయు)జిల్లా కమిటీ అధ్యక్షుడు గార్లపాటి కృష్ణా రెడ్డి,ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి తెలిపారు.ఈ నెల 18,19 తేదీలలో నిర్వహించే ఈ రిలే దీక్షలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఈ దీక్షల నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ నల్లగొండ డిఎస్‌పి కె. శివరాంరెడ్డికి శుక్రవారం ఒక అధికారిక వినతిపత్రాన్ని సమర్పించారు. జర్నలిస్టుల చిరకాల ఆకాంక్ష అయిన ఇండ్ల స్థలాల సాధన కోసం శాంతి యుత పద్ధతిలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామని, కాబట్టి ఈ రెండు రోజుల దీక్షలకు తగిన అనుమతులు మంజూరు చేయాలని వారు తమ లేఖలో కోరారు.జర్నలిస్ట్ ఇళ్లు,ఇళ్ల స్థలాల కోసం ఎన్ని సార్లు ధర్నాలు, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు తాత్కాలిక హామీలు తప్ప తమ సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు పరమేష్, ప్రధాన కార్యదర్శి దోటి శ్రీనివాస్, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షులు అబ్బోజు మదనాచారి,కోశాధికారి అశోక్, వీడియో జర్నలిస్టల సంఘం అధ్యక్షులు సలీం, జిల్లా నాయకులు జిల్లా యాదయ్య,పి.అశోక్ కుమార్, వంగాల శ్రీనివాస్ రెడ్డి, తెల్లగమల్ల దశరథ, కె.జగదీశ్వర చారి,చింత యాదయ్య, రామ్ ప్రసాద్, రెడ్డి పల్లి యాదగిరి,రెమిడాల మధు, ముచ్చర్ల విజయ్, కారింగు శ్రీనివాస్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

ఎస్‌పి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసులు లేకుండా దర్యాప్తులను వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో నేర నియంత్రణ, పెండింగ్ కేసుల దర్యాప్తు, ఎన్‌బీడబ్ల్యూ పెండింగ్ కేసుల పరిష్కారం, ఆస్తి నేరాల నియంత్రణ, సైబర్ నేరాలపై తక్షణ స్పందన తదితర అంశాలపై శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ప్రతి కేసును నిర్దేశిత కాలవ్యవధిలో సమగ్రంగా దర్యాప్తు చేసి,అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలను సేకరించి నాణ్యమైన చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్ లైన్ కు సమాచారం అందించేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత బ్యాంకులు, సైబర్ క్రైమ్ విభాగాలతో సమన్వయం చేసుకుని మోసపోయిన నగదును వీలైనంత త్వరగా ఫ్రీజ్ చేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నల్లగొండ డిఎస్‌పి కె. శివరాం రెడ్డి,దేవరకొండ డిఎస్‌పి శ్రీనివాసరావు, సీఐలు,ఎస్ఐలు,ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు బాధాకరం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బిఆర్‌ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్స్ కార్పోరేషన్ చైర్మన్, పిసిసి అధికార ప్రతినిధి దూదెం వెంకటరమణ, టూరిజం కార్పోరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్యలు విమర్శించారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రెడ్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్పీకర్‌పై బిఆర్‌ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు వింటే బాధ కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులను కించపరిచేలా మాట్లాడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు దళితులపై ఏనాడూ నిజమైన ప్రేమ లేదని ఆరోపించారు. రాజ్యాంగపరంగా అమలులో ఉన్న రిజర్వేషన్లను అమలు చేయడం తప్ప దళితుల సంక్షేమం, సాధికారత కోసం ఆయన మనస్ఫూర్తిగా చేసిందేమి లేదని విమర్శించారు. గతంలో దళితుడైన మల్లు భట్టి విక్రమార్క ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో ఆయనకు సమాన హోదా, గౌరవం ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే ప్రతిపక్ష హోదా కల్పించలేదని ఆరోపించారు. ప్రస్తుతం దళితుడు గడ్డం ప్రసాద్ కుమార్ శాసన సభ స్పీకర్‌గా ఉన్న నేపథ్యంలో ఆయనను గౌరవిస్తూ లేచి నిలబడి అధ్యక్షా అని సంబోధించాల్సి వస్తుందనే అహంకారంతోనే కెసిఆర్ అసెంబ్లీకి దూరంగా ఉంటున్నారని విమర్శించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై, ఆయన కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరంగా వెంటనే చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ పాల్గొన్నారు.

## సాగర్ సరిహద్దులో ఎక్సైజ్ శాఖ చెక్‌పోస్ట్ ఏర్పాటుకు చర్యలు



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో అక్రమ మద్యం రవాణా,నిషేధిత వస్తువుల తరలింపుపై మరింత పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసే దిశగా నందికొండ మున్సిపాలిటీ పరిధిలో ఎక్సైజ్ శాఖ చెక్‌పోస్ట్ ఏర్పాటుకు అధికారులు చర్యలు ప్రారంభించారు.ఈసందర్భంగా శుక్రవారం ఎక్సైజ్ శాఖ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కిషన్ నాయక్, ఎక్సైజ్ సీఐ కృష్ణకాంత్‌తో పాటు ఇతర అధికారులు నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల్లో స్థల పరిశీలన నిర్వహించారు.సమీపంలోని పాత వాణిజ్య పన్నుల శాఖ తనిఖీ కేంద్రం ఉన్న ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.రాకపోకలకు అనుకూలత, అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతంపై నిరంతర పర్యవేక్షణతో పాటు అక్రమ మద్యం రవాణాను సమర్థవంతంగా అరికట్టే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసే దిశగా పరిశీలన చేపట్టినట్లు సమాచారం.త్వరలోనే నందికొండ మున్సిపాలిటీ పరిధిలో ఎక్సైజ్ శాఖ చెక్‌పోస్ట్ ఏర్పాటుకు సంబంధించిన తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. చెక్‌పోస్ట్ ఏర్పాటు ద్వారా సరిహద్దు మార్గాలపై నిఘా మరింత పటిష్ఠమవడంతో పాటు అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.



## నిజాం నవాబును తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టులది

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మండల పరిధిలోని గంటవారిగూడెం గ్రామంలో శుక్రవారం ప్రపంచ ప్రఖ్యాత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యుడు దూళిపాళ ధనుంజయనాయుడు మాట్లాడుతూ ఒడిసెల రాళ్లు బట్టి ఒడి ఒడిగా కొడుతూ కారపు నీళ్ల తెచ్చి కళ్లల్లో చల్లుకుంటూ అత్యంత నికృష్టుడు నిజాం నవాబును తెలంగాణ పొలిమేరల వరకు పరిగెత్తించి, తరిమికొట్టిన ఘన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అని అన్నారు. ప్రపంచం నివ్వెరపోయేఆల మట్టి మనుషులు ఏకమై ప్రజా ఉద్యమాలలో, ప్రజాకంటక పాలనను నిర్మూలించి పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనం చేసి మేము భారతీయులం అని గర్వంగా ఈనాడు మనం అందరం జీవించేలా చేసింది సిపిఐ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కత్తి శ్రీనివాసరెడ్డి, రావుల సత్యం, ముత్యాల భాస్కర్, ఊదర వెంకన్న, కొమర్రాజు వెంకట్, సయ్యద్ పాషా, సోమగాని ప్రసాద్, వసంతరావు, కుప్పాల వెంకటయ్య, కొత్తపల్లి సతీష్, ముంత సైదులు, వెంకటేష్ పాల్గొన్నారు.

## కేసులు పెండింగ్ ఉండొద్దు : ఎస్‌పి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** అధికారులు కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సూర్యాపేట డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లలో నమోదువుతున్న కేసుల వివరాలు, కేసుల ధర్యాప్తు పురోగతి, కేసుల ఆన్‌లైన్ నమోదు, ఈ సాక్షి నమోదు, కేసుల దాఖలు, పెండింగ్ కేసుల పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు. పోలీసు అధికారులు, సిబ్బంది కేసులు, ఫిర్యాదులు పెండింగ్ ఉంచకుండా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు, సైబర్ మోసాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు సబ్ డివిజన్ పరిధిలో ముందస్తు పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు, భక్తులు ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయడం పోలీసుల బాధ్యతని తెలిపారు. ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖలతో సమన్వయంతో చేసుకుంటూ ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఫింగర్ ప్రింట్ ఇన్‌స్పెక్టర్ నవీన్, సైబర్ సెక్యూరిటి ఇన్‌స్పెక్టర్ లక్ష్మి నారాయణ, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మగ్దుం అలీ, సిఐలు రాజశేఖర్, వెంకటయ్య, డివిజన్ ఎస్ఐలు, షీ టీం, భరోసా, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజశేఖర్‌కు అంతర్జాతీయ ప్రశంసలు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** తెలంగాణ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ నేతృత్వంలో అధ్యయన పర్యటనలో పాల్గొన్న ప్రముఖ ఉపాధ్యాయుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు చారుగండ్ల రాజశేఖర్, అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన రీసెర్చ్ పేపర్ ప్రజంటేషన్‌ను ప్రశంసిస్తూ జపాన్ అంతర్జాతీయ విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ అఖోవా ప్రశంసాపత్రం అందజేశారు. సెప్టెంబర్ 5 నుంచి 12 వరకు జరిగిన పర్యటనలో తెలంగాణకు చెందిన 29 మంది ఉపాధ్యాయులు, విద్యా నిపుణుల బృందం జపాన్‌లో ప్రముఖ విద్యాసంస్థలను సందర్శించి అక్కడి ఆధునిక విద్యావిధానం, రోబోటిక్స్, సాంకేతిక విద్య, ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధి, ప్రత్యేక అవసరాల పిల్లల విద్యా విధానాలను అధ్యయనం చేసింది.

## సబ్ కలెక్టర్‌ను కలిసిన జిల్లా విజిలెన్స్ సభ్యుడు అనిత సురేష్



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ రెవెన్యూ డివిజన్ నూతన సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కరోలిన్ చింగ్తియాన్ మావిని దేవరకొండలోని తన కార్యాలయంలో శుక్రవారం జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యులు యేకుల అనిత సురేష్ మార్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో కలెక్టర్‌తో చర్చించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని కోరారు. సబ్ కలెక్టర్ స్పందిస్తూ డివిజన్ అభివృద్ధికి, ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. టిపిసిసి ఎస్సీ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ యేకుల రాజారావు, మురళి పాల్గొన్నారు.

## విచారణ ప్రక్రియ మరింత వేగవంతం చేయాలి: అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్ 2026)లో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ధ్రువ పత్రాల విచారణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు.శుక్రవారం హనుమకొండ నయీమ్ నగర్ లోని 240వ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విచారణ కేంద్రంలో నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలోని ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ప్రక్రియను అదనపు కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలోని ఓటర్ల నుండి స్వీకరించిన ధ్రువపత్రాలను త్వరగా పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. జాబితాలో ఉండి నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత సమయం, పోలింగ్ కేంద్రం, ఎన్నికల సంఘం సూచించిన ధ్రువ పత్రాలతో హాజరయ్యే విధంగా బిఎల్ఓలు, ఇతర అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.ఈ సందర్భంగా ఎఇఆర్ఒలు ప్రసాద్, బిఎల్ఓ సూపర్ వైజర్లు, బిఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ తండ్రి ఆత్మహత్యాయత్నం

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** మాజీ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ తండ్రి సుబ్రహ్మణ్యం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. 40 నిద్రమాత్రలు మింగిన ఆయన శుక్రవారం ఉదయం నిద్ర లేవకపోవడంతో కుటుంబ సభ్యులు గుర్తించారు. వెంటనే హనుమకొండ హంటర్ రోడ్డులోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం సుబ్రహ్మణ్యం పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించినట్లు సమాచారం. సుబ్రహ్మణ్యం ఎన్ఎమ్‌డిసిఎల్‌లో ఏడిజిగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేశారు.

## పిఎంశ్రీ నిధుల పంచాయితీపై అధికారులు సీరియస్

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం /నడికూడ :** పిఎం శ్రీ పథకం నిధుల వినియోగంపై వరికోల్ ప్రాథమిక పాఠశాలలో తలెత్తిన వివాదం అధికారుల దృష్టికి చేరింది. నిధుల వినియోగంపై టీచర్ల మధ్య తలెత్తిన విభేదాలు,పాఠశాలలో జరిగిన వాగ్వాదం,పరస్పర ఫిర్యాదులపై విద్యాశాఖ అధికారులు స్పందించారు.ఈ వ్యవహారంపై 'ప్రజాపక్షం'లో 'పిఎం శ్రీ నిధుల పంచాయితీపై పే రెంట్స్‌ల ముందే టీచర్ల రభస శీర్షికన కథనం ప్రచురితమైన నేపథ్యంలో అధికారులు చర్యలకు దిగినట్లు సమాచారం.ఈ వ్యవహారంపై హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి విషయం వెళ్లడంతో నడికూడ మండల విద్యాశాఖ అధికారి హనుమంతరావు పాఠశాలలో జరిగిన ఘటన పై స్పందించారు.గొడవకు సంబంధించిన ఇద్దరు టీచర్లు శరత్,అశోక్‌ల కుషోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంఇఒ హనుమంతరావు తెలిపారు.

## విద్యార్థుల పోరాటానికి బిఆర్ఎస్ అండ




**ప్రజాపక్షం/ఖిలావరంగల్:** వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలలో జిఒ నంబర్ 97ను అమలు చేయొద్దని, కళాశాలను పిపిపి విధానంలోకి తీసుకెళ్ళకూడదని, విద్యార్థులను కార్మికులుగా పరిగణించవద్దని డిమాండ్ చేస్తూ విద్యార్థులు చేపడుతున్న ఆందోళనకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తెలిపారు. విద్యార్థులు చేపడుతున్న నిరసనలు, నిరాహార దీక్షల్లో భాగంగా కొనసాగుతున్న దీక్షా శిబిరాన్ని నన్నపునేని నరేందర్ సందర్శించి సంఘీభావం తెలిపారు. బిఆర్ఎస్ ఎల్లప్పుడూ విద్యార్థుల పక్షాన నిలుస్తుందని భరోసా ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించే వరకు వారి పక్షాన పోరాటం కొనసాగిస్తామని నన్నపునేని నరేందర్ స్పష్టం చేశారు.

## గంజాయి సేవిస్తున్న ఆరుగురిపై కేసు

**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** గంజాయి సేవిస్తున్న ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ కు పంపినట్లు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ 10 తేదీన గస్తీ నిర్వహిస్తుండగా బండ్ల గూడెం గ్రామం కెనాల్ పక్కన ఉన్న చెట్లలో మండల కేంద్రానికి చెందిన బాకీ ప్రసాద్, నక్కల సాయి కృష్ణ, బండ్ల గూడెం గ్రామానికి చెందిన పులి సందీప్, కళ్లెం గ్రామానికి చెందిన సంఘీ ప్రతాప్, మాణిక్యపురం గ్రామానికి చెందిన మర్రి కుక్కల కనకరాజు మర్రి కుక్కల నాగరాజు ఆరుగురు కలిసి గంజాయి సేవిస్తుండగా, పట్టుకొని వీరి దగ్గర ఉన్న ఆరు సెల్ ఫోన్లు, ఒక కారు, ఒక స్కూటర్, 10 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

## బాలికల సదనంలో సౌకర్యాల పరిశీలన



**ప్రజాపక్షం/ములుగు:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె చందీశ్వరి దేవి గురువారం బాల సదనాన్ని సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న అనాథ, పాక్షిక అనాథ బాలికలకు అందుతున్న వసతులను పరిశీలించారు. బాలికలకు కల్పిస్తున్న వసతి, భోజనం తదితర సౌకర్యాలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాలికల అవసరాలు, సదనంలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమం లో బాల సదనం, డిఎల్ఎస్ఎ సిబ్బంది పాల్గొన్నారు.

## అటవీ శాఖ అమర వీరుల స్మారకార్థం ర్యాలీ



**ప్రజాపక్షం/ కాటారం;**జాతాయ అటవీ శాఖ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాటారం మండల కేంద్రంలో శుక్రవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అటవీ సంరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ శాక అమరవీరులను స్మరించుకుంటూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.మహాదేవపూర్ ఎఫ్‌డిఓ సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ కాటారం పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది .అనంతరం అమరవీరులకోసం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కాటారం, మహా దేవపూర్, పెగడ పల్లి,పలిమెల అటవీశాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## 'తెలంగాణ రైజింగ్-2047'లో
# వరంగల్‌కు ప్రత్యేక స్థానం కల్పించాలి

- ఉమ్మడి వరంగల్ జిల్లా పారిశ్రామిక అభివృద్ధిపై అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/హనుమకొండ :**ఉమ్మడి వరంగల్ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి కావాల్సిన అన్ని వనరులు ఉన్నందున కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని అసెంబ్లీలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.తెలంగాణ శాసనసభ సమావేశాలలో భాగంగా ప్యానెల్ స్పీకర్ స్థానంలో ఆసీనులై సభను విజయవంతంగా నిర్వహిస్తున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వరంగల్ ప్రాంత సమగ్ర పారిశ్రామిక పురోగతిపై అసెంబ్లీలో మాట్లాడారు. గత మూడు రోజులుగా శాసనసభ ప్యానెల్ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ సభా నిర్వహణలో తనదైన అనుభవాన్ని ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో వరంగల్ జిల్లా పారిశ్రామిక ప్రాధాన్యతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ... హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారి 163ని ప్రభుత్వం ఇప్పటికే పారిశ్రామిక కారిడార్‌గా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపకల్పన చేస్తున్న 'తెలంగాణ రైసింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌లో వరంగల్ ప్రాంతానికి ప్రత్యేక స్థానం, అత్యున్నత ప్రాధాన్యత కల్పించాలని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబునప కోరారు.ఒక ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి కావలసిన అన్ని అనుకూలతలు వరంగల్‌కు ఉన్నాయని కడియం శ్రీహరి సభకు వివరించారు. వరంగల్ జిల్లాను ఆనుకుని గోదావరి నది ప్రవహిస్తుండటంతో పరిశ్రమలకు సరిపడా నీటి లభ్యత ఉందని అలాగే సమృద్ధిగా విద్యుత్ ఉత్పత్తి వనరులు ఉన్నాయని తెలిపారు. దీంతో పాటు విస్తారమైన బొగ్గు గనులు, ఐరన్ ఓర్ లభ్యత, ప్రతిష్టాత్మక మెగా టెక్స్‌టైల్ పార్క్ వరంగల్‌లో కొలువై ఉందని అన్నారు. వరంగల్ నగరానికి అతిత్వరలోనే ఎయిర్ పోర్ట్ కూడా అందుబాటులోకి రానుండటంతో గ్లోబల్ కనెక్టివిటీ పెరుగుతుందని పేర్కొన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, వరంగల్ జిల్లాలో కొత్త పరిశ్రమలు నెలకొల్పేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, బహుళజాతి కంపెనీలను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఎమ్మెల్యే కడియం శ్రీహరి లేవనెత్తిన అంశాలపై రాష్ట్ర శాసన సభా వ్యవహారాలు, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేరుగా స్పందించారు. హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిని పూర్తిస్థాయి పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేయడానికి కావలసిన అన్ని రకాల సహాయ సహకారాలు, అవసరమైన చర్యలను ప్రభుత్వం త్వరలోనే వేగవంతంగా చేపడుతుందని సభాముఖంగా హామీ ఇచ్చారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలకు తరలిరండి

సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఈనెల 11నుండి 17వ వరకు నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక రవి నారాయణ రెడ్డి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 11 నుండి నుండి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 16వ న భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగ సాయంతం పోరాట వారోత్సవాలను అధికారికంగా నిర్వహించాలని, సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు.ఈ నెల 16న జరిగే సిపిఐ పార్టీ భారీ ర్యాలీ, ప్రదర్శనలో సిపిఐ పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు, మేధావులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రవీణ్ కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గురిజపల్లి సుధాకర్ రెడ్డి, నూకల చంద్రమౌళి, వేముల శ్రీకాంత్, గనగల జోగేష్, లోకిన్ రమేష్, అస్లాం, యాకూబ్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుకు ముందస్తు చర్యలు: కలెక్టర్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో వానాకాలం ధాన్యం కొనుగోలుకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై రెవెన్యూ, పౌర సరఫరాలు, సహకార, మార్కెటింగ్, సహకార, వ్యవసాయ, డిఆర్‌డిఎ, ఎస్ డబ్ల్యూసి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రారంభానికి ముందే అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, సమస్యలకు తావులేకుండా కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన స్టోరేజ్ స్థలాన్ని ముందుగానే సిద్ధం చేయాలి. ధాన్యం సేకరణ అనంతరం నిల్వ చేసేందుకు అవసరమైన స్టోరేజ్ స్పేస్‌ను ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. రవాణా ప్రక్రియలో జాప్యం కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని రవాణా వాహనాలను నిబంధనల ప్రకారం టెండర్ ప్రక్రియలోకి తీసుకురావడంతో పాటు, వాహనాల ఫిట్‌నెస్‌ను ముందుగానే పరిశీలించి, జిపిఎస్ ఏర్పాటుతో సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం ప్యాకింగ్‌కు అవసరమైన గన్నీ బ్యాగుల లభ్యతపై ముందస్తు అంచనాలు రూపొందించి, మిల్లులు, సంబంధిత ఏజెన్సీలతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ నెలాఖరులోగా అన్ని కొనుగోలు కేంద్రాలను మ్యాపింగ్ చేయాలి. జిల్లాలో ఏర్పాటు చేయనున్న అన్ని ప్రాథమిక ధాన్యం కొనుగోలు కేంద్రాలను యాప్ ద్వారా ఈ నెలాఖరులోగా మ్యాపింగ్ చేసి, అవసరమైన సాంకేతిక ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, ధాన్యం సేకరణకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల డిఎం రాములు, సహకార అధికారి వాల్య నాయక్, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, డబ్ల్యూసి ఆర్ ఎం దీపిక, అదనపు డిఆర్‌డిఎచౌహాన్,ఎఎంవిఐ సుందర్‌లాల్ తదితరులుపాల్గొన్నారు.

## దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న బిఆర్ఎస్

టిపిసిసి అధికార ప్రతినిధి నూక కిరన్‌కుమార్ యాదవ్



**ప్రజాపక్షం /జనగామ :** పదేళ్లు అధికారంలో ఉండి ప్రజల చేత చీత్కరించబడిన బిఆర్ఎస్ దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుందని టిపిసిసి స్పోక్స్ పర్సన్ నూక కిరన్‌కుమార్ యాదవ్, డిసిసి జనగామ జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి అన్నారు. దళిత స్పీకర్ ప్రసాదరావును అవమానించడమే కాకుండా, కెసిఆర్ ఫాంహౌస్ వద్ద దళితులు డప్పు కొడితే పసుపు నీటితో శుద్ధిచేయడం విచారకరమన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వైటిడిఎ సభ్యుడు డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్‌తో కలిసి కిరన్‌కుమార్ యాదవ్, లకావత్ ధన్వంతి మాట్లాడారు. దళిత, గిరిజనులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంతో పాటు వారికి సముచిత స్థానం కల్పించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. దళితులను కేవలం ఓటు బ్యాంక్‌గా కాకుండా అధికారంతో భాగస్వాములుగా చూడడమే కాంగ్రెస్ విధానమని, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, శాసనసభ స్పీకర్‌గా గడ్డం ప్రసాదరావుతో పాటు అనేక మంది మంత్రులు దళితులుగా ఉన్నారన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్లు, ఆర్‌టిఎ సభ్యుడుఅభిగౌడ్, డిసిసి వైస్ ప్రెసిడెంట్ లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిర, డిసిసి స్పోక్స్‌పర్సన్ నరేందర్ పవార్, జిల్లా అధికార ప్రతినిధి బెలిదే వెంకన్న, కౌన్సిలర్లు దోర్నాల అనిత, రజిని, మంత్రి సుమలత, వంగ ఉమ, డిసిసి కార్యదర్శి మేడ శ్రీనివాస్, బొట్ల శ్రీనివాస్, వేముల మల్లేశం, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## వైటిపిఎస్‌లో ప్రైవేటీకరణను నిలిపివేయాలి

చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో బైఠాయించిన ఉద్యోగులు



**ప్రజాపక్షం/గణపురం:** గణపురం తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థల ప్రయివేటీకరణ, కాంట్రాక్టీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం అన్ని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం కెటిపిపిలో చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో ఉద్యోగులు బైఠాయించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఆగస్టు 20న టిజిపిఇజెఎసి ప్రతినిధులు ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల సిఎండిలతో నిర్వహించిన సంయుక్త సమావేశంలో పలు సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఆయా సమస్యలపై రెండు వారాల్లో మరోసారి సమావేశం నిర్వహించి చర్చిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. అయితే ఇచ్చిన హామీకి విరుద్ధంగా జెన్‌కో యాజమాన్యం యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని బూడిద నిర్వహణ విభాగం, బొగ్గు నిర్వహణ విభాగాలను ప్రయివేట్ సంస్థలకు అప్పగించేందుకు టెండర్లను ఖరారు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు టిజిపిఇజెఎసి నేతలు ఆరోపించారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ కేంద్ర టిజిపిఇజెఎసి పిలుపు మేరకు కెటిపిపి ప్రధాన ఇంజనీర్ కార్యాలయం వద్ద ఉద్యోగులు పెద్ద సంఖ్యలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. యాదాద్రి విద్యుత్ కేంద్రంలోని బూడిద, బొగ్గు నిర్వహణ విభాగాల ప్రయివేటీకరణ, కాంట్రాక్టీకరణ టెండర్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మన హక్కులు మన సంస్థలు మన బాధ్యత అనే నినాదంతో ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిజిపిఇఎకెటిపిపిసభ్యులుపెద్ద సంఖ్యలో పాల్గొన్నా రు.

## మట్టి గణపతిని పూజించి...
# పర్యావరణాన్ని కాపాడండి

అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ మట్టిగణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవిన్యూ) కె.అనిల్‌కుమార్ సూచించారు. శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణలో మట్టి గణపతి ప్రతిమలను జిల్లా అదనపు కలెక్టర్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పండుగను పర్యావరణహితంగా, రసాయన రహితంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్, రసాయన విగ్రహాల వాడకాన్ని పూర్తిగా నివారించి, పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమ ంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి , డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, వివిధ శాఖల జిల్లాఅధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నా రు.

## దళితులకు కెసిఆర్ క్షమాపణ చెప్పాలి

డిసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్
అంబేద్కర్ సెంటర్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** దళితుల పట్ల కెసిఆర్ వివక్షత చూపుతున్నాడని, దళితులు తిరిగిన తన ఫామ్ హౌస్ ప్రాంతంలో పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దళితులను అవమానించినట్టేనని వెంటనే కెసిఆర్ బేషరతుగా దళితుల క్షమాపణ చెప్పాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం బిఆర్ఎస్ నాయకుల అహంకారపూరిత, కుల వివక్షతను ప్రోత్సహించే చర్యలను నిరసిస్తూ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, దళితులను అవమానించేలా వ్యాఖ్యలు చేసినందుకు, అలాగే దళితులు శాంతియుతంగా నిరసన తెలిపిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేసిన ఘటనపై మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ వెంటనే దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలనిడిసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మాజీ పట్టణ అధ్యక్షుడు దేవన్, సీనియర్ నాయకుడు చల్లూరి సమ్మయ్య, భువన సుందర్, క్యాథరాజు సాంబ మూర్తి, జిల్లా కార్యదర్శి పోతర్ల ప్రేమ్ కుమార్, పట్టణ మహిళా అధ్యక్షురాలు మాలతి, కోమల, కోమల రాజేశ్వరి, ఎద్దు పుష్ప, కౌన్సిలర్లు పొన్నకంటి శ్రీను, బిర్టీ పృధ్వి, మూత సహదేవ్, మాకోటి ప్రభాకర్, అరుణ్ రావు, ధారావత్ శారద, కురిమిళ్ల శ్రీనివాస్ బౌత్ విజయ్, సురేష్, గండారపు రమేష్, గురజాల రవి, పుల్ల మహేష్, హైమత్ ఆఫీస్ రేణుక పాషా సునీల్, గన్నారపు రమేష్, నరసయ్య స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మల్బరీ సాగుతో ఎకరాకు రూ.2లక్షల నికర ఆదాయం




**ప్రజాపక్షం/గూడూరు;**రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి అధిక ఆదాయాన్నిచ్చే మల్బరీ సాగుపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ శాఖ అధికారులు సూచించారు. కేంద్ర సిల్క్ బోర్డు 75 సంవత్సరాలు పూర్తి చేస్తుకున్న సందర్భంగా మేరా అభిమాన్ 20 కార్యక్రమాన్ని గూడూరు మండలం లైన్‌తండాలో శుక్రవారం నిర్వహించారు.జాయింట్ డైరెక్టర్ జి అనసూయ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సిల్క బోర్డు మైసూర్ శాస్త్రవేత్త జె శ్రీకాంత్ నాయక్ రైతులకు మల్బరీ సాగుపై పలు సాంకేతిక సూచనలు అందించారు. మల్బరీ సాగుతో ఎకరానికి సుమారు రూ. 2 లక్షల నికర ఆదాయం పొందే అవకాశం ఉందని ఏడాదిలో 5నుంచి 6 పంటలు తీసుకోవచ్చని తెలిపారు.ఈసాగుకు అధిక మొత్తంలో ఎరువులు, పురుగుమందులు అవసరం లేదని కోతులు దొంగల బెడద కూడా తక్కువగా ఉంటుందని వివరించారు.ప్రతి గ్రామంలో కనీసం 50 ఎకరాల్లో మల్బరీ సాగు చేపడితే రైతులు ఆర్థికంగా అభివృద్ధిచెందడంతో పాటు పట్టు పరిశ్రమ ద్వారా యువతకు ,మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి అవకాశలు పెరుగుతాయని జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న తెలిపారు. సెరికల్చర్ అధికారి కె సురేష్ మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతిపిధులు రైతులు పాల్గోన్నారు.

## పకడ్బందీగా నిమజ్జన ఏర్పాట్లు



వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం/ వరంగల్ :** గణపతి విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కాజీపేట బంధం చెరువు, హనుమకొండ సిద్దేశ్వర గుండం, చిన్న వడ్డే పల్లి, ఉర్సు చెరువుల వద్ద గణపతి నిమజ్జన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్, కలెక్టర్‌లు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులు, గుండం వద్ద ఎన్ని వినాయక విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉందో, గతంలో ఆయా ప్రాంతాల్లో ఎన్ని విగ్రహాలను నిమజ్జనం చేశారని అధికారులను పోలీస్ కమిషనర్, కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సందర్భంగా అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శ్వేత, మాట్లాడుతూ గణపతి నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం చెరువులు, గుండంలో నీటి మట్టం తక్కువగా ఉన్నందున పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన తగిన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలన్నారు. చెరువు కట్ట వద్ద అవసరమైన మేరకు చదును చేసే పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నిమజ్జనానికి వచ్చే వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్లు బాగుండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విగ్రహాల సంఖ్య, పరిమాణం, నిమజ్జనానికి అవసరమైన సౌకర్యాలపై ముందస్తు అంచనా వేసుకుని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జనానికి వచ్చే వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలను సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను స్థానికంగానే నిమజ్జనం చేసుకొనే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. నవరాత్రులు పూర్తి కాగానే తొందరగా వినాయకులను కదిలించి నిమజ్జనం కి తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డిసిపి దారా కవిత, ట్రాఫిక్ అడిషనల్ డిసిపి ప్రభాకర్ రావు, జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ రవికుమార్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సామ్య నాయక్, సాగునీటిపారుదల శాఖ అధికారులు కిరణ్ కుమార్, మధుసూదన్ రెడ్డి, జిడబ్ల్యుఎంసి ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఆర్అండ్‌బి ఇఇ దేవిక చౌహాన్, మైనింగ్ ఎడి రామాచారి, కాజీపేట తహసీల్దార్ రాజు, ఎసిపిలు ప్రశాంత్ రెడ్డి, సత్యనారాయణ, కాజీపేట పోలీస్ ఇన్స్‌పెక్టర్ శ్యామ్ సుందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.


ఖమ్మంలో...


నల్లగొండ...చిట్యాలలో

# ఘనంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఆరంభం


హనుమకొండలో...

## ఎర్రచొక్కాలతో కదం తొక్కిన సిపిఐ శ్రేణులు

## అమరవీరులకు ఘనంగా నివాళులు

### తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను దొంగిలించడానికి బిజెపి ప్రయత్నం : తక్కళ్లపల్లి

**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను దొంగిలించడానికి బిజెపి ప్రయత్నిస్తున్నదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. రజాకార్లు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాన్ని శుక్రవారం హనుమకొండలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా సిపిఐ ఆధ్వర్యంలో హనుమకొండ పట్టణంలో బాలసముద్రం నుండి ఏకశిలా పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఎన్.అశోక్ స్టాలిన్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, ఏదునూరి వెంకట్రాజం, నేదునూరి రాజమౌళి, యేషబోయిన శ్రీనివాస్, కండె నర్సయ్య, గుంటి రాజేందర్, నిమ్మల మనోహర్, అల్వాల రాజు, అలకుంట యాకయ్య, నోముల కిషోర్, రాంగోపాల్ చారి తదితరులు పాల్గొన్నారు.

### సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి : నెల్లికంటి

**నల్లగొండ/చిట్యాల :** దొరలు, భూస్వాముల దౌర్జన్యాలు, వెట్టి చాకిరి, నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం మట్టి మనుషులు సాగించిన మహోన్నత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ మతపరమైన పోరాటంగా వక్రీకరించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని అమరవీరుల స్మారక స్తూపం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్, గురిజ రామచంద్రం, ఆర్.అంజాచారి, బొల్లుగురు నర్సింహా, నల్పరాజు రామలింగయ్య, పల్లె శేఖర్‌రెడ్డి, ఎండీ అక్బర్, పెండ్యాల శంకర్, చాపల శ్రీనివాస్, బోడిగె సైదులు, జిల్లా యాదయ్య, సూరిగి చలపతి, గోసుకొండ లింగయ్య బరిగెల వెంకటేష్, జిల్లా సత్యం, కేతా రాజు అంజయ్య, సీమ అంజయ్య, జిల్లా లక్ష్మయ్య, బొబ్బిల శంకర్ రెడ్డి, బోడిగె బక్కశెట్టి, వెంపటి శ్రీనివాస్, పానుగుల శివ, బొల్లుగిరి లింగయ్య, జిల్లా లింగస్వామి, షరీఫ్ పాల్గొన్నారు.

### కమ్యూనిస్టుల పోరాటంతోనే నిజాం పాలన అంతం : బాగం

**ఖమ్మం :** కమ్యూనిస్టుల పోరాటాలతోనే నిజాం రక్కసి పాలన అంతమైందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను శుక్రవారం ఖమ్మం పాత బస్టాండ్ సమీపంలోని గిరిప్రసాద్ విగ్రహం వద్ద ప్రారంభించారు. పోరాట యోధుడు నల్లమల గిరిప్రసాద్ విగ్రహానికి సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పూలమాల వేయగా పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, దొండపాటి రమేష్, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహలక్ష్మి, తోట రామాంజనేయులు, కూచిపూడి రవి, ఏనుగు గాంధీ, మిడికంటి వెంకటరెడ్డి, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

### వక్రీకరణ జాతిద్రోహమే : కలివేణ

**మంచిర్యాల :** తెలంగాణ రైతాంగ మహత్తర సాయుధ పోరాట చరిత్రను బిజెపి వక్రీకరించడం జాతికి ద్రోహం చేయడమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్ మండిపడ్డారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా మంచిర్యాల జిల్లా సిపిఐ కార్యాలయం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మిట్టపల్లి వెంకటస్వామి, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, దాగం మల్లేష్, సుదర్శన్, జోగుల మల్లయ్య, కారుకూరి నగేష్, లింగం రవి, రేగుంట చంద్రకళ, మిరియాల రాజేశ్వర రావు, బాజీ సైదా, సలేంద్ర సత్యనారాయణ, కొట్టే కిషన్ రావు, పూజారి రామన్న, వనం సత్యనారాయణ, మిట్టపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ప్రారంభం సందర్భంగా కరీంనగర్ కోతి రాంపూర్ బైపాస్ రోడ్డులో గల సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన బద్దం ఎల్లారెడ్డి విగ్రహానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, పొనగంటి కేదారి, అందె స్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, పిట్టల సమ్మయ్య, న్యాలపట్ల రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, పైడిపల్లి రాజు, చాడ శ్రీధర్ రెడ్డి, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, బావండ్లపెల్లి యుగేందర్, మచ్చ రమేశ్, నలువాల సదానందం, సాయవేణి రాయమల్లు, బాకం ఆంజనేయులు, కసిబోజుల సంతోష్ చారి, చెంచల మురళి, కాల్వ శ్రీనివాస్ యాదవ్, నునావత్ శ్రీనివాస్, మామిడిపల్లి హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ...గుండ్రాంపల్లిలో..

**పెద్దపల్లి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ, భావితరాలకు ఆ స్ఫూర్తిని అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఘనంగా జరిపారు. కార్యక్రమంలో కోడెం స్వామి, ఆరెపల్లి మానస్ కుమార్, కలపల్లి నవీన్.,ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణిగుంట్ల ప్రీతం సాయి ఆజాద్, తుంగరాజు అఖిల్, శంకర్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం/సుజాతనగర్ :** తెలంగా సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో నేటి నయా రాచరిక పాలకులపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ప్రారంభ సభ శుక్రవారం సుజాతనగర్ మండలం నాయకులగూడెం గ్రామంలో జరిగింది. రావి నారాయణ రెడ్డి స్థూపం వద్ద పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం ఎర్రజెండా ఆవిష్కరించారు. నాయకులగూడెంలో కొమారి రాజయ్య విగ్రహానికి నివాళులర్పించారు. కొమారి హన్మంతరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, సలిగంటి శ్రీనివాస్ వి.పూర్ణచంద్ర రావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, జి వీరస్వామి, కందుల భాస్కర్, భూక్యా దస్రు, జక్కుల రాములు, భూక్యా శ్రీనివాస్, కె.రత్నకుమారి, వర్క అజిత్, ఎండి యూసుఫ్, సత్యనారాయణ చారి, దండు నాగేశ్వర్‌రావు, భూక్య శాంతిశ్రీ, బోయిన విజయ్‌కుమార్, బండి నర్సింహా, దుర్గయ్య, నిమ్మల రాంబాబు, వైఎస్ గిరి, మల్లేష్, కేశవరావు, పొదిలి శ్రీను, గోరేంట్ల ధర్మ, కున్సోతు శంకర్, కొమారి కృష్ణ, షాహీన్, మేదిని లక్ష్మి, కైసర్, ఫహీమ్, శ్రీను, రమేష్, కత్తి వెంకన్న, లక్ష్మయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

**జనగామ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను తప్పుడు పద్ధతుల ద్వారా మరుగు పర్చాలని మతోన్మాద బిజెపి చూస్తుందని సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి అన్నారు. జనగామలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో కావటి యాదగిరి అధ్యక్షతన సాయుధ పోరాట సమావేశం జరిగింది. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, సొప్పరి జోమయ్య, రావుల సదానందం, చామకూర యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ సెంటర్‌లో రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చేన్నబోయిన కమలమ్మ, అప్పన్నల స్థూపాలకు సిపిఐ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాటిపాముల వెంకట్రాములు, మేకల రవి, పంజాల రమేష్, గుండె బద్రి, అక్కపెల్లి రమేష్, వీరగొని శంకరయ్య, కందిక చెన్నకేశవులు, గుంపెల్లి మునీశ్వరుడు, చింతకింది కుమారస్వామి, ఎండి అక్బర్ పాషా, ల్యాదల్ల శరత్, తాళ్లపెల్లి రహేళ, పరికిరాల రమేష్, జన్ను రవి, తాళ్లపెల్లి జాన్ పాల్, సాంబమూర్తి, మియాపురం గోవర్ధన చారి, బోట్ల శ్రీనివాస్, చిట్యాల సువర్ణ, బొడ్డుపెల్లి సాయిలు, ప్రభాకర్, మస్క సుధీర్, లౌడియ దస్రు, చెలకల రాజు, ఆరెల్లి రవి, పొట్టి పాక రవి పాల్గొన్నారు.

**పెద్దకొత్తపల్లి :** కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాల ప్రారంభ సభను సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కే.కేశవులు గౌడ్, పెబ్బేటి విజయుడు, తన్నీరు నరసింహ, ఆర్.ఇందిరా, ఈర్ల చంద్రమౌళి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు తన్నీరు మల్లయ్య, గుర్రపు కురుమయ్య, ఎండీ యూసుఫ్, లక్ష్మీ నారాయణ, రాధాకృష్ణ, జంగం శివుడు, సంగం కృష్ణ, సాయిలు, బాలస్వామి, ఇటికల కురుమయ్య, జీ.రామకృష్ణ, చింతపల్లి కురుమయ్య, ప్రకాష్, సుదర్శన్‌రెడ్డి, నిరంజన్ నాయుడు, శివప్రసాద్, ఎండీ ఖాజా మొయినుద్దీన్, సత్యం, ధర్మరాజు, విష్ణు, కొత్త సంతోష్, గణేష్, మిద్దె రామకృష్ణ, పూజారి శేఖర్, నరసింహ, రామకృష్ణ, చందు, యాదయ్య, సుదర్శన్ గౌడ్, మధు, నరసింహ, కురుమయ్య, దాము, బంగారమ్మ, శివ, సత్యనారాయణ, పర్వతాలు, కురుమయ్య పాల్గొన్నారు.

**కాజీపేట :** తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా హనుమకొండ జిల్లా కాజీపేట మండల సమితి ఆధ్వర్యంలో రాంపూర్‌లోని అర్శనపల్లి హనుమంతరావు స్తూపం వద్ద వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మండల కార్యదర్శి మాలోతు శంకర్, మద్దెల ఎల్లేష్, తోట బిక్షపతి, మునిగాల బిక్షపతి, ఎన్‌వి.స్టాలిన్, మాలోత్ శంకర్‌నాయక్, కొట్టే వెంకటేష్, బొట్టు బిక్షపతి, కుడి స్వామి, మునిగాల ఐలయ్య, రసమల్ల కుమార్, శ్రీకాంత్, జి.కుమార్ పాల్గొన్నారు.

**సిద్దిపేట అర్బన్ :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట వీరులు, సిద్దిపేట మొదటి ఎంఎల్‌ఏ ఎడ్ల గురువారెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, పట్టణ కార్యదర్శి గజభీంకార్ బన్సీలాల్, ఎస్‌కె హరిఫ్, మిట్టపల్లి సుధాకర్, సంగెం మధు, రామగళ్ల నరేశ్, కొమ్ము కనకరాజ్, యాద మల్లయ్య, మన్నె రవి, బెజగాం బాబు, మహంకాళి మహేష్, బత్తుల రంజిత్ పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్ :** మండలంలోని మగ్దూంనగర్ లోని నాగయ్య విగ్రహం వద్ద సిపిఐ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, ఏసురత్నం, స్వామి, హరినాథ్, రాములు, ప్రజానాట్య మండలి బాబు, నర్సింహారెడ్డి, సహదేవరెడ్డి, వెంకటచారి, వెంకటేష్, శ్రీనివాస్‌చారి, శ్రీనివాస్, పెంటన్న, కార్తిక్, జంబూ, ధర్మేంద్ర, సాహు, పాల్గొన్నారు.


మంచిర్యాలలో...


కరీంనగర్‌లో...


భద్రాచలంలో...


నాగర్‌కర్నూల్‌లో...


ఖమ్మంలో....


పెద్దపల్లిలో...


కాజీపేటలో...


సిద్దిపేటలో..


జనగామలో...


వరంగల్‌లో...


కుత్బుల్లాపూర్‌లో...

## అధికారికంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లిబర్టీ కూడలి వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకు 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తి యాత్ర' పేరుతో భారీ రెడ్ షర్ట్ వాలంటీర్ల ప్రదర్శన నిర్వహించారు.

**ఓటు బ్యాంకు రాజకీయం కోసమే అధికారిక నిర్వహణకు నిరాకరణ : పల్లా**

ప్రదర్శకులను ఉద్దేశించి పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఎంఐఎం, ముస్లిం ఓటు బ్యాంకు రాజకీయం కోసమే సెప్టెంబర్ 17ను హైదరాబాద్ సంస్థానం వీలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేదని విమర్శించారు. ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా కాంగ్రెస్ పార్టీ పరంగా ఈ దినోత్సవాన్ని జరుపుతోందే తప్ప, అధికారికంగా నిర్వహించడానికి నిరాకరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సాయుధ పోరాట దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తేనే బిజెపి వక్రీకరణలకు అడ్డుకట్ట పడుతుందని, సిఎం రేవంత్ రెడ్డి ఆ దిశగా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఎలాంటి చరిత్ర లేని బిజెపి నాయకులు, దీనిని హిందూముస్లింల మధ్య వివాదంగా మార్చి చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. షేక్ బందగి, షోయబుల్లా ఖాన్, మఖ్దూం మొహియుద్దీన్ వంటి ఎందరో ముస్లిం వీరులు నిజాం నిరంకుశత్వానికి, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించారని స్పష్టం చేశారు.

**సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి : కూనంనేని సాంబశివరావు**

నిజాం నవాబు కబంధ హస్తాల నుంచి హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తి చేసి భారతదేశంలో విలీనం చేయాలనే డిమాండ్‌తో కమ్యూనిస్టులు చేసిన పోరాటాన్ని, పోరాటంలో పాల్గొన్న యోధుల పేర్లను ప్రభుత్వాలు వాడుకుంటున్నాయే తప్ప, ఆ పోరాటానికి నాయకత్వం వహించిన సిపిఐ, ఎర్రజెండా పేర్లను చెప్పకపోవడం దారుణమని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, పుచ్చలపల్లి సుందరయ్య, భీమిరెడ్డి నరసింహారెడ్డి, ప్రొఫెసర్ జయశంకర్ వంటి నాయకుల చరిత్రను, వారసత్వాన్ని హైజాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 17ను ప్రభు త్వం గౌరవప్రదంగా, అధికారికంగా నిర్వహించాలని, తెలంగాణ పాఠ్యాంశాల్లో సాయుధ పోరాట నిజమైన చరిత్రను, కమ్యూనిస్టుల త్యాగాలను చేర్చాలని డిమాండ్ చేశారు. సాయుధ పోరాట అమరవీరుల స్మారకార్థం వారి విగ్రహాల తో కూడిన ప్రత్యేక పార్క్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

**సాయుధ పోరాటం హిందూ-ముస్లింల తగాదా కాదు: ఈ.టి. నరసింహ్మా...**తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను కొందరు కావాలనే హిందూముస్లింల మధ్య జరిగిన వివాదంగా వక్రీకరిస్తున్నారని, ఇది కేవలం భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా నిరుపేదలు చేసిన పోరాటమని ఈ.టి. నరసింహ స్పష్టం చేశారు. నిజాంను, రజాకార్లను ఎదిరించిన వారిలో ముస్లిం యోధులు ఎందరోఉన్నారన్నారు.

**సాయుధ పోరాటం మట్టి మనుషుల చరిత్ర : నెల్లికంటి సత్యం ...**తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే ఎంతో విశిష్టమైనదని, అది ఈ నేల మట్టి మనుషులు చేసిన వీరోచిత పోరాటమని నెల్లికంటి సత్యం అన్నారు. 'అయ్యా నీ బాన్చన్' దొర అని పడిగాపులు గాచిన ప్రజలను చైతన్యపరచి, భూమి కోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం సాయుధ సమరంలోకి నడిపించిన చరిత్ర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఉందన్నారు. దొరల గడీలకు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా యావత్ తెలంగాణ ప్రజానీకం ఉవ్వెత్తున లేచి పోరాడిందన్నారు. నేటికీ భూమి కోసం, పంటలకు గిట్టుబాటు ధర కోసం, సామాజిక న్యాయం కోసం నిలబడుతున్న ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. కమ్యూనిస్టు శ్రేణులంతా అదే పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.జ్యోతి, ఎస్.ఛాయాదేవి, ఎ.రవీంద్ర చారి, విజయ లక్ష్మి పండిత్, ఈ.ఉమామహేశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, ఎం.నర్సింహ్మా, జి.చంద్రమోహన్‌గౌడ్, ఫైమిదా, ముత్యాల యాదిరెడ్డి, కె.ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కపతం యాదగిరి, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మర్రి శ్రీమాన్, ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీకాంత్, తెలంగాణ ప్రజా నాట్యమండలి అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా, వర్కింగ్ ఉమెన్ ఫోరం సీనియర్ నాయకురాలు పి.ప్రేమ్ పావని తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు యువతకు తగిన ఉద్యోగావకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఎఐవైఎఫ్ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మర్రి శ్రీమాన్, ప్రధాన కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్ విమర్శించారు. నిరుద్యోగ సమస్యతోపాటు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాద పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా మిలిటెంట్ పోరాటాలు నిర్వహిస్తామని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎఐవైఎఫ్‌ను మరింత బలోపేతం చేసి యువత సమస్యలపై నిరంతర ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ముఖ్యంగా నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచడంతోపాటు యువత హక్కుల కోసం పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.బాలకృష్ణ, షేక్ మహమూద్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సల్మాన్ బేగ్, మజీద్ అలీ ఖాన్, రాజ్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అమలు చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

యూనియన్స్ పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ గన్‌ఫౌండ్రీలోని ఐడిబిఐ జోనల్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన పలు బ్యాంకుల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ వెల్లంకి మాట్లాడుతూ 5 రోజుల పని దినాలు అమలు చేయాలని, పర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ అమలు చేయాలని, ఐడిబిఐ బ్యాంక్‌ను ప్రైవేటీకరించరాదని డిమాండ్ చేశారు. ఈ మూడు ప్రధాన డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే ఈనెల 28, 29, 30 తేదీల్లో మరో మూడు రోజుల సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. ధర్నాలో అసోసియేషన్ ఎపి, తెలంగాణ అధ్యక్షుడు ఐ.హరనాథ్, అసోసియేషన్ ఎపి, తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఎస్.సుబ్రహ్మణ్యం, వైస్ చైర్మన్ మురళి, సెక్రటరీ సీతారామ్, విట్టల్, క్రాంతి, బాబురావు, ఫైరోజ్, సుగీత, శ్రావ్య, సుందర్, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com